భూ యాజమాన్య హక్కు చట్టం

రద్దు చేసే వరకూ పోరాటం

- ఐలు జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షులు సుంకర రాజేంద్రప్రసాద్

3

PRAJASAKTI Regd.No. 15795/68
సిటీ◆
ప్రజాశక్తి
ప్రతి అక్షరం ప్రజల పక్షం
Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu
సంపుటి : 43 సంచిక : 237 | విజయవాడ, సోమవారం 1 ఏప్రిల్ 2024 | 6 + 8 పేజీలు వెల : 5.50
Vol No | Vijayawada, Monday 1 April 2024 | Rs



గుజరాత్ ఆల్‌రౌండ్ షో

- ఓడిన సన్‌రైజర్స్

6

సచివాలయాల్లోనే పింఛన్లు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఎన్నికల కోడ్ నేపథ్యంలో రాష్ట్రంలో సామాజిక భద్రత పింఛన్ల పంపిణీపై నెలకొన్న సందిగ్ధతకు తెరపడింది. రాష్ట్రంలో ఎన్నికల ప్రక్రియ ముగిసే వరకు పింఛనుదారులకు సంబంధిత గ్రామ, వార్డు సచివాలయాల్లోనే పింఛన్లు పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్), గ్రామ, వార్డు సచివాలయ శాఖలు ఆదివారం

ఆదేశాలు జారీ చేశాయి. జిల్లా కలెక్టర్లు, డిఆర్‌డిఎ ప్రాజెక్టు డైరెక్టర్లు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపిడిఒలు, పంచాయతీ సెక్రటరీలు, వార్డు అడ్మిన్, వెల్ఫేర్ సెక్రటరీలు తక్షణమే పింఛన్ల పంపిణీకి అవసరమైన ఏర్పాట్లు చేసుకోవాలని ఆదేశాల్లో పేర్కొన్నారు. ఈ ఆదేశాల ప్రకారం.. లబ్ధిదారులు ఆయా సచివాలయాలకు వారి ఆధార్ కార్డులు తీసుకెళ్లి, వేలిముద్ర వేసి సచివాలయం సిబ్బంది నుంచి పింఛను పొందొచ్చు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లోకి రావటంతో వైసిపి ప్రభుత్వం తీసుకొచ్చిన వలంటీరు వ్యవస్థపై కేంద్ర ఎన్నికల సంఘం ఆంక్షలు విధించిన విషయం తెలిసిందే.

65,92,466 మంది పింఛనుదారులు

ప్రభుత్వ లెక్కల ప్రకారం.. రాష్ట్రంలో అన్ని రకాల పింఛనుదారులు 65,92,466 మంది ఉన్నారు. ప్రతినెలా వీరికి ప్రభుత్వం దాదాపు రూ.1,958 కోట్లను పంపిణీ చేస్తోంది. అయితే ఒకటవ తేదికి బదులుగా 3 లేదా 4వ తేదీ నుంచి పింఛను పంపిణీ ప్రక్రియ ఉంటుందని అధికారులు చెబుతున్నారు.

సకాలంలో పెన్షన్ అందించేలా చర్యలు

- సిపిఎం రాష్ట్ర కమిటీ డిమాండ్

2



అభివాదం చేస్తున్న 'ఇండియా' వేదిక అగ్రనేతలు

మోడీ సర్కార్‌ను గద్దె దించాల్సిందే

- నియంతలా వ్యవహరిస్తున్న బిజెపి • దేశ ప్రజానీకానికి 'ఇండియా' పిలుపు
- ప్రజాస్వామ్య పరిరక్షణ ర్యాలీకి భారీగా తరలివచ్చిన జనం • కిక్కిరిసిన రామ్‌లీలా మైదానం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

'ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ఓ నియంత. మతం పేరుతో సమాజాన్ని చీలుస్తున్నారు. రాజ్యాంగ సంస్థలను ధ్వంసం చేసి, ప్రతిపక్షాలను వేటాడుతున్నారు. ఏకపక్ష విధానాలతో అధికారంలో కొనసాగాలని చూస్తున్నారు. దేశాన్ని, రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాలంటే అప్రకటిత ఎమర్జన్సీని ప్రతిఘటించాలి. మోడీ సర్కారును గద్దెదించాలి'. అని దేశ ప్రజానీకానికి ఇండియా నేతలు పిలుపునిచ్చారు. 'సేవ్ డెమోక్రసీ' నినాదంతో ఆదివారం ఢిల్లీలోని చారిత్రాత్మక రామ్‌లీలా మైదాన్‌లో ఇండియా ఫోరమ్ నిర్వహించిన మహార్యాలీ, బహిరంగ సభకు ప్రజానీకం వెల్లువెత్తింది. కేవలం 20 వేల మందికే అనుమతిస్తామని ఢిల్లీ పోలీసులు విధించిన ఆంక్షలను ప్రజానీకం ఏమాత్రం ఖాతరు చేయలేదు. లక్షలాది మంది తరలిరావడంతో రామ్‌లీలా మైదాన్ నిండిపోయింది. కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు సోనియా గాంధీ, ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ, నేషనల్ కాన్ఫరెన్స్ నేత ఫరూక్ అబ్దుల్లా, పిడిపి అధ్యక్షురాలు మెహబూబా ముఫ్తీ, పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్


రామ్‌లీలా మైదానంలో భారీ బహిరంగ సభకు హాజరైన ప్రజానీకం

మాన్, ఆర్‌జెడి నేత తేజస్వీ యాదవ్, ఎన్‌సిపి అధ్యక్షుడు శరద్ పవార్, సిపిఐ (ఎంఎల్) ప్రధాన కార్యదర్శి దీపాంకర్ భట్టాచార్య, శివసేన చీఫ్ ఉద్ధవ్ థాకరే, డిఎంకె నేత తిరుచ్చి శివ, టిఎంసి నేత డెరిక్ ఓబ్రెయిన్, విసికె నేత తిరుమవళవన్, ఆప్ నేతలు, ఢిల్లీ మంత్రులు గోపాల్ రాయ్, అతిషి, సౌరబ్ భరద్వాజ్, కైలాష్ గెహ్లోట్ తదితరులు హాజరయ్యారు.

బిజెపికి ఓటు .. ప్రాణానికి చేటు : ఖర్గే

పెద్ద సంఖ్యలో హాజరైన ప్రజానీకాన్ని ఉద్దేశించి ఎఐసిసి అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే మాట్లాడుతూ ఇది ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని పరిరక్షించే పోరాటమన్నారు. 'ఆర్‌ఎస్‌ఎస్, బిజెపి విషం. దానిని రుచి చూడకండి. వారు దేశాన్ని నాశనం చేస్తున్నారు' అని ఆయన అన్నారు. ఈ ఎన్నికల్లో బిజెపికి ఓటువేస్తే ప్రాణం మీదకు తెచ్చుకున్నట్టేనని ఆయన అన్నారు. 'భిన్నత్వంలో ఏకత్వానికి ఇది ఒక వేదిక. మన భిన్నత్వంలో ఏకత్వం ఉంది. అందుకే ఈ ర్యాలీని నిర్వహించాం.' అని చెప్పారు. ప్రతిపక్షాలు ఐక్యంగా వ్యవహరించాలని అప్పుడే బిజెపిని ఓడించగలమని అన్నారు.

'ఇండియా' గెలుస్తుంది : సీతారాం ఏచూరి

ఇండియా ఏకమవుతుందని, ఇండియా గెలుస్తుందని సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి అన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో మిగతా 5లో

ఐదు డిమాండ్లు

ఇండియా ఫోరమ్ సభ ఐదు డిమాండ్లను ఎన్నికల కమిషన్ ముందు ఉంచింది.

- అన్ని పార్టీలకు సమాన అవకాశాలను కల్పించాలి.
- ఐటి,సిబిఐ, ఇడి దాడులను నిలిపివేయాలి.
- హేమంత్ సోరెన్, అరవింద్ కేజ్రీవాల్‌ను తక్షణం విడుదల చేయాలి.
- ఆర్థికంగా ప్రతిపక్షాల గొంతు నులిమే చర్యలు ఆపాలి.
- ఎలక్టోరల్ బాండ్ల రూపంలో బిజెపి చేసిన నిధుల దోపిడిపై సుప్రీంకోర్టు పర్యవేక్షణలో విచారణకు సిట్ ఏర్పాటు చేయాలి.

'ఉక్కు'పై తేల్చాకే ప్రచారం

- బిజెపి, టిడిపి, జనసేనకు బొత్స అల్టిమేటం
- ప్రయివేటీకరణ లేదని కేంద్రం ప్రకటించాలి

ప్రజాశక్తి- ఎంవిపి.కాలనీ (విశాఖపట్నం)

స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణను విరమించుకున్నట్టు కేంద్ర ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేసిన తర్వాతే కూటమి కట్టిన టిడిపి, జనసేన, బిజెపిలు రాష్ట్రంలో ప్రచారం చేపట్టాలని రాష్ట్ర విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన వైసిపి విశాఖ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీలక్ష్మి క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ అంశం పూర్తిగా కేంద్ర ప్రభుత్వం పరిధిలోనిదని, రాష్ట్ర ప్రభుత్వం ఏనాడో దీనిపై అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపిందని చెప్పుకొచ్చారు. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణను అడ్డుకుంటామని ప్రగల్బాలు పలికిన టిడిపి, జనసేన పార్టీలు ఎట్టి పరిస్థితుల్లోనైనా ప్రయివేటీకరణ చేసి తీరుతామని ప్రకటించిన బిజెపితో జతకట్టి ప్రజలకు తీవ్ర అన్యాయం చేశాయని విమర్శించారు. ఉక్కును రక్షిస్తామని ప్రకటన చేయకుంటే ఈ ప్రాంత ప్రజలు ఇక్కడ తిరగనివ్వబోరని గుర్తెరగాలన్నారు. స్థానికేతరులకు, లాబీయిస్టులుగా పనిచేసే వారికి టిడిపి సీట్లు కేటాయించారని విమర్శించారు. ఉత్తరాంధ్ర ప్రజల ఆత్మాభిమానంతో ఆటలాడుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రజల కోసం కూటమిలో చంద్రబాబు చేరలేదని, ఆయన కొడుకు రక్షణ కోసమే జతకట్టారని విమర్శించారు. ఈ సమావేశంలో వైసిపి విశాఖ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీలక్ష్మి, ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు కోలా గురువులు పాల్గొన్నారు.

పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజాస్వామ్యం, లౌకికవాదం పరిరక్షణే లక్ష్యం

- రాజ్యాంగ మౌలిక పునాదుల్ని ధ్వంసం చేస్తున్న మోడీ ప్రభుత్వం
- సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు



ప్రజాశక్తి- హైదరాబాద్ బ్యూరో

పార్లమెంటు ఎన్నికల్లో ప్రజాస్వామ్యం, లౌకికవాదం, నీతి, నిజాయితీని పరిరక్షించుకోవడమే ప్రధాన లక్ష్యమని సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు తెలిపారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం మోడీ నాయకత్వంలో రాజ్యాంగ మౌలిక పునాదులను ధ్వంసం చేస్తోందన్నారు. దేశాన్ని రక్షించుకోవడం కోసమే ప్రతిపక్షాలు ఇండియా వేదికగా ఏర్పడ్డామని చెప్పారు. 2019లో వచ్చిన ఫలితాలు రావనే భయం బిజెపిలో ఉందని. అందుకే ఎన్‌డిఎకు 400కుపైగా సీట్లు వస్తాయనే నినాదాన్ని ముందుకు తెచ్చిందని పేర్కొన్నారు. మోడీకి భయం లేకుంటే ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్‌ను, జార్ఖండ్ మాజీ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్‌ను అరెస్టు చేసేవారు కాదన్నారు. బిజెపిని ఈ ఎన్నికల్లో గద్దెదించడం తమ తక్షణ రాజకీయ కర్తవ్యమని తెలిపారు. బిజెపి మతోన్మాద విధానాలను ప్రశ్నిస్తూ విస్తారంగా దేశవ్యాప్తంగా ప్రచారం చేయాలని సిపిఎం నిర్ణయించిందని వివరించారు. సిపిఎం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శివర్గ సమావేశం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు టి.జ్యోతి అధ్యక్షతన శనివారం, రాష్ట్ర కమిటీ సమావేశం సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు అధ్యక్షతన ఆదివారం జరిగాయి. ఈ సందర్భంగా ఎంబి భవన్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో రాఘవులు మాట్లాడారు. బిజెపి ప్రభుత్వం ప్రతిపక్షాలను కకావికలం చేయాలని చూస్తోందని తెలిపారు. రాజ్యాంగ వ్యవస్థలను ప్రయోగించి భయభ్రాంతులకు గురి చేస్తోందని, ప్రతిపక్షాల ఎన్నికల ప్రచారాన్ని బలహీనపరిచేందుకు కుట్రలు చేస్తోందని విమర్శించారు. ప్రతిపక్షాలను ప్రలోభాలకు గురిచేసి లొంగదీసుకోవడం, లేదంటే ఇడి, సిబిఐ, ఐటిని ఉపయోగించి భయభ్రాంతులకు గురిచేయడం, లొంగకుంటే అరెస్టు చేసి జైలులో పెడుతుండడం వంటివి చేస్తోందని వివరించారు. నీతికి నిర్వచనాన్ని బిజెపి మార్చివేసిందన్నారు. బిజెపిలో ఉంటే నీతిపరులు, లేదంటే అవినీతిపరులు అన్నట్టుగా వ్యవహరిస్తోందని విమర్శించారు. ఎన్నికల బాండ్లలో అత్యధిక భాగం బిజెపికి వచ్చాయని వివరించారు. అధికారంలో ఎవరుంటారు, ప్రతిపక్షంలో ఎవరుంటారనేది తమకు ముఖ్యం కాదని, దేశంలో ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాల్సిన అవసరముందని అన్నారు. ఆర్థికంగా గొప్ప ముందడుగు వేశామని బిజెపి చెప్తున్న గొప్పలను తోసిపుచ్చారు. బ్రిటీష్ వారి కాలం కంటే ఇప్పుడు అసమానతలు ఎక్కువయ్యాయంటూ ఓ సంస్థ ప్రకటించిందని వివరించారు. రాజ్యాంగ మౌలిక స్వరూపాన్ని పరిరక్షించుకోవాలని, ఇందులో ప్రజలు భాగస్వాములు కావాలని కోరారు. బిఆర్‌ఎస్ అధికారంలోకి వచ్చాక ఆపరేషన్ ఆకర్ష్ పేరుతో కాంగ్రెస్ ఎమ్మెల్యేలను చేర్చుకున్నారని, ఇప్పుడు రేవంత్‌రెడ్డి ఆపరేషన్ ఆకర్ష్ పేరుతో బిఆర్‌ఎస్ ఎమ్మెల్యేలను కాంగ్రెస్‌లో చేర్చుకుంటున్నారని అన్నారు. తెలంగాణలో బిజెపి ప్రమాదం ముంచుకొస్తున్నదని, మతోన్మాద వాతావరణాన్ని సృష్టించడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. బిజెపిని నిలువరించాలని, తెలంగాణ రాష్ట్రంలో ఒక్క ఎంపీ స్థానంలో కూడా గెలవనీయకుండా చూడాలని ప్రజలను కోరారు.


చంద్రబాబు సమక్షంలో మాట్లాడుతున్న కందుల

ఎన్నికల్లో ఓడితే నా శవాన్ని చూస్తారు

- టిడిపి మార్కాపురం అభ్యర్థి కందుల నారాయణరెడ్డి

ప్రజాశక్తి- మార్కాపురం (ప్రకాశం జిల్లా)

'ఎన్నికల్లో నేను పోటీ చేసేందుకు చంద్రబాబు అవకాశం కల్పించారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని నన్ను గెలిపించుకోవాలి. లేనిపక్షంలో నా శవాన్ని చూడాల్సి వస్తుంది' అని టిడిపి మార్కాపురం అభ్యర్థి కందుల నారాయణరెడ్డి ఆవేశంగా మాట్లాడారు. చంద్రబాబు సమక్షంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేయడం చర్చనీయాంశమయ్యాయి. ప్రకాశం జిల్లా మార్కాపురం పట్టణంలో ఆదివారం నిర్వహించిన ప్రజాగళం సభలో చంద్రబాబు పాల్గొన్నారు. ఈ సభలో కందుల నారాయణరెడ్డి మాట్లాడుతూ పై మేరకు వ్యాఖ్యలు చేశారు.

స్వతంత్ర జర్నలిజం గొంతు నొక్కేందుకే

మీడియాలో ఆరోపణలను ఖండించిన న్యూస్‌క్లిక్

న్యూఢిల్లీ : ఢిల్లీ పోలీసుల ప్రత్యేక సెల్ దర్యాప్తు చేస్తున్న యుఎపిఎ కేసుకు సంబంధించి మీడియాలో వస్తున్న ఆరోపణలన్నింటినీ న్యూస్‌క్లిక్ నిర్ద్వంద్వంగా తిరస్కరించింది. చైనా నుంచి కానీ, చైనా సంస్థల నుంచి కానీ న్యూస్‌క్లిక్‌కు ఎలాంటి నిధులు లేదా ఆదేశాలు అందలేదని ఇప్పటికే తాము అనేకసార్లు చెబుతూ వచ్చామని తెలిపింది. న్యూస్‌క్లిక్ ఎలాంటి జాతి వ్యతిరేక కార్యకలాపాల్లో కూడా పాల్గొనలేదని స్పష్టం చేసింది. వివిధ ప్రభుత్వ సంస్థలే న్యూస్‌క్లిక్‌పై పలుమార్లు ఇటువంటి ఆరోపణలు చేస్తూ వచ్చాయని తెలిపింది. ఈ ఆరోపణలకు సంబంధించి వారు ఎలాంటి సాక్ష్యాధారాలను కూడా అందచేయలేకపోయారని పేర్కొంది. తాజా వాదనలేవీ కూడా ఇందుకు భిన్నంగా లేవని వ్యాఖ్యానించింది. న్యూస్‌క్లిక్ చేసే కార్యకలాపాలన్నీ పబ్లిక్ డొమైన్‌లోనే వుంటాయని, న్యూస్‌క్లిక్‌పై చేస్తున్న ఆరోపణలను ఒక్కసారి పరిశీలించినా కూడా ఇదంతా స్వతంత్ర జర్నలిజం గొంతు నొక్కే ప్రయత్నమని స్పష్టమైపోతుందని వివరించింది. విచారణ సమయంలో ఈ ఆరోపణలన్నీ కూడా తోసిపుచ్చబడతాయని తాము విశ్వసిస్తున్నట్లు తెలిపింది. తమ పని ఏమిటో నిరూపించబడుతుందని పేర్కొంది.

స్వతంత్రంగా వార్తా కథనాలు ఇచ్చే న్యూస్‌క్లిక్‌పై కేంద్ర ప్రభుత్వ కక్షసాధింపు చర్యలపై దేశవ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తినా కేంద్రం మొండిగా వ్యవహరిస్తోంది. తప్పుడు ఆరోపణలతో అరెస్టు చేసిన ప్రబీర్ పుర్కాయస్థను వెంటనే విడుదల చేయాలని, కేసులన్నింటినీ ఉపసంహరించుకోవాలని పలు పాత్రికేయ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.



గాజాలో కాల్పుల విరమణపై కైరోలో చర్చలు

- శాంతిని నెలకొల్పండి : ఈస్టర్ సందర్భంగా పోప్ పిలుపు
- శాశ్వత కాల్పుల విరమణకు మూడు దేశాల పిలుపు

గాజా : ఇజ్రాయిల్, హమాస్‌ల మధ్య కాల్పుల విరమణ ఒప్పందాన్ని కుదిర్చేందుకు ఈజిప్ట్ రాజధాని కైరోలో ఆదివారం చర్చలు పునరుద్ధరించారు. ఇజ్రాయిల్ ప్రధాని బెంజామిన్ నెతన్యాహు అంగీకరించిన కొద్ది రోజుల తర్వాత ఆదివారం చర్చలు ప్రారంభమయ్యాయని ఈజిప్ట్ భద్రతా వర్గాలు ధ్రువీకరించాయి. జర్నలిస్టుల శిబిరంపై ఇజ్రాయిల్ బలగాలు జరిపిన దాడిలో ఇద్దరు మరణించగా, పలువురు గాయపడ్డారు. ఇప్పటివరకు గాజాలో 32,782మంది మరణించగా, 75,298మంది తీవ్రంగా గాయపడ్డారు.

శాంతిని నెలకొల్పండి : పోప్

యుద్ధంతో అతలాకుతలమవుతున్న గాజాలో తక్షణమే శాంతి నెలకొనాలని, కాల్పుల విరమణ పాటించాలని పోప్ ఫ్రాన్సిస్ పిలుపునిచ్చారు. ఈస్టర్ సందర్భంగా ఆయన ఈ సందేశం ఇచ్చారు. సెయింట్ పీటర్స్ బసిలికాలో సెంట్రల్ బాల్కనీ నుండి ఆయన నగర, ప్రపంచ ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. ప్రధానంగా శాంతిని నెలకొల్పడంపైనే దృష్టి పెట్టాలని కోరారు. ఇంకా చిన్నారుల కళ్లలో కష్టాలను, దైన్యాన్ని ఎన్నాళ్లు చూడాలి? అని ఆయన ప్రశ్నించారు. యుద్ధ ప్రాంతాల్లో నివసిస్తున్న పిల్లలు నవ్వడం మరిచిపోయారని ఆందోళన వ్యక్తం చేశారు. 'ఎందుకు ఈ మరణాలు? ఎందుకు ఈ విధ్వంసం? అని వారు మనల్ని ప్రశ్నిస్తున్నారు. యుద్ధం అనేది ఎల్లప్పుడూ అసంబద్ధమేనని' అన్నారు.

శాశ్వత కాల్పుల విరమణకై పిలుపు

గాజాలో తక్షణమే, శాశ్వత కాల్పుల విరమణ జరగాలని ఈజిప్ట్, ఫ్రాన్స్, జోర్డాన్ పిలుపునిచ్చాయి. హమాస్ చెరలో వున్న బందీలందరినీ విడుదల చేయాలని కోరాయి. కైరోలో శనివారం ఈ మూడు దేశాల దౌత్యవేత్తలు సమావేశమయ్యారు. అనంతరం వారు ముగ్గురు సంయుక్త పత్రికా సమావేశంలో పాల్గొన్నారు. ఈ యుద్ధానికి రాజకీయ పరిష్కారంగా తమ ప్రభుత్వం భద్రతా మండలిలో ముసాయిదా తీర్మానాన్ని ప్రవేశపెట్టనున్నట్లు ఫ్రాన్స్ విదేశాంగ స్టెఫాన్ సెజర్న్ తెలిపారు. రెండు దేశాల పరిష్కార మార్గానికి అవసరమైన అన్ని ప్రామాణికాలను ఇందులో పొందుపరచనున్నట్లు తెలిపారు.



చంద్రబాబు కోరుకునే రాష్ట్ర ప్రయోజనాల్లో స్టీల్‌ప్లాంట్ స్థానం ఎక్కడ?

- ఉక్కు ఫ్యాక్టరీ వైపు కన్నెత్తి చూడలేదెందుకు!
- నామమాత్రంగానే రాష్ట్ర ప్రభుత్వ స్పందన
- విశాఖ కార్మికులు, ప్రజల్లో నడుస్తోన్న చర్చ

లోపలి పేజీలో..

రాష్ట్రపతి ముర్ముకు మళ్లీ అవమానం

- అద్వానీకి భారతరత్న ప్రదానం సందర్భంగా ఘటన
- ప్రధాని మోడీ తీరుపై సర్వత్రా ఆగ్రహం

న్యూఢిల్లీ : దేశ ప్రథమ పౌరులు అయిన రాష్ట్రపతి ద్రౌపది ముర్మును కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం మరోమారు అవమానించింది. బిజెపి సీనియర్ నేత, మాజీ ఉప ప్రధాని ఎల్‌కె అద్వానీకి భారతరత్న పురస్కారాన్ని అందజేసేందుకు రాష్ట్రపతి ఆయన నివాసానికి వెళ్లారు.

ఆరోగ్యం సహకరించకపోవడంతో ఆయన రాష్ట్రపతి భవన్‌కు రాలేరని భావించి స్వయంగా ద్రౌపది ముర్ముయే ఆదివారం అద్వానీ నివాసానికి వెళ్లి పురస్కారం ప్రదానం చేశారు. ఈ సమయంలో ఆరోగ్యం సహకరించనందున అద్వానీ కుర్చీలో ఆసీనులైవున్నారు. ఆయన పక్కనే ప్రధానమంత్రి నరేంద్ర మోడీ కూర్చున్నారు. అయితే అద్వానీకి రాష్ట్రపతి ముర్ము పురస్కారాన్ని ప్రదానం చేస్తున్న సందర్భంలో కానీ, ఆ తర్వాత కానీ ప్రధాని మోడీ కుర్చీలో నుంచి లేచి నిలబడలేదు. రాష్ట్రపతి ముర్ము నిల్చుని ఉన్నా కూడా ఆయన కుర్చీలోనే


అద్వానీకి భారతరత్న అందజేసిన అనంతరం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నిలబడి వుండగా..కుర్చీలోనే కూర్చొని వున్న ప్రధాని మోడీ

కూర్చొనివున్నారు. రాష్ట్రపతి ముర్ము నిలబడి ఉండగా అద్వానీ, మోడీ కుర్చీల్లో కూర్చున్న చిత్రాలను రాష్ట్రపతి కార్యాలయం కూడా సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేసింది. దేశ ప్రథమ పౌరురాలైన రాష్ట్రపతిని నిల్చొని ఉండగా ప్రధాని మోడీ కుర్చీలో కూర్చోవడమంటే రాష్ట్రపతి పదవితో పాటు గిరిజనులను, మహిళలను అవమానించడమేనని సర్వత్రా ఆగ్రహం వ్యక్తమవుతోంది.

రాష్ట్రపతి భవన్ ప్రొటోకాల్ ప్రకారం ఆరోగ్యం సహకరించనివారే కుర్చీలో కూర్చొని అవార్డును స్వీకరించవచ్చునని మాజీ రాష్ట్రపతి కోవింద్‌కు మీడియా కార్యదర్శిగా పనిచేసిన అశోక్ మాలిక్ తెలిపారు. అయితే ఈ కార్యక్రమం రాష్ట్రపతి భవన్‌లో జరగడం లేదని, అద్వానీ నివాసంలో జరిగిందని ఆయన పేర్కొన్నారు. అవార్డు ప్రదానం సమయంలోనే కాకుండా ఆ తర్వాత కూడా ముర్ము నిలబడి వుండగా..మోడీ కుర్చీలోనే కూర్చొని ఉండటం ఇప్పుడు విమర్శలకు తావిస్తోంది.

ఉద్దేశ్యపూర్వకంగానే అవమానించారు : కాంగ్రెస్

రాష్ట్రపతి ముర్ము గిరిజన మహిళ అయినందున ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఆమెను ఉద్దేశపూర్వకంగానే అవమానించారని కాంగ్రెస్ ఆగ్రహం వ్యక్తం చేసింది. 'ప్రధాని మోడీ మరోమారు గిరిజన మహిళ అయిన రాష్ట్రపతి ముర్మును అవమానించారు. ఇది తొలిసారి కాదు. కొత్త పార్లమెంటు భవన సముదాయాన్ని ప్రారంభించినప్పుడు రాష్ట్రపతిని ఆహ్వానించకుండా అవమానించారు. అయోధ్య రామమందిర ప్రాణ ప్రతిష్ట సమయంలోనూ రాష్ట్రపతిని పట్టించుకోలేదు. ప్రధాని మోడీ, బిజెపి మనస్తత్వమే మహిళలకు, దళితులకు, ఆదివాసీలకు వ్యతిరేకమైన మిగతా 5లో

విశాఖ ఘటనపై ఐద్వా ఖండన

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

విశాఖపట్నంలోని చైతన్య కళాశాలలో లైంగిక వేధింపుల వల్లే ఆత్మహత్య చేసుకున్న విద్యార్థి ఘటనను ఐద్వా రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు బి ప్రభావతి, డి రమాదేవి ఖండించారు. విశాఖ ఘటనలో నిందితులను ప్రభుత్వం వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. కళాశాలలో వేధింపుల వల్లే తాను చనిపోతున్నానని కుటుంబ సభ్యులకు వాట్సాప్‌లో ఆ విద్యార్థి మెసేజ్ పెట్టిందని, కలేజీలో సెక్సువల్ హెరాస్‌మెంట్ చేస్తుండటం, ఫొటోలను సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేస్తామని బెదిరించడం వంటి కారణాలతో విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడిందని అన్నారు. ఒక్కరైనా చనిపోతే ప్రపంచానికి తెలుస్తుందని విద్యార్థి చెప్పడం చాలా బాధాకరమైన విషయమని పేర్కొన్నారు. ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దాల్సిన విద్యాసంస్థల్లో ఈ పరిస్థితి ఉండటం కంచే చేను మేసినట్లుగా ఉందన్నారు. విద్యార్థి ఆత్మహత్య సంఘటనకు సంబంధించి పోలీసులు అనుమానాస్పద కేసుగా నమోదు చేశారని, ఈ సంఘటన వెనుక ఉన్న వ్యక్తులను బయటకు తేవాలని, ఇంత వరకు అధ్యాపకులను గుర్తించి వారిపై చర్య తీసుకోకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని తెలియజేస్తోందని అన్నారు. చట్టపరంగా ఉండాల్సిన అంతర్గత ఫిర్యాదుల కమిటీ ఈ కళాశాలల్లో ఎక్కడా లేవన్నారు.

పక్షపాతంగా వ్యవహరిస్తోన్న ఎన్నికల కమిషన్

- మాజీ మంత్రి పేర్ని నాని

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

తెలుగుదేశం పార్టీ ఎన్ని పర్యాయాలు ఎన్నికల నిబంధనావళిని ఉల్లంఘించినా స్పందించని ఎన్నికల సంఘం వైసిపిపై ఎలాంటి విచారణ లేకుండానే చర్యలకు పాల్పడుతూ పక్షపాతంగా వ్యవహరిస్తోందని మాజీ మంత్రి పేర్ని నాని విమర్శించారు. తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో ఎన్నికల సంఘం మొత్తం ప్రతిపక్షానికి లొంగిపోయిందన్నారు. టిడిపి కార్యాలయం ఎదురుగా అడ్డగోలుగా ఫ్లెక్సీలు పెట్టినా స్పందించని ఎన్నికల కమిషన్ వైసిపి కార్యాలయం ఎదుట వున్న ఫ్లెక్సీలపై మాత్రమే చర్యలు తీసుకుంటోందన్నారు. అలాగే చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి సైకిల్ గుర్తు వున్న బ్యాడ్జ్‌ను తగిలించుకుని రూ.3 లక్షల చెక్కులు ఇస్తుంటే ఎన్నికల సంఘం ఏమాత్రం పట్టించుకోవడం లేదని అన్నారు. చెక్కుల పంపిణీని నిలిపివేయాలని తమ పార్టీ రెండు పర్యాయాలు ఫిర్యాదు చేసినా ఎన్నికల సంఘం కనీసం ఆమెకు నోటీసులు కూడా ఇవ్వలేదన్నారు. ఎన్నికల కోడ్ వచ్చేంత వరకు వలంటీర్లను దుర్మార్గులని విమర్శలు చేసిన టిడిపి, కోడ్ వచ్చాక వలంటీర్ల పట్ల కపట ప్రేమను ప్రదర్శిస్తోందని విమర్శించారు. టిడిపి దుర్మార్గపు చర్యలను రాష్ట్ర ప్రజలు తిప్పికొట్టాలని కోరారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..

స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ, ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ, అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి, గుంటూరు జిల్లా - 522 501కు కానీ **editorprajasakthi@gmail.com**కు పంపవచ్చు.

కర్నూలు జిల్లాలో మరో విషాదం

- విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న వాహనం
- ఇద్దరు వ్యవసాయ కార్మికులు దుర్మరణం

ప్రజాశక్తి- మద్దికేర, ఆలూరు

కర్నూలు జిల్లాలో మరో విషాద ఘటన చోటుచేసుకుంది. రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యవసాయ కార్మికులు మృతి చెందారు. 20 మందికి గాయాలయ్యాయి. పోలీసుల కథనం ప్రకారం... మండల కేంద్రమైన మద్దికేర గ్రామానికి చెందిన 40 మంది వ్యవసాయ కార్మికులు చిప్పగిరి గ్రామంలో మిరపకాయల కోతకు ఆదివారం వెళ్లారు. అనంతరం వారు టాటా ఏస్ వాహనంలో తిరిగి స్వగ్రామానికి వెళుతున్నారు. కోతులమాను వద్ద ఆ వాహనం టైరు పేలింది. దీంతో, అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న విద్యుత్తు స్తంభాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వాహనం ముందు కూర్చున్న ఆదిలక్ష్మి (50), తాయమ్మ (48) అక్కడికక్కడే మృతి చెందారు. తీవ్రంగా గాయాలైన ఐదుగురిని కర్నూలు ప్రభుత్వాస్పత్రికి, స్వల్పంగా గాయాలైన 15 మందిని గుంతకల్లు ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతుల కుటుంబాలను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని సిపిఎం మండల కార్యదర్శి రవికుమార్ కోరారు.

'హత్తిబెళగల్' ప్రమాదంలో మరో ఇద్దరు మృతి

ఆలూరు మండలం హత్తిబెళగల్ బస్టాండ్ ఆవరణలో శనివారం ఆటో బోల్తా పడిన ఘటనలో వ్యవసాయ కార్మికురాలు మస్తానమ్మ (40) అక్కడికక్కడే మృతి చెందిన సంగతి తెలిసిందే. కాగా, ఈ ప్రమాదంలో గాయపడిన వారిలో ఇద్దరు వ్యవసాయ కార్మికులు ఆదివారం మరణించారు. ఆదోనిలోని ప్రయివేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న హులేబీడు గ్రామానికి చెందిన దస్తగిరమ్మ (55), కర్నూలు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న షేకున్ బీ (30) వారిలో ఉన్నారు. దీంతో, మృతుల సంఖ్య మూడుకు చేరుకుంది.

ఫోన్లు.. సోషల్ మీడియా..

- పథకాలు ప్రచారం చేసుకుంటున్న ప్రభుత్వం
- వైఫల్యాలు వివరిస్తున్న ప్రతిపక్షం



ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఎన్నికల నేపథ్యంలో రాష్ట్రంలోని ప్రతి పార్టీ ప్రత్యేకంగా సిబ్బందిని నియమించుకుని సామాజిక మాధ్యమాలే లక్ష్యంగా ప్రచారం నిర్వహిస్తున్నాయి. ప్రతి ఓటరుకూ ప్రత్యేకంగా ఫోన్లు చేసి మరీ ప్రచారం నిర్వహిస్తున్నాయి. ఫోన్ ప్రచారంలో టిడిపి ముందుంటే, సామాజిక మాధ్యమాల ప్రచారంలో వైసిపి ముందుంది. ఓటర్లకు వైసిపి, టిడిపి వ్యక్తిగతంగా ఫోన్ చేసి వారి పార్టీల గురించి చెప్పుకుంటున్నాయి. ముందుగా రికార్డు చేసిన మాటలు, హామీలను వినిపిస్తున్నాయి. అధికార పార్టీ వైసిపి తమ ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాల గురించి ఓటర్లకు వ్యక్తిగతంగా ఫోన్ చేసి వివరిస్తున్నాయి. అదేవిధంగా మీకు సంక్షేమ పథకాలు అందుతున్నాయా? లేదా? అంటూ ఆ పార్టీ అభ్యర్థులు, ప్రజా ప్రతినిధుల కార్యాలయాల నుంచి ఓటర్లకు వ్యక్తిగతంగా ఫోన్లు చేసి ఆరా తీస్తున్నాయి. ప్రభుత్వ వైఫల్యాల గురించి టిడిపి వివరిస్తోంది. ముఖ్యంగా ఎస్‌సి, ఎస్‌టి, మైనార్టీలకు ఫోన్ చేసి వైసిపి ప్రభుత్వం పలు పథకాలు రద్దు చేసిందని ప్రచారం చేస్తున్నాయి.

అలాగే నటులతో చేసిన వీడియోలను ఫేస్‌బుక్, యూట్యూబ్, ఎక్స్ వంటి సామాజిక మాధ్యమాల్లో విపరీతమైన ప్రచారం చేస్తున్నాయి. టిడిపి, జనసేన కంటే అధికార పార్టీ వైసిపి ఈ ప్రచారంలో ముందు వరుసలో ఉంది. అదే విధంగా రాజకీయ నేతల కార్టూన్‌లతో వీడియోలు తీస్తున్నాయి. వైసిపి తమ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ప్రజల్ని కాపాడే హీరోగా చూపిస్తూ, ఎన్‌డిఎ కూటమి అభ్యర్థులను విలన్లుగా చూపించే కార్టూన్ వీడియోలను సామాజిక మాధ్యమాల్లో చేస్తోంది. ఎన్‌డిఎ కూటమి కూడా జగన్‌ను విలన్‌గా చూపిస్తూ కూటమి నేతలను హీరోలుగా చూపిస్తూ ప్రచారం చేస్తున్నాయి.

ఏం చేశామో చెప్పలేని స్థితిలో బిజెపి

కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి రాష్ట్ర ప్రజలకు ఏం చేసిందో చెప్పుకోలేని స్థితిలో ఉంది. నిజం తెలియాలంటూ మోడీ ఫొటోతో సామాజిక మాధ్యమాల్లో వీడియో ప్రచారం చేస్తోంది. అయితే ఇందులో ప్రత్యేక హోదా, రైల్వే జోన్, పోలవరం, అమరావతి నిర్మాణం ప్రస్తావన లేదు. అన్ని రాష్ట్రాలతో పాటు ఇచ్చిన నీటి కుళాయి కనెక్షన్లు, ఆయుష్మాన్ భారత్ వంటి రెండు, మూడు పథకాలనే ప్రచారం చేసుకుంటోంది.

ఇండియా వేదిక అభ్యర్థులను ఆదరించండి

- సిఐటియు రాష్ట్ర పధాన కార్యదర్శి సిహెచ్ నర్సింగరావు

ప్రజాశక్తి-నెల్లూరు

కార్మిక వర్గం వెన్నంటి ఉంటూ పోరాటాల్లో ప్రత్యక్షంగా, పరోక్షంగా పాల్గొని మద్దతు ఇస్తున్న వామపక్ష పార్టీలను ఆదరించాలని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నర్సింగరావు కోరారు. అన్ని రంగాల్లో ఉన్న కార్మికుల సమస్యలు పరిష్కారం కావాలంటే రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఇండియా వేదిక అభ్యర్థులను గెలిపించుకోవాలని తెలిపారు. నెల్లూరులోని జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రంలో ఆయన ఆదివారం విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. గత పదేళ్లలో కేంద్రంలో అధికారంలో ఉన్న మోడి ప్రభుత్వం కార్మిక, రైతాంగ వ్యతిరేక విధానలను అమలు చేసిందన్నారు. పోరాడి సాధించుకున్న కార్మికుల హక్కులను కాలరాసే విధంగా మోడీ ప్రభుత్వ విధానాలు ఉన్నాయని విమర్శించారు. రాష్ట్రంలోని వైసిపి, టిడిపి, జనసేన పార్టీలు బిజెపి విధానాలను అమలు చేస్తున్నాయన్నారు. కనీస వేతనం అనేదే లేదని, కనీస వేతనాలు అమలు చేయకుండా అడ్డుపడే విధానాలు అమలు చేశారని, నూతనంగా ఎటువంటి ఉద్యోగ నియామకాలు జరపకపోగా, పర్మినెంట్ నియామకాల ఊసే లేదన్నారు. కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ విధానాలను అమలు చేస్తున్నాయని తెలిపారు. కార్మిక వర్గానికి హక్కులు అమలు కావడంలేదని తెలిపారు. రాష్ట్రంలో ప్రజా వ్యతిరేక పరిపాలన చేస్తున్న వైసిపి ప్రభుత్వానికి, ఎన్‌డిఎ పార్టీలను ఓడించాలని కోరారు. ఈ సమావేశంలో సిఐటియు రాష్ట్ర కార్యదర్శి ఆర్‌వి నరసింహారావు, సిఐటియు నాయకులు పాల్గొన్నారు.

జగన్ బినామీలకు పింఛను డబ్బులు

- మాజీ మంత్రి దేవినేని ఉమా

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఎన్నికల కోడ్ అమల్లో ఉందని తెలిసీ ఖజానాలో పెన్షన్ డబ్బులను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన బినామీలకు దోచిపెట్టారని మాజీ మంత్రి, టిడిపి నేత దేవినేని ఉమామహేశ్వరరావు విమర్శించారు. అడ్డగోలు నిర్ణయాలు తీసుకుని రూ.వేల కోట్లు అస్మదీయులకు, వైసిపిలోని కొందరి నేతలకు ఊడ్చిపెట్టారని పేర్కొన్నారు. టిడిపి కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సోమవారం తెల్లవారుజామున పెన్షన్ ఇవ్వకపోతే ప్రజల తరపున ఉద్యమిస్తామని హెచ్చరించారు. పెన్షన్ అందేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని కోరారు.

జగన్ స్వార్థ రాజకీయాల వల్లే పెన్షన్ల పంపిణీ బాధ్యత నుంచి వలంటీర్లను ఎన్నికల కమిషన్ తప్పించిందని టిడిపి ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ ఒక ప్రకటనలో విమర్శించారు. ఎన్నికల కమిషన్ నిబంధనలు తుంగలో తొక్కి వలంటీర్లను రాజకీయ ప్రచారం కోసం ఉపయోగించారని అన్నారు. వలంటీర్లు లేకపోతే గెలవననే భయంతో సిఎం జగన్ నీచ రాజకీయాలు చేస్తున్నారని, వారిని పార్టీ కార్యకర్తల్లా వాడుకుంటున్నారని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు వర్ల రామయ్య విమర్శించారు. ప్రజాసేవ మాత్రమే చేసే వలంటీర్లను తమ ప్రభుత్వం ఏర్పడగానే కొనసాగిస్తామని టిడిపి జాతీయ అధికార ప్రతినిధి గురజాల మాల్యాద్రి అన్నారు.

నేడు 'మేమంతా సిద్ధం' తిరిగి ప్రారంభం

- శ్రీసత్యసాయి జిల్లాలో సిఎం జగన్ ఆదివారం విశ్రాంతి

ప్రజాశక్తి- అనంతపురం ప్రతినిధి



ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన మేమంతా సిద్ధం యాత్ర ఒక రోజు విరామం తరువాత సోమవారం తిరిగి ప్రారంభం కానుంది. ఆదివారం ఆయన యాత్రకు విరామం ఇచ్చారు. శనివారం కర్నూలు జిల్లా తుగ్గలి నుంచి గుత్తి, పామిడి, రాప్తాడు మీదుగా యాత్ర కొనసాగించిన జగన్... శ్రీ సత్యసాయి జిల్లా బత్తపల్లి మండలం సంజీవపురం వద్ద రాత్రి బస చేశారు. ఆదివారం యాత్రకు విరామం ఇవ్వడంతో రాత్రి కూడా అక్కడే జగన్ ఉన్నారు. ఎవరినీ ఆ క్యాంపులోకి అనుమతించలేదు. తిరిగి సోమవారం ఉదయం యాత్రను యథావిధిగా ప్రారంభించ నున్నారు. ఈ యాత్ర బత్తపల్లి, ముదిగుబ్బ, మొలకవేముల క్రాస్ మీదుగా సాయంత్రానికి కదిరి పట్టణానికి చేరుకోనుంది. కదిరి పట్టణంలో ఇఫ్తార్ విందులో పాల్గొననున్నారు.

మాజీ ఎమ్మెల్యే అత్తార్ చాంద్ బాషా తిరిగి వైసిపిలోకి!

మాజీ ఎమ్మెల్యే అత్తార్ చాంద్ బాషా టిడిపికి రాజీనామా చేస్తున్నట్లు ఆదివారం మీడియా సమావేశంలో ప్రకటించారు. ముఖ్యమంత్రి జగన్ చేపట్టిన మేమంతా సిద్ధం కార్యక్రమంలో వైసిపిలో చేరనున్నట్లు తెలిపారు. చాంద్ బాషా 2014లో వైసిపి తరుపున పోటీ చేసి గెలుపొందారు. ఆ తరువాత ఆయన టిడిపిలో చేరారు. 2019లో ఆయనకు టిడిపి టికెట్టు ఇవ్వలేదు. తాజా ఎన్నికల్లోనూ మాజీ ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్‌కు టికెట్టు ఇచ్చింది. ఈ నేపథ్యంలో టిడిపిని వీడుతున్నట్లు, తిరిగి వైసిపిలో చేరనున్నట్లు చాంద్ బాషా ప్రకటించారు.



తెలంగాణ సిఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన కడియం శ్రీహరి, కావ్య

కాంగ్రెస్‌లో చేరిన కడియం శ్రీహరి, కావ్య

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పార్లమెంట్ ఎన్నికల ముందు బిఆర్ఎస్ పార్టీకి పెద్ద దెబ్బ తగిలింది. బిఆర్ఎస్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, ఆయన కుమార్తె కావ్య కాంగ్రెస్‌లో చేరారు. సిఎం సమక్షంలో ఆ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి దీపాదాస్ మున్షీ కాంగ్రెస్ కండువా కప్పి వారిని పార్టీలోకి ఆహ్వానించారు. కడియం కుమార్తెకు లోక్‌సభ టికెట్ ఇచ్చినా బిఆర్ఎస్‌ను వీడడం ఆ పార్టీలో చర్చనీయాంశంగా మారింది. కొద్దిరోజులుగా వస్తున్న అవినీతి ఆరోపణలు, భూకబ్జాలు, ఫోన్ ట్యాపింగ్, లిక్కర్ స్కాం తదితర అంశాలు బిఆర్ఎస్ ప్రతిష్ఠను దిగజార్చాయని పేర్కొంటూ లోక్‌సభ అభ్యర్థిత్వం నుంచి కావ్య తప్పుకున్నారు. వరంగల్ జిల్లాలోని నాయకుల మధ్య సమన్వయం, సహకారం లేకపోవడం, ఎవరికి వారే యమునా తీరే అన్న చందంగా వ్యవహరిస్తుండడంతో బిఆర్ఎస్‌కి మరింత నష్టం చేసిందని, ఈ పరిస్థితుల్లో తాను పోటీ నుంచి విరమించుకోవాలని నిర్ణయించుకున్నానని ఆమె కెసిఆర్‌కు రాసిన లేఖలో పేర్కొన్నారు. అనంతరం కడియం శ్రీహరి, కావ్యను కాంగ్రెస్ ముఖ్యనేతలు ఆ పార్టీలోకి ఆహ్వానించడం, వెంటనే చేరిపోవడం జరిగిపోయాయి. వరంగల్ లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థిగా కావ్య లేదా కడియం శ్రీహరిని నిలిపే అవకాశం ఉందని ప్రచారం జరుగుతోంది. అలా జరగనిపక్షంలో ఆయనకి రాష్ట్ర మంత్రివర్గంలో చోటు కల్పిస్తారన్న ఊహాగానాలూ వినిపిస్తున్నాయి.

నీటి తొట్టిలో పడి ఇద్దరు విద్యార్థుల మృతి

ప్రజాశక్తి - మాచర్ల



విద్యార్థుల మృతదేహాలు

భారీ నీటి తొట్టిలో పడి ఇద్దరు విద్యార్థులు మృతి చెందిన సంఘటన పల్నాడు జిల్లా మాచర్ల పట్టణంలో ఆదివారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. రేగులవరం తండాకు చెందిన తరుణ్ నాయక్ (14), వాంకడావత్ అరుణ్ నాయక్ (15) మాచర్లలోని గౌతమ్ స్కూల్‌లో ఎనిమిదో తరగతి చదువుతున్నారు. స్కూల్ హాస్టల్లోనే ఉంటున్నారు. ఆదివారం సెలవు కావడంతో పాఠశాలకు సమీపంలోని రాయవరం జంక్షన్ వద్దకు వచ్చారు. అక్కడ జాతీయ రహదారి పనుల నిమిత్తం నీటి అవసరాల కోసం ఏర్పాటు చేసిన పది అడుగుల లోతుండే నీటి తొట్టిలో ఈతకు దిగారు. ఎంత సేపటికీ పైకి రాకపోవడంతో అక్కడే ఉన్న ఇద్దరు చిన్నారులు ట్యాంకర్ డ్రైవర్‌కు విషయం చెప్పారు. దీంతో ఆయన నీటి తొట్టిలో దిగి మృతదేహాలను వెలికి తీశారు. విషయం తెలుసుకున్న పాఠశాల యాజమాన్యం పోలీసులకు సమాచారం అందించింది. అక్కడి నుంచి తప్పుకుంది. మృతుల తల్లిదండ్రులు, బంధువులు పాఠశాల వద్దకు భారీగా చేరుకున్నారు. పాఠశాల యాజమాన్యం నిర్లక్ష్యం కారణంగానే తమ బిడ్డలు మృతి చెందారని ఆగ్రహం వ్యక్తం చేస్తూ పాఠశాలలోని సామగ్రిని ధ్వంసం చేశారు. మృతదేహాలను పాఠశాల ఆవరణలో ఉంచి ఆందోళన చేపట్టారు. ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి పాఠశాల వద్దకు చేరుకుని బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడారు. పాఠశాల యాజమాన్యంతో మాట్లాడి న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు.

పవన్ ప్రచారానికి తాత్కాలిక విరామం

- అర్ధాంతరంగా హైదరాబాద్‌కు పయనమైన నేత
- అనారోగ్య కారణాలే కారణమంటున్న పార్టీ శ్రేణులు

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

కాకినాడ జిల్లా పిఠాపురంలో ఎన్నికల ప్రచారానికి జనసేన అధినేత పవన్ కల్యాణ్ తాత్కాలిక విరామం ఇచ్చారు. ఆదివారం సాయంత్రం ఆయన అర్ధాంతరంగా ప్రత్యేక హెలికాప్టర్‌లో హైదరాబాద్‌కు పయనమయ్యారు. స్వల్ప అనారోగ్య సమస్యలతో ఆయన బాధపడుతున్నట్లు సమాచారం. ఈ కారణంగానే ఆయన హైదరాబాద్‌కు వెళ్లిపోయారని పార్టీ శ్రేణులు తెలిపాయి. సోమవారం సాయంత్రం ఆయన పిఠాపురం చేసుకుంటారని సమాచారం. అయితే, తాత్కాలిక విరామంపై అధికారిక ప్రకటన మాత్రం రాలేదు. రెండో రోజు ప్రచారంలో భాగంగా పిఠాపురంలో పలు ఆలయాలను ఆయన సందర్శించారు. పాదగయలో ప్రత్యేక పూజలు నిర్వహించి, పట్టు వస్త్రాలు సమర్పించారు. ఆలయ మర్యాదలతో అర్చకులు స్వాగతం పలికారు. కుక్కుటేశ్వర స్వామిని దర్శించుకున్నారు. ప్రముఖ దత్త క్షేత్రంగా పేరున్న దత్తపీఠానికి వెళ్లారు. అక్కడ శ్రీపాద వల్లభున్ని దర్శించుకున్నారు. ఆయన వెంట కాకినాడ లోక్‌సభ జనసేన పార్టీ అభ్యర్థి తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్, పార్టీ నేతలు ఉన్నారు.

షరతులు.. సంఘర్షణలు

మూడు పార్టీలు సమన్వయంతో, పొత్తులతో ఎన్నికలను ఎదుర్కోవాలంటే సీట్ల కేటాయింపుల్లో ఎన్నో షరతులు, ఎన్నో అలకలు, మరెన్నో సంఘర్షణలు ఉంటాయని, వైసిపి పాలన నుంచి రాష్ట్రాన్ని బయటపడేయాలనే లక్ష్యంతో పొత్తులకు ఎలాంటి షరతులు పెట్టకుండానే ముందుకు వెళ్లామని జనసేన అధినేత పవన్ కల్యాణ్ అన్నారు. పిఠాపురంలో కూటమి నేతల ఆత్మీయ సమన్వయ సమావేశం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చేది కూటమి ప్రభుత్వమేనని, భారీ మెజార్టీతో ఎక్కువ సీట్లు గెలవబోతున్నామని జోస్యం చెప్పారు. సమావేశంలో పిఠాపురం నియోజకవర్గం టిడిపి ఇన్‌ఛార్జ్ ఎస్విఎస్ఎన్.వర్మ, నియోజకవర్గం బిజెపి ఇన్‌ఛార్జ్ బి.కష్ణంరాజు, జనసేన ఎంపి అభ్యర్థి ఉదయ్ శ్రీనివాస్ పాల్గొన్నారు.



ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న పవన్ కళ్యాణ్

సకాలంలో పెన్షన్ అందించేలా చర్యలు

- సిపిఎం రాష్ట్ర కమిటీ డిమాండ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

వలంటీర్ల ద్వారా అందజేసే పెన్షన్ల పంపిణీని ఎన్నికల కమిషన్ నిలిపివేయడంతో ప్రభుత్వం తక్షణమే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి సకాలంలో వృద్ధులు, మహిళలు, వికలాంగులకు పెన్షన్లు అందించాలని సిపిఎం రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు ఆదివారం ఎన్నికల కమిషన్‌కు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి లేఖ రాశారు. గతంలోలాగా ప్రభుత్వం పెన్షన్ల పంపిణీ కోసం గ్రామ, వార్డు సచివాలయాలు, రెవెన్యూ ఉద్యోగుల సేవలు ఉపయోగించుకుని నేరుగా పెన్షన్‌దారులకు పెన్షన్ అందించాలని కోరారు. సచివాలయాలు దూరంగా ఉన్నచోట దగ్గరలో ఉండే పంచాయతీ కార్యాలయాలు, సిబ్బందిని పెన్షన్ల పంపిణీ ప్రక్రియకు ఉపయోగించుకోవాలని సూచించారు. రాజకీయంగా న్యూట్రల్‌గా ఉంచి సంక్షేమ పథకాలను అందించాల్సిన వలంటీర్ వ్యవస్థను రాజకీయ అవసరాల కోసం వైసిపి దుర్వినియోగం చేస్తోందని గతంలో సిపిఎం పదేపదే ప్రభుత్వం దృష్టికి తెచ్చిందని గుర్తు చేశారు. వలంటీర్ వ్యవస్థ దుర్వినియోగం చేసిన ఫలితంగానే నేడు సకాలంలో పెన్షన్లు అందించలేని దుస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు. ఇప్పటికైనా వలంటీర్ వ్యవస్థ తటస్థంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

పోరాటాలతో 'ఉక్కు'ను కాపాడుకుంటాం

ప్రజాశక్తి - ఉక్కునగరం



ఐక్య పోరాటాలతో స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకుంటామని హెచ్ఎంఎస్ స్టీల్‌ప్లాంట్ విభాగం నాయకులు దొమ్మేటి అప్పారావు, గణపతి రెడ్డి స్పష్టం చేశారు. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యంలో జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు ఆదివారానికి 1144వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో హెచ్ఎంఎస్ యూనియన్ కార్యకర్తలు, కాంట్రాక్టు కార్మికులు కూర్చున్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ విశాఖ ఉక్కు కర్మాగారాన్ని నిర్వీర్యం చేయాలని చూస్తున్న కేంద్ర ప్రభుత్వ తీరును ప్రజలంతా తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారన్నారు. ఉక్కు కాంట్రాక్టు, శాశ్వత కార్మికులు పోరాటాన్ని ఉధృతం చేసి ప్లాంట్‌ను రక్షించుకోవడం ద్వారా నిర్వాసితులకు ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని తెలిపారు. ప్రజల ఆకాంక్షను గుర్తెరిగి ఇప్పటికైనా ప్లాంట్ ప్రయివేటీకరణ ప్రయత్నాలను కేంద్రం విరమించుకోవాలన్నారు. సొంత గనులు కేటాయించి, పూర్తి సామర్థ్యంతో కర్మాగారాన్ని నడపాలని డిమాండ్ చేశారు.

పెన్షన్ల పంపిణీ ఆలస్యమైతే ఆందోళన

- సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

సామాజిక పెన్షన్ల పంపిణీ ఆలస్యమైతే ఆందోళన చేపడతామని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి, సామాజిక పెన్షన్‌దారుల సంక్షేమ సంఘం రాష్ట్ర కన్వీనర్ ముప్పాళ్ల నాగేశ్వరరావు హెచ్చరించారు. ఎన్నికల సంఘం విశ్వసనీయతను దెబ్బతీసేలా జగన్ ప్రభుత్వం ప్రచారం చేస్తోందని ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఓట్ల ప్రయోజనాల కోసం వలంటీర్లను అడ్డగోలుగా వైసిపి ప్రభుత్వం వాడుకోవటాన్ని ఎన్నికల సంఘం గమనించిందని అన్నారు. అందుకనే వారిని పక్కన పెట్టాలని ఆదేశించిందని పేర్కొన్నారు.

సచివాలయ సిబ్బంది ద్వారా పెన్షన్ల పంపిణీ

- సిఎస్, ఎన్నికల సంఘానికి చంద్రబాబు లేఖ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

గ్రామ సచివాలయం, ఉద్యోగులు, ఇతర క్షేత్రస్థాయి సిబ్బంది ద్వారా ఎటువంటి జాప్యం లేకుండా పెన్షన్ల పంపిణీ జరిగేలా చర్యలు తీసుకోవాలని టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు కోరారు. ఈ మేరకు . రాష్ట్రప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కెఎస్ జవహర్ రెడ్డికి, రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్ కుమార్ మీనాకు విడివిడిగా ఆదివారం లేఖలు రాశారు. రాష్ట్రప్రభుత్వం తక్షణమే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని ఈ లేఖలో పేర్కొన్నారు. ఎన్నికల కోడ్ కారణంగా వాలంటీర్లతో పెన్షన్ల పంపిణీని నిలిపివేస్తూ కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశించిందని గుర్తుచేశారు. ఈ నేపథ్యంలో సోమవారం నుండే పెన్షన్ల పంపిణీకి అవసరమైన ఏర్పాట్లు చేయాలని కోరారు. వృద్ధులు, వింతంతవులు, ఇతర లబ్ధిదారులకు నగదు రూపంలో పెన్షన్ మొత్తం చెల్లించాలని కోరారు. దీనికోసం సచివాలయ సిబ్బంది పెన్షన్ మొత్తాన్ని బ్యాంకుల నుంచి తీసుకుని వెళ్లడానికి అనుమతించాలని, ఇందుకు అవసరమైన అనుమతులు ఇవ్వాలని కోరారు. పెన్షన్ నిధులను రాష్ట్రప్రభుత్వం సిద్ధం చేయలేదనే వార్తలు వస్తున్నాయని తెలిపారు. అవసరమైన నిధులను వెంటనే అందుబాటులో ఉంచాలని కోరారు. గతంలో ఇచ్చిన విధంగా 1 నుంచి 5వ తేది మధ్య పంపిణీ ప్రక్రియ పూర్తిచేయడానికి అవసరమైన యంత్రాంగాన్ని, నిధులను సిద్ధం చేయాలని కోరారు.

వలంటీర్ల వ్యవస్థ నిర్వీర్యానికి కుట్ర

- మూడో తేదీకల్లా పెన్షన్లు అందిస్తాం : సజ్జల

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

వలంటీర్ల వ్యవస్థను నిర్వీర్యం చేసేలా చంద్రబాబు మొదటి నుంచి చేస్తున్న కుట్రలు ఎన్నికల కమిషన్ ప్రకటనతో బహిర్గతం అయ్యాయని వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. సచివాలయ వ్యవస్థ ద్వారా అందరికీ మూడో తేదీకల్లా పెన్షన్లు అందిస్తామని తెలిపారు. తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. పేదలకు మేలు జరగడం చంద్రబాబుకు ఇష్టం వుండదని విమర్శించారు. సిటిజన్ ఫర్ డెమొక్రసీ పేరుతో నిమ్మగడ్డ రమేష్‌కుమార్ కేవలం చంద్రబాబు కోసమే పనిచేస్తున్నారని ఆరోపించారు. చంద్రబాబు తన కుట్రలను కప్పిపుచ్చుకునేందుకు నష్ట నివారణలో భాగంగా ప్రభుత్వ ఉద్యోగుల ద్వారా పెన్షన్లు పంపిణీ చేయాలని లేఖ రాశారని అన్నారు. పవన్‌కల్యాణ్‌ను చంద్రబాబు మింగేస్తాడని ముందు నుంచి తాము చెబుతున్నట్లే జరుగుతోందన్నారు. జనసేనకు ఇచ్చిన సీట్లలోనూ చంద్రబాబు మనుషులనే పెట్టుకున్నారన్నారు.

931 కిలోల వెండి, రూ. 21 లక్షల నగదు స్వాధీనం

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

ఎన్నికల వేళ అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటిలో ఆదివారం భారీగా వెండి, నగదు పట్టుబడింది. ఓ ఇంట్లో నిలువ ఉంచిన 931 కిలో వెండి, రూ.21 లక్షలు నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అవి తమిళనాడుకు చెందిన వ్యాపారులు సంపత్, కన్నాకు చెందిన సొత్తుగా గుర్తించారు. పట్టుబడిన వెండి, నగదును జిఎస్‌టి, ఐటి శాఖ అధికారులకు అప్పగించారు.

ప్రజలను తప్పుదారి పట్టించే యత్నమే!

- న్యాయవాదుల లేఖపై ఐలూ విమర్శ

న్యూఢిల్లీ : న్యాయ వ్యవస్థను పరిరక్షించాలంటూ ఇటీవల కొంతమంది న్యాయవాదుల బృందం ప్రధాన న్యాయమూర్తి డి.వై.చంద్రచూడ్‌కు లేఖ రాయడమంటే ప్రజలను తప్పుదారి పట్టించే యత్నమేనని అఖిల భారత న్యాయవాదుల సంఘం (ఐలూ) ఒక ప్రకటనలో పేర్కొంది. సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాదులు హరీష్ సాల్వే, అదిష్ అగర్వాల్ కూడా లేఖ రాసిన బృందంలో వున్నారు. అవినీతిని ఎండగడుతూ ఎన్నికల బాండ్లపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ప్రత్యక్ష ప్రభావమే ఈ లేఖ అని ఐలూ పేర్కొంది. న్యాయవ్యవస్థ స్వేచ్ఛా, స్వాతంత్ర్యాల పరిరక్షణ కోసం, భారత రాజ్యాంగం మౌలిక వ్యవస్థను పరిరక్షించేందుకు నిరంతరంగా పోరాడుతున్న బాధ్యాతాయుతమైన న్యాయవాదులు, న్యాయవాదుల సంఘాలకు వ్యతిరేకంగా నిరాధార ఆరోపణలతో రాసిన లేఖ మాత్రమేనని ఐలూ నేతలు, సీనియర్ న్యాయవాది, రాజ్యసభ ఎంపి వికాస్ రంజన్ భట్టాచార్య, సీనియర్ న్యాయవాది పి.వి.సురేంద్రనాథ్ విమర్శించారు. న్యాయ వ్యవస్థ స్వాతంత్ర్యంతోపాటు రాజ్యాంగ మౌలిక వ్యవస్థపై కేంద్రంలోని ప్రస్తుత ప్రభుత్వం ప్రత్యక్ష దాడి చేసినప్పుడు గతంలో ఈ న్యాయవాదుల బృందం మౌనంగా వుందని గుర్తు చేశారు. పార్లమెంట్ ఆధిక్యత పేరుతో బాధ్యాతాయుతమైన పదవుల్లో వున్నవారు న్యాయ సమీక్షపై, మౌలిక వ్యవస్థపై దాడి చేశారని వారు పేర్కొన్నారు. న్యాయమూర్తుల ఎంపికలో కార్యనిర్వాహక వర్గం పాత్ర ఏమిటో చెప్పాలని డిమాండ్ చేశారు. హైకోర్టుల న్యాయమూర్తుల బదిలీల్లో ప్రభుత్వం ప్రత్యక్షంగా జోక్యం చేసుకుంటోందని ఐలూ విమర్శించింది. ఎన్నికల బాండ్ల కేసులో తీర్పు, అప్రజాస్వామికంగా పిఐబి ఏర్పాటు చేసిన వాస్తవాల నిర్ధారణ కమిటీ వంటి అంశాలు న్యాయవాదుల బృందాన్ని అసహనానికి గురిచేశాయని ఐలూ పేర్కొంది.

14 మంది వలంటీర్లు రాజీనామా

ప్రజాశక్తి- పలాస (శ్రీకాకుళం జిల్లా)

పలాస మండలం బొడ్డపాడు పంచాయతీలో పనిచేస్తున్న 14 మంది వలంటీర్లు మూకుమ్మడిగా తమ ఉద్యోగానికి ఆదివారం రాజీనామా చేశారు. వలంటీర్లు ప్రత్యక్ష రాజకీయాల్లోకి పాల్గొకూడదని చెప్పడంతో తమకు బాధ కలిగించిందని వారు తెలిపారు. అందుకే ఉద్యోగానికి రాజీనామా చేసి నేరుగా ఎన్నికల ప్రచారంలో పాల్గొంటామని చెప్పారు. సోమవారం ఎంపిడిఒ మెట్ట వైకుంఠరావుకు రాజీనామా పత్రాలను అందజేస్తామని తెలిపారు. రాజీనామా చేసిన వారిలో బొడ్డపాడు వలంటీర్లు పత్రి విజయకుమార్, బత్తిని ఆశవర్మ, వంకల హేమలత, దున్న పవిత్ర, జడ్డే అనూష, మద్దిల అరుణ, వంకల జానీ, బైనపల్లి సుహాసిని, బైనపల్లి ప్రణయ్, రియ్యి రేష్మ, యారుమకు రేవతి, సార లలిత తదితరులు ఉన్నారు.

విద్యార్థిని ఆత్మహత్య కారణాలపై ఆరా

ప్రజాశక్తి - మధురవాడ (విశాఖపట్నం)

విశాఖ కొమ్మాది చైతన్య ఇంజనీరింగ్ అండ్ పాలిటెక్నిక్ కాలేజీలో ఫస్ట్ ఇయర్ డిప్లొమో చదువుతూ గురువారం అర్ధరాత్రి ఆత్మహత్యకు పాల్పడ్డ విద్యార్థిని రూప శ్రీ కేసుపై పోలీసులు వివిధ కోణాల్లో ఆరా తీస్తున్నారు. ఘటనపై కళాశాల యాజమాన్యాన్ని సాంకేతిక విద్యా కమిటీ సైతం నివేదికను కోరింది. ఈ నేపథ్యంలో కేసు దర్యాప్తు ముమ్మరంగా సాగుతోంది.


అచ్చెన్నతో తల్లి కళావతమ్మ (ఫైల్)

అచ్చెన్నకు మాతృవియోగం

ప్రజాశక్తి- కోటబొమ్మాళి (శ్రీకాకుళం జిల్లా)

టిడిపి రాష్ట్ర అధ్యక్షులు, టెక్కలి ఎమ్మెల్యే అచ్చెన్నాయుడు తల్లి, శ్రీకాకుళం పార్లమెంటరీ సభ్యులు కింజరాపు రామ్మోహన్‌నాయుడు నాయినమ్మ కళావతమ్మ (90) ఆదివారం మృతి చెందారు. అమె గత కొంత కాలంగా వయోభారంతో ఆనారోగ్యం బారిన పడ్డారు. శ్రీకాకుళం జిల్లా కోటబొమ్మాళి మండలం నిమ్మాడలోని స్వగృహంలో ఆమె తుదిశ్వాస విడిచారు. కళావతమ్మకు నలుగురు కుమారులుఎర్రన్నాయుడు, హరివరప్రసాద్, ప్రభాకర్, అచ్చెన్నాయుడు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. అమె అంత్యక్రియలు సోమవారం నిమ్మాడలో జరుగుతాయని బంధువులు తెలిపారు. కళావతమ్మ మృతిపై మాజీ ముఖ్యమంత్రి, టిడిపి అధినేత నారా చంద్రబాబునాయుడు, ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌లు ఫోన్‌లో సంతాపం తెలిపారు. కింజరాపు కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

పింఛన్లకు చంద్రబాబు అడ్డు

- మంత్రి విడదల రజని

ప్రజాశక్తి-గుంటూరుజిల్లా ప్రతినిధి

వృద్ధులు, వికలాంగులకు పింఛన్ల పంపిణీని అడ్డుకోవాలని చంద్రబాబు నాయుడు, ఆయన అనుచరులు ప్రయత్నిస్తున్నారని మంత్రి విడదల రజని ఆరోపించారు. గుంటూరులో తన కార్యాలయంలో ఆదివారం ఆమె విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. వలంటీర్ల ద్వారా పింఛను పంపిణీ నిలిపివేయాలని చంద్రబాబు నాయుడు, పవన్ కల్యాణ్, నిమ్మగడ్డ రమేష్‌కుమార్ కలిసి ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేయడం వెనుక రాజకీయ దురుద్దేశంతో పాటు పేదల పట్ల వారుకున్న వ్యతిరేకతను మరో సారి రుజువు చేసుకున్నారని అన్నారు.

కాంగ్రెస్‌లోకి టిడిపి నేత

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కర్నూలు జిల్లాకు చెందిన టిడిపి సీనియర్ నేత రామ్ పుల్లయ్య యాదవ్ ఆదివారం కాంగ్రెస్ పార్టీలో చేశారు. పిసిసి అధ్యక్షులు వైఎస్ షర్మిల ఆయనకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. హైదరాబాద్‌లోని ఆమె నివాసానికి చేరుకున్న ఆయన, చర్చల అనంతరం కాంగ్రెస్ పార్టీలో చేరారు. మరోవైపు వలంటీరు వ్యవస్థపై ఆంక్షలు విధించటాన్ని స్వాగతిస్తున్నట్లు ట్విట్టర్ వేదికగా షర్మిల తెలిపారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళికి విరుద్ధంగా వలంటీర్లను వైసిపి వాడుకుంటోందని అన్నారు. పింఛన్ల పంపిణీపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కెఎస్ జవహర్‌రెడ్డితో ఆమె ఫోన్‌లో మాట్లాడారు. రెండు మూడు రోజుల్లో లబ్ధిదారులకు పూర్తిస్థాయిలో పింఛన్ల పంపిణీ జరపాలని, దీని కోసం ఇతర ప్రభుత్వ యంత్రాంగాన్ని వినియోగించుకోవాలని సూచించారు. పింఛన్ల పంపిణీని ఆలస్యం చేస్తే సిఎస్ కార్యాలయం ముందు ఆందోళన చేస్తామని ఆమె పేర్కొన్నారు.

రాష్ట్రంలో అందరూ ప్రభుత్వ బాధితులే : పురందేశ్వరి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలోని ప్రజలందరూ వైసిపి ప్రభుత్వ బాధితులేనని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు దగ్గుబాటి పురందేశ్వరి విమర్శించారు. విజయవాడలోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఆదివారం ఒబిసి మోర్చా రాష్ట్ర కార్యవర్గ సమావేశం మోర్చా రాష్ట్ర అధ్యక్షులు రొంగల గోపీ శ్రీనివాస్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా పురందేశ్వరి మాట్లాడుతూ.. వైసిపి ప్రభుత్వం చేసిన మోసాలు, జరిగిన అవినీతిని ప్రజలకు వివరిస్తామన్నారు. నాణ్యత లేని మద్యం వల్లే చాలా మంది ఆస్పత్రి పాలైనట్లు అనేక మంది వైద్యులు నిర్ధారించారన్నారు.

అధికారంలోకి రాగానే కులగణన

- ఇంటి దగ్గరకే రూ.4వేల పింఛన్
- రాష్ట్ర ప్రయోజనాల కోసమే పొత్తు
- ప్రజాగళం సభల్లో చంద్రబాబు

ప్రజాశక్తి - కర్నూలు ప్రతినిధి/ మార్కాపురం

అధికారంలోకి రాగానే చట్టపరంగా కులగణన చేపడతామని టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం ఆయన కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు, ప్రకాశం జిల్లా మార్కాపురం, బాపట్లలో ప్రజాగళం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తాము అధికారంలోకి వస్తే పింఛను రూ.4 వేలు ఇస్తామని, ఇంటికే తీసుకొచ్చి అందిస్తామని, బిసిలకు 50 ఏళ్లకే పింఛన్ ఇస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్ర ప్రయోజనాల కోసమే బిజెపితో పొత్తు పెట్టుకున్నామన్నారు. రాబోయే ఐదేళ్లలో ప్రజల రుణం తీర్చుకుంటామని తెలిపారు. బిజెపితో తాత్కాలిక పొత్తు అంటూ నా పేరుతో ఫేక్ లెటర్ రాసి సోషల్ మీడియాలో వైసిపి నాయకులు దుష్ప్రచారం చేస్తున్నారని, ధైర్యం ఉంటే ముందుకొచ్చి మాట్లాడాలని సవాల్ విసిరారు. వైసిపి హయాంలో రాయలసీమలో 102 ప్రాజెక్టులు రద్దు చేశారని విమర్శించారు. సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేసి సీమ దిశను మారుస్తామని హామీ ఇచ్చారు. రాయలసీమకు అన్యాయం చేసిన జగన్‌కు ఓటు వేస్తే మన నెత్తిన మనమే చెత్త వేసుకున్నట్లేనని పేర్కొన్నారు. ఆదరణ పథకాన్ని మళ్లీ తీసుకొస్తామని, రూ.5 వేల కోట్లతో ఆధునిక పనిముట్లు ఇస్తామని, విదేశీ విద్యా దీవెన, చంద్రన్న బీమాను పునరుద్ధరిస్తామని తెలిపారు. శాశ్వత కుల ధ్రువీకరణ పత్రాలు అందజేస్తామన్నారు. చేనేతలకు 200 యూనిట్లు, పవర్ లూముకు 500 యూనిట్లు ఉచిత విద్యుత్ ఇస్తామని స్పష్టం చేశారు. చేనేతలకు ఫైనాన్స్ కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని, టెక్స్‌టైల్ పార్క్ తీసుకొస్తామని హామీ ఇచ్చారు. రెండుసార్లు ఎన్‌డిఎతో ఉన్నా ముస్లింలకు అన్యాయం జరగకుండా హక్కులను కాపాడిన పార్టీ తెలుగుదేశమని తెలిపారు. బుడగ జంగాలను, కురుబలను ఎస్‌సిల్లో, బోయలను ఎస్‌టిల్లో చేర్చేందుకు టిడిపి కట్టుబడి ఉందన్నారు. మాదిగలకు న్యాయం జరగాలని, జిల్లాల వారీగా వర్గీకరణ తీసుకొస్తామని హామీ ఇచ్చారు. గోదావరి నీళ్లు రాయలసీమకు తీసుకొస్తామని, ప్రాజెక్టులను పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు.

జగన్ పాలనలో ప్రజలు భారాలు మోయలేక ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని, ఇస్తున్న పథకాల్లో నవరత్నాలు లేవని... నవ మోసాలే ఉన్నాయని ఆరోపించారు. నవరత్నాల పేరుతో జగన్ బటన్ నొక్కుడేమోగానీ, విద్యుత్ ఛార్జీల పెంచేందుకు తొమ్మిది సార్లు బటన్ నొక్కారన్నారు. బటన్ నొక్కింది ఎంత? జనం దగ్గర బొక్కింది ఎంత? సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. రాష్ట్రానికి రాజధాని లేకుండా జగన్ చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మద్య నిషేధం చేస్తానని గత ఎన్నికలకు ముందు హామీ ఇచ్చారని, అధికారంలోకి వచ్చాక మద్యం ధరలు పెంచారన్నారు. వారంలో సిపిఎస్ రద్దు చేస్తామని చెప్పి మోసం చేశారని విమర్శించారు. జాబ్ కేలెండర్ ఊసే లేదన్నారు. టిడిపి అధికారంలోకి వస్తే మెగా డిఎస్‌సిపై తొలి సంతకం చేస్తామని, నిరుద్యోగులకు ఉపాధి కల్పిస్తామని హామీ ఇచ్చారు. ప్రజలు ఆలోచించాలని, వచ్చే ఎన్నికల్లో ఎన్‌డిఎ కూటమిని గెలిపించాలని కోరారు.

బాపట్లలో చంద్రబాబు మాట్లాడుతూ. 'వైసిసి ప్రభుత్వ హయాంతో రైతాంగం పూర్తిగా చితికిపోయింది.. వ్యవసాయ కూలీలకు పనుల్లేక ఇబ్బందులు పడుతున్నారు.. తుపాను, వరదలు వస్తే ప్రభుత్వం నుంచి సాయం లేదు.. కాలువల్లో పూడికలు తీయక పంట పొలాలు నీట మునుగుతున్నాయి. రైతుల నుంచి ధాన్యం కొనే దిక్కు లేదు' అని విమర్శించారు. జగన్ తన ఐదేళ్ల పాలనలో ఆకాశంలోనే తిరిగారని ఎద్దేవా చేశారు. తుపానుతో పంటలు నీటిలో మునిగిపోయి రైతులు ఇబ్బందులు పడుతుంటే పరదాలు కట్టుకొని వచ్చారని, పొలాల్లోకి రాకుండా కార్పెట్‌లపై నడిచి వెళ్లారని విమర్శించారు. ప్రస్తుతం రాష్ట్రంలో కరువు పరిస్థితులు నెలకొన్నాయన్నారు. పంటలకు సాగునీరు, ప్రజలకు తాగునీరు ఇవ్వలేని అసమర్థుడిగా జగన్ నిలిచారని తెలిపారు.


కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు సభలో మాట్లాడుతున్న చంద్రబాబు నాయుడు

ఐదుగురు సభ్యులతో జనసేన ఎన్నికల పర్యవేక్షణ కమిటీ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

జనసేన పోటీ చేస్తున్న 21 అసెంబ్లీ, 2 పార్లమెంటు స్థానాల్లో ఎన్నికల పర్యవేక్షణకు ఐదుగురు సభ్యులతో రాష్ట్రస్థాయి కమిటినీ ఆ పార్టీ అధినేత పవన్‌కల్యాణ్ ఆదివారం ప్రకటించారు. ఈ కమిటీలో బి మహేందర్‌రెడ్డి, పి హరిప్రసాద్, వేములపాటి అజయ్‌కుమార్, మర్రెడ్డి శ్రీనివాస్, ప్రొఫెసరు కె శరత్‌కుమార్ ఉన్నారు. వీరిలో మర్రెడ్డి శ్రీనివాస్ పిఠాపురం నియోజకవర్గం సమన్వయ బాధ్యతలు చూస్తారని తెలిపారు.

విశాఖ దక్షిణం జనసేన అభ్యర్థిగా వంశీకృష్ణ శ్రీనివాస యాదవ్

విశాఖపట్నం దక్షిణం నియోజకవర్గం అభ్యర్థిగా వంశీకృష్ణ శ్రీనివాస యాదవ్‌ను పవన్‌కల్యాణ్ ప్రకటించారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు.

बैंक ऑफ़ बड़ौदा Bank of Baroda
విజయా బ్యాంక్ / దేనా బ్యాంక్
బ్యాంక్ ఆఫ్ బరోడా
ఉప్పుమాగులూరు బ్రాంచ్
సర్వే నెం.145, బల్లికురవ మండలం, బాపట్ల జిల్లా-523301.
మొబైల్ : 89775 13986, ఇ-మెయిల్ : uppuma@bankofbaroda.com

స్వాధీనతా ప్రకటన

(సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్ 2002 యొక్క రూల్ 8(1)) (స్థిరాస్తుల కొరకు)

ఇందుమూలముగా, **బ్యాంక్ ఆఫ్ బరోడా, ఉప్పుమాగులూరు బ్రాంచ్** అధీకృత అధికారిగా దిగువ సంతకందారు సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎసెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్సు 2002లోని రూల్ 3 తో చదివే సదరు సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగిస్తూ నోటీసులో పేర్కొన్న బకాయి మొత్తం **తేది.24.11.2023 నాటికి రూ.39,18,279.11 పై (అక్షరాల ముప్పై తొమ్మిది లక్షల పద్దెనిమిది వేల రెండు వందల డెబ్బై తొమ్మిది రూపాయల పదకొండు పైసలు మాత్రమే) + తేది.25.11.2023** నుండి వర్తించని వడ్డీ మరియు ఇతర ఛార్జీలతో కలిపి ఈ నోటీసు స్వీకరించిన తేది నుండి 60 రోజులలోగా తిరిగి చెల్లించవలసినదిగా **ఋణగ్రహీత : మెస్సర్స్ హేమలత (గ్రానైట్స్ ప్రాతినిధ్యం వహిస్తున్నవారు ప్రొప్రయిట్రిక్స్ శ్రీమతి నూతలపాటి హేమలత,** సర్వే నెం. 87-1, గురిజెపల్లి, బాపట్ల జిల్లా, ఆం.ప్ర-522258. **సహ-ఋణగ్రహీత : శ్రీమతి నూతలపాటి హేమలత (ప్రొప్రయిట్రిక్స్ - మెస్సర్స్ హేమలత (గ్రానైట్స్), భర్త. బాబు,** 1-87, గురిజెపల్లి, బాపట్ల జిల్లా, ఆం.ప్ర-523302. **హామీదారు : శ్రీ జువ్వి గుంట రామ్మోహన్,** 8-34, సంతమాగులూరు, బాపట్ల జిల్లా, ఆంధ్రప్రదేశ్-523302 వార్లను కోరుతూ **తేది.30.11.2023 న డిమాండ్ నోటీసు** జారీచేసినారు.

ఋణగ్రహీత, హామీదారు మరియు తనఖాదారులు సదరు ఋణాన్ని తిరిగి చెల్లించుటలో విఫలమైనందున ఋణగ్రహీత, హామీదారు, తనఖాదారు మరియు సాధారణ ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా సదరు చట్టము నందలి సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్సు 2002, రూల్ 8 తో చదివే సదరు సెక్షన్ 13 యొక్క సబ్-సెక్షన్ (4) క్రింద అతనికి సంక్రమించిన అధికారాలను వినియోగిస్తూ ఈ దిగువ సంతకందారు బ్యాంకునకు తనఖా ఉంచిన దిగువ వివరించిన ఆస్తిని **తేది.30.03.2024 న స్వాధీనం** చేసుకున్నారు.

సాధారణ ప్రజానీకానికి ముఖ్యముగా ఋణగ్రహీత, హామీదారు మరియు తనఖాదారులకు ఇందుమూలముగా హెచ్చరించునది ఏమనగా సదరు ఆస్తితో ఎట్టి లావాదేవీలు జరుపరాదు మరియు సదరు ఆస్తికి సంబంధించిన ఎట్టి లావాదేవీలైన **తేది.24.11.2023 నాటికి రూ.39,18,279.11 పై (అక్షరాల ముప్పై తొమ్మిది లక్షల పద్దెనిమిది వేల రెండు వందల డెబ్బై తొమ్మిది రూపాయల పదకొండు పైసలు మాత్రమే) + తేది.25.11.2023** నుండి వర్తించని వడ్డీ మరియు ఇతర ఛార్జీలతో కలిపి **బ్యాంక్ ఆఫ్ బరోడా, ఉప్పుమాగులూరు బ్రాంచ్** వారి ఛార్జీకి లోబడి ఉంటాయి.

ఋణగ్రహీత'లు, హామీదారు'లు మరియు తనఖాదారు'లు సెక్యూర్డు ఆస్తుల విమోచనం కొరకు గడువు లభ్యతపై సదరు చట్టంలోని సెక్షన్ 13 యొక్క సబ్-సెక్షన్ (8)లోని నిబంధనలు గమనించవలెను.

స్థిరాస్తుల వివరములు

ఐటమ్ నెం.1 : బాపట్ల జిల్లా, నరసరావుపేట రిజిస్ట్రేషన్ జిల్లా, నరసరావుపేట సబ్ రిజిస్ట్రేషన్ జిల్లా, సంతమాగులూరు మండలం, గురిజెపల్లి గ్రామ పంచాయితీ, గ్రామ సర్వే నెం. 87/1 వద్ద గల విస్తీర్ణం ఎకరా 4.10 సెంట్లులోని ఎకరా 0.55 సెంట్లుతో ఆస్తి. **హద్దులు : తూర్పు :** నూతలపాటి కోటేశ్వర రావు గారి భూమి, **పడమర :** నూతలపాటి నాగేశ్వర రావు గారి భూమి, **ఉత్తరం :** హక్కుదారులు యొక్క మిగిలిన భూమి, **దక్షిణం :** డొంక.

ఈ హద్దుల యందు విస్తీర్ణం ఎకరా 0.55 సెంట్లులోని వ్యవసాయేతర భూమి మరియు ఉపయోగాలతో నిర్మించబడినవి కలవు.

ఐటమ్ నెం.2 : బాపట్ల జిల్లా, నరసరావుపేట రిజిస్ట్రేషన్ జిల్లా, నరసరావుపేట సబ్ రిజిస్ట్రేషన్ జిల్లా, సంతమాగులూరు మండలం, గురిజెపల్లి గ్రామ పంచాయితీ, గ్రామ సర్వే నెం. 87/1 వద్ద గల విస్తీర్ణం ఎకరా 4.10 సెంట్లులోని ఎకరా 0.55 సెంట్లుతో ఆస్తి. **హద్దులు : తూర్పు :** నూతలపాటి కోటేశ్వర రావు గారి భూమి, **పడమర :** నూతలపాటి నాగేశ్వర రావు గారి భూమి, **ఉత్తరం :** పేరుమాళ్ల భూపతి గారి భూమి, **దక్షిణం :** హక్కుదారుని యొక్క భూమి.

ఈ హద్దుల యందు విస్తీర్ణం ఎకరా 0.55 సెంట్లులోని వ్యవసాయేతర భూమి.

ఐటమ్ నెం.3 : నరసరావుపేట రిజిస్ట్రేషన్ జిల్లా, చిలకలూరిపేట సబ్ రిజిస్ట్రేషన్ జిల్లా, పసుమర్రు గ్రామం, డి.నెం.795 లోని విస్తీర్ణం ఎకరా 3.92 సెంట్లు మరియు డి.నెం. 790/ఇ లోని విస్తీర్ణం ఎకరా 0.06 సెంట్లుతో గల, రెండు సర్వే నెంబర్లులోని విస్తీర్ణం ఎకరా 3.98 సెంట్లులోని విస్తీర్ణం ఎకరా 0.30 సెంట్లు దగ్గరలో గల డోర్ నెం.31-272 తో కలదు. **హద్దులు : తూర్పు :** నూతలపాటి వెంకట రత్నం గారికి అమ్మిన స్థలం, **పడమర :** షేక్ బాబావలీ గారి స్థలం, **ఉత్తరం :** మల్లెల శివ నాగేశ్వరరావు గారు వదిలిన 6 అ॥ల వెడల్పు గల బజార్, **దక్షిణం :** షేక్ మౌలాలి ముష్కిల్ గారి స్థలం.

ఈ పై హద్దుల యందు విస్తీర్ణం 121.1 చ॥గ॥లు లేదా 101.73 చ॥మీ॥లులోని ఖాళీ స్థలం.

తేది : 30.03.2024
ప్రదేశం : ఉప్పుమాగులూరు
సం/- చీఫ్ మేనేజర్ & అధీకృత అధికారి
బ్యాంక్ ఆఫ్ బరోడా

కొత్త ఆర్థిక సంవత్సరంలోనైనా ఆర్థిక కష్టాలు తీరేనా?

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

గత మూడు నాలుగేళ్లుగా కొనసాగుతున్న ఆర్థిక ఇబ్బందులు రాష్ట్ర ప్రభుత్వాన్ని చివరివరకు వెంటాడాయి. దీంతో ఏప్రిల్ ఒకటి నుండి ప్రారంభం కానున్న నూతన ఆర్థిక సంవత్సరంలోకి అప్పుల భారంతో అడుగుపెట్టాల్సివస్తోంది. ఈ నేపథ్యంలో రానున్న ఆర్థిక సంవత్సరంలో రాష్ట్ర ఆర్థిక స్థితి ఎలా ఉంటుందన్నది అధికరవర్గాల్లో చర్చనీయంశంగా మారింది.

కేంద్రం సహాయ నిరాకరణ

నిదుల పంపిణీ విషయంలో కేంద్రంలోని నరేంద్రమోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న ధోరణి రాష్ట్రానికి ఇబ్బందికరంగా మారుతోంది. ప్రతియేటా కేంద్రం నుంచి రావాల్సిన నిధుల విడుదల తగ్గుతోంది. కేంద్ర పన్నుల్లో రాష్ట్ర వాటా నిధులు, పలు కేంద్ర పథకాలకు రావాల్సిన నిధుల్లో కూడా కోతలు పడుతున్నాయి. ఎవరు అధికారంలోకి వచ్చినా కేంద్రంలోని ప్రభుత్వం అనుసరించే ధోరణి కీలకంగా మారనుంది. మరోవైపు కొత్త ఆర్థిక సంవత్సరం ప్రత్యేకంగా ఎన్నికల ఏడాది కావడంతో ఖర్చులు మరింత పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. ప్రధానంగా తొలి రెండు నెలలైన ఏప్రిల్, మేలు ఆర్థికశాఖకు కీలకం కానుంది. కొంత కాలంగా ఒకటో తేదీన జీతాలు ఇచ్చే పరిస్థితి లేకుండాపోయింది. దీంతో ఆ వర్గాల్లో తీవ్ర అసంతృప్తి, ఆందోళన పెరిగిపోయింది. అందుకే సోమవారం నుంచి ప్రారంభంకానున్న కొత్త ఆర్థిక సంవత్సరంలోనైనా ఉద్యోగుల ఆగ్రహాన్ని కొంతమేరకైనా తగ్గించాలంటే జీతాలు, పింఛన్లు ఒకటి, రెండు తేదీల్లోనే చెల్లించాల్సి ఉంటుంది.

పాత భారం కొత్త ఏడాదిపై

2023-24 ఆర్థిక సంవత్సరంలో ఆర్థిక కష్టాల కారణంగా వేల కోట్ల బిల్లులను చెల్లించలేకపోయారు. దీంతో అనేక బిల్లులను వచ్చే ఏడాదికి బదలాయించగా, మరికొన్ని బిల్లులను వెనకకు పంపించి వేశారు. ఇవన్నీ 2024-25 ఆర్థిక సంవత్సరంలోనే చెల్లించాల్సి ఉంటుంది. దీంతో కొత్త సంవత్సరం ఖజానాపై అదనపు భారంపడనుంది. గత ఏడాది సవరించిన బడ్జెట్ అంచనాల ప్రకారం ప్రభుత్వం ప్రతిష్టగా చెప్పుకునే సంక్షేమ పథకాలకు సంబంధించిన సామాజిక రంగంలో కూడా రూ. 35 వేల కోట్లు తక్కువగా ఖర్చు చేశారు. ఈ పరిస్థితుల్లో రాష్ట్ర ఆర్థిక పరిస్థితి త్వరలో ఏర్పాటుకానున్న కొత్త ప్రభుత్వానికి సవాలుగానే మారనుంది. ఇప్పుడున్న ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి వచ్చినా, కొత్తగా కూటమి అధికారంలోకి వచ్చినా ఆర్థిక నిర్వహణ కత్తిమీద సాములాంటిదేనని ఆర్థికశాఖ అధికారులే అభిప్రాయపడుతుండడం గమనార్హం.

కలకలం రేపిన మహిళ మృతదేహం

- కాలిన స్థితిలో లభ్యం
- హత్య చేసి నిప్పంటించినట్లు అనుమానం

ప్రజాశక్తి - తెనాలి (గుంటూరు జిల్లా)

గుంటూరు జిల్లా తెనాలి మండలం రూరల్ పరిధిలోని సంఘం జాగర్లమూడి గ్రామంలో ఆదివారం మహిళ మృతదేహం కలకలం రేపింది. పూర్తిగా కాలిన స్థితిలో ఉన్న మహిళ మృతదేహాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. డిఎస్‌పి ఎం రమేష్ బాబు, సిఐ టి.వెంకటేశ్వర్లు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. క్లూస్ టీమ్‌ను రప్పించి ఆధారాలు సేకరించారు. మహిళది హత్యా, ఆత్మహత్య అన్న కోణంలో స్థానికులను విచారిస్తున్నారు. చంపేసిన తరువాతే ఇక్కడికి తీసుకొచ్చి పెట్రోల్ పోసి తగలబెట్టారని అనుమానిస్తున్నారు. సిఐ టి.వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం.. సుమారు 25 నుంచి 30 సంవత్సరాల వయసున్న మహిళ మతదేహం గ్రామంలోని శివాలయం సమీపంలో డంపింగ్ ప్రాంతంలో పూర్తిగా కాలిన స్థితిలో ఉందన్నారు. ఆమె కుడి చేతికి పది గాజులు, ఎడమ చేతికి పింక్ కలర్ వాచ్ ఉంది. ఆమె మెడలో ఉన్న తాడుకు ఆంజనేయస్వామి, వెంకటేశ్వర స్వామి బొమ్మల లాకెట్లు ఉన్నాయి. ఆమె ఒంటిపై ఎరుపు రంగు పంజాబీ డ్రెస్ ఉందని, ఎత్తు 4.5 అడుగులు ఉండవచ్చని సిఐ చెప్పారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, ఆమె మృతిపై స్థానికులను విచారిస్తున్నామని చెప్పారు. ఆనవాళ్లు గుర్తించిన వారు 9440796219, 440796170 ఫోన్ నెంబర్లకు సమాచారం ఇవ్వాల్సిందిగా కోరారు.

యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా

- అడ్డుకున్న రైతులపై దాడి

ప్రజాశక్తి- పిచ్చాటూరు

తిరుపతి జిల్లా పిచ్చాటూరు మండలం పులికుంద్రం నదీ పరీవాహక ప్రాంతాల్లో ఇసుక అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతోంది. బడా నాయకుల అండ చూసుకుని రాత్రింబవళ్లు తేడా లేకుండా ఇసుకను అమ్మి సొమ్ము చేసుకుంటున్న స్థానిక వైసిపి నాయకుడు, సర్పంచ్ అన్న దొరై, ఆయన అనుచరుడు వెంకటేష్‌పై రెవెన్యూశాఖ చర్యలు తీసుకోవడంలేదంటూ గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇసుక ఆక్రమ రవాణాపై ఎన్నిసార్లు అధికారులకు మొరపెట్టుకున్నా సమస్య పరిష్కారం కావడంలేదని, దీని వల్ల గ్రామ చుట్టుపక్కల ఉన్న భూగర్భ జలాలు అడుగంటి పోతున్నాయని వాపోతున్నారు. ఆదివారం ఉదయం ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్లను గ్రామ రైతులు అడ్డుకున్నారు. దీంతో రైతులపై ఇసుక అక్రమ రవాణాదారులు దాడికి తెగబడ్డారు. తమని ఎవరూ ఏమీ చేయలేరంటూ కత్తులతో బెదిరించడంతో పాటు తమను ఎదిరించిన వారు ఊరు దాటలేరంటూ సవాల్ విసురుతున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై ఎస్ఐ వెంకటేశులును వివరణ కోరగా సర్పంచ్ అనుచరుడు వెంకటేష్‌పై కేసు నమోదు చేసి జరిమానా విధించామని చెప్పారు. అక్రమంగా తరలిస్తున్న మూడు ఇసుక ట్రాక్టర్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.



మాట్లాడుతున్న రాజేంద్రప్రసాద్

భూ యాజమాన్య హక్కు చట్టం రద్దు చేసే వరకూ పోరాటం

- ఐలు జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షులు సుంకర రాజేంద్రప్రసాద్

ప్రజాశక్తి- ఏలూరు

రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన భూ యాజమాన్య హక్కు చట్టాన్ని రద్దు చేసే వరకూ పోరాడుతామని ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ (ఐలు) జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షులు సుంకర రాజేంద్రప్రసాద్ అన్నారు. ఏలూరులోని సిఐటియు కార్యాలయంలో ఐలు రాష్ట్ర కమిటీ సమావేశం కెంగర కుమార్ అధ్యక్షతన ఆదివారం జరిగింది. ఈ సమావేశంలో రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ భూయజమాన్య హక్కుల చట్టం రద్దు కోసం న్యాయవాదులు ఇటీవల కాలంలో అలుపెరగని పోరాటం చేస్తున్నారన్నారు. దీనిపై ప్రజల్లో మరింత ప్రచారం సాగించి వారినీ ఈ పోరాటంలో భాగస్వాములను చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలోని 531 కోర్టుల్లో కనీస సౌకర్యాలు లేక కక్షిదారులు, న్యాయవాదులు పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కోర్టుల్లో న్యాయమూర్తులు, ఇతర సిబ్బంది కొరత వల్ల కక్షిదారులకు న్యాయం అందడంలో ఆలస్యం అవుతోందన్నారు. ఖాళీలను భర్తీ చేయాలని, కోర్టుల్లో మహిళా న్యాయవాదులకు కనీస సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఐలు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నల్లూరి మాధవరావు మాట్లాడుతూ దేశంలోని న్యాయవ్యవస్థను భయపెట్టేందుకు కొంతమంది న్యాయవాదులు రాజకీయ నాయకులకు లోబడి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తికి లేఖ రాయడం సరైనది కాదన్నారు. రాష్ట్రంలో ఐలును బలోపేతం చేసి న్యాయవాదులు, ప్రజల హక్కులు కాపాడేందుకు కృషి చేయాలని కోరారు. ఐలు రాష్ట్ర గౌరవాధ్యక్షులు దిగుపాటి రాజగోపాల్, ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఐలు అధ్యక్షులు నర్రా శ్రీనివాసు, ఐలు తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు కొల్లు సత్యనారాయణ తదితరులు ప్రసంగించారు.

నమోదిత కార్యాలయం : 6వ అంతస్తు, టవర్ ఎ, పెనిన్‌సుల బిజినెస్ పార్క్, సేనాపతి బాపత్ మార్గ్, లోవర్ పారెల్, ముంబై-400013.
రీటైల్ అసెట్ కలెక్షన్ శాఖ : డిసిబి బ్యాంక్ లిమిటెడ్, సెల్లో ప్లాటిన, కార్యాలయం నం.302, మూడవ అంతస్తు, ఎఫ్ సి రోడ్డు, పోలీసు గ్రౌండ్ ఎదురు, లలిత్ మహల్ హోటల్, శివాజీ నగర్ పూణె-411005.
DCB BANK

సర్ఫేసీ యాక్ట్, 2002 యొక్క సెక్షన్ 13(2) క్రింద డిమాండ్ నోటీసు

మీరు, దిగువ పేర్కొన్న రుణగ్రహీత(లు), సహ-రుణగ్రహీత(లు) మీ స్థిరాస్తుల (సెక్యూరిటీలు)ను తనఖా పెట్టి డిసిబి బ్యాంక్ లిమిటెడ్ నుండి లోన్/ల సౌకర్యాన్ని పొందారు. మీ డీఫాల్టీల ఫలితంగా మీ రుణాలు నిరర్ధక ఆస్తులుగా వర్గీకరించబడ్డాయి. డిసిబి బ్యాంక్ లిమిటెడ్ బకాయిల రికవరీ కొరకు సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రెస్ట్ యాక్ట్ 2002 (ది యాక్ట్) యొక్క సెక్షన్ 13(2) క్రింద డిమాండ్ నోటీసును జారీ చేయడమైనది. సెక్యూరిటీ ఇంట్రెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క రూల్ 3(1) తో చదువుతూ చట్టం యొక్క సెక్షన్ 13(2) ప్రకారం మరియు మీపై సర్వీస్ ద్వారా ఇందులోని విషయాలు ఇక్కడ ప్రచురించబడుతున్నాయి. రుణగ్రహీతలు, సహ రుణగ్రహీతలు, తనఖా పెట్టిన ఆస్తుల వివరాలు, బకాయిలు, సెక్షన్ 13(2) కింద పంపబడిన డిమాండ్ నోటీసు మరియు క్రింద క్లెయిమ్ చేయబడిన మొత్తం ఈ క్రింది విధంగా ఇవ్వబడ్డాయి:

రుణగ్రహీత, సహ రుణగ్రహీత/హామీదారుల పేరు మరియు చిరునామా, లోన్ ఎకౌంట్ నం., లోను మొత్తం	సెక్యూర్డ్ ఆస్తి చిరునామా	1. డిమాండ్ నోటీసు తేది 2. బకాయి మొత్తం
1. శ్రీ.అయ్యపురెడ్డి అనిల్, 2. శ్రీమతి. అయ్యపురెడ్డి అరుణ, అందరి నివాసం : 25-3-37, అడవవారి వీధి, ఆర్.అగ్రహారం గుంటూరు, ఆంధ్రప్రదేశ్, పిన్‌కోడ్-522004. లోన్ ఎకౌంట్ నం.: DAHLNAL00486362 మంజూరైన లోన్ మొత్తం : రూ.19,50,000/-	గుంటూరు జిల్లా, గుంటూరు ఉపజిల్లా, బుడంపాడు గ్రామ పంచాయితీ, గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ ఏరియా, బుడంపాడు గ్రామం వద్ద ఉన్న మొత్తం ఆ భాగం మరియు పార్శిల్ డో.నం.131/డి, బయట ఎసి. 0-90 1/2 సెంట్లు., బయట ఎసి. 2-25 సెంట్లు., అందులో సైట్ విస్తీర్ణం 106-49 చ.గ.లు. తో ఆర్.సి.సి. ఇంటితో పాటు విద్యుత్ ఎస్.సి.నం.11115051001867 తో దానిపై అన్నీ ఫిక్చర్లు మరియు ఫిట్టింగులు మరియు క్రింది విధమైన సరిహద్దులు : (సెక్యూర్డ్ అసెట్స్)	1. 26.02.2024, రూ.26,16,188.85/- (ఇరవై ఆరు లక్షల పదహారు వేల ఒక వందా ఎనభై ఎనిమిది రూపాయల ఎనభై ఐదు పైసలు మాత్రమే) 26 ఫిబ్రవరి, 2024 నాటికి. 2. ఎన్‌పిఎ తేది : 14.02.2024
1. లేట్.శ్రీ. ఉయ్యపు అప్పారావు తెలిసిన తెలియని చట్టపరమైన వారసులు శ్రీ.ఉయ్యపు శ్రవణ్ కుమార్ మరియు శ్రీమతి. ఉయ్యపు రమాదేవి ద్వారా ప్రాతినిధ్యం, 2. శ్రీ.ఉయ్యపు శ్రవణ్ కుమార్, 3. శ్రీమతి. ఉయ్యపు రమాదేవి, అందరి నివాసం : ఆర్.ఎస్.నం.లు.42పి, 43పి, 47పి, ప్లాట్ నం.లు.3807 మరియు 3808, డో.నం.77-145-4/8, పైపుల రోడ్డు, సుందరయ్యనగర్ రామాలయం వద్ద, విజయవాడ-520015 లోన్ ఎకౌంట్ నంబరు : DRBLVIA004452561/ DRBLVIA00489257 మంజూరైన లోన్ మొత్తం : రూ.14,00,000/-	ఆస్తి-1 : కృష్ణా జిల్లా, విజయవాడ సబ్ రిజిస్ట్రీ, విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ ఏరియా, విజయవాడ, సుందరయ్యనగర్ కాలనీ, పాయకాపురం వద్ద ఉన్న ఆస్తి మొత్తం ఆ ముక్క మరియు పార్శిల్ ఆర్.ఎస్.నం.లు.42పి, 43పి, 47పి స్థలం పై ప్లాట్ నం.3808 కొలత 50.0 చ.గ.లు. (సెక్యూర్డ్ అసెట్స్) ఆస్తి-2 : కృష్ణాజిల్లా, విజయవాడ సబ్ రిజిస్ట్రీ, విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ ఏరియా, విజయవాడ, సుందరయ్యనగర్ కాలనీ, పాయకాపురం వద్ద ఉన్న ఆస్తి మొత్తం ఆ ముక్క మరియు పార్శిల్ ఆర్.ఎస్.నం.లు.42పి, 43పి, 47పి స్థలంపై బేరింగ్ ప్లాట్ నం.3807 కొలత 50.0 చ.గ.లు. (సెక్యూర్డ్ అసెట్స్)	1. 15.03.2024 2. రూ.14,81,680.53/- (పద్నాలుగు లక్షల ఎనభై ఒక్క వేల ఆరు వందల ఎనభై రూపాయల యాభై మూడు పైసలు మాత్రమే) 15 మార్చి 2024 నాటికి. 3. ఎన్‌పిఎ తేది : 04.02.2024

మీరు రుణగ్రహీత/లు మరియు సహ-రుణగ్రహీతలు/హామీదారులు పైన పేర్కొన్న డిమాండ్ మొత్తాన్ని దీనితో చెల్లించవలసి ఉంటుంది. ఈ నోటీసు వచ్చిన 60 రోజులలోపు పూర్తిగా పైన పేర్కొన్న విధంగా తదుపరి వడ్డీ విఫలమైతే దిగువసంతకందారు పైన పేర్కొన్న సెక్యూరిటీల చట్టం అమలు క్రింద చర్య తీసుకోవలసి ఉంటుంది. చట్టంలోని సెక్షన్ 13లోని సబ్-సెక్షన్ (8)లోని నిబంధనలకు మీ దృష్టిని ఆహ్వానిస్తున్నాము. పైన పేర్కొన్న నిబంధనలో నిర్దేశించిన వ్యవధిలోపు సురక్షితమైన ఆస్తిని రీడీమ్ చేసుకోవడానికి మీకు స్వేచ్ఛ ఉంది. సెక్షన్ 13(13) ప్రకారం పేర్కొన్న చట్టం ప్రకారం, పైన సూచించిన సెక్యూరిటీలను మా సమ్మతి లేకుండా అమ్మకం, లీజు లేదా ఇతర మార్గాల ద్వారా బదిలీ చేయకుండా మీరు నిరోధించబడ్డారని దయచేసి గమనించండి.

తేది : 01.04.2024
ప్రదేశం : విజయవాడ/గుంటూరు
డిసిబి బ్యాంక్ లిమిటెడ్., కొరకు
అధీకృత అధికారి

రజకులకు తగిన ప్రాతినిధ్యం కల్పించండి

- రజక సంఘాల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు పాతపాటి అంజిబాబు

ప్రజాశక్తి-గుంటూరుజిల్లా ప్రతినిధి

రాష్ట్రంలో రజకులకు తగిన రాజకీయ ప్రాతినిధ్యం లభించడంలేదని రజక సంఘాల ఐక్యవేదిక రాష్ట అధ్యక్షులు పాతపాటి అంజిబాబు చెప్పారు. గుంటూరులోని జిల్లా రజక సంఘం కార్యాలయంలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఏ రాజకీయ పార్టీ కూడా జనాభా దామాషా ప్రకారం రజకులకు ఎమ్మెల్యే సీట్లు కేటాయించలేదన్నారు. ప్రభుత్వ నామినేట్ పోస్టుల్లోనూ తన కార్పొరేషన్ తప్పితే ఏ కార్పొరేషన్లోనూ అవకాశాలు కల్పించలేదని చెప్పారు. రజకులను గుర్తించిన పార్టీలకే మద్దతు ఇస్తామన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానంలో ట్రస్ట్ బోర్డ్ నెంబర్‌గా రజకులకు అవకాశం కల్పించాలని, ప్రతి దేవాలయంలో ట్రస్ట్ బోర్డు నెంబర్లు రజకులు ఉండాలని ప్రభుత్వం ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. రాజ్యసభ, లోక్‌సభ స్థానాలలో తగిన ప్రాతినిధ్యం కల్పించాలని డిమాండ్ చేశారు. రజకులు ఏళ్ల తరబడి భూముల్లో ఉండి వృత్తిపనులు చేసుకుంటున్నా వారికి హక్కులు ఉండడంలేదని, 18 ఏళ్ల పైబడి ఏ భూమిలో ఉంటే వారికి ఆ భూమి దక్కుతుందని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పునకు అనుగుణంగా శాశ్వత హక్కులు కల్పించాలని కోరారు.

AXIS BANK LIMITED
రిటైల్ లెండింగ్& పేమెంట్ గ్రూప్ (లోకల్ ఆఫీసు/బ్రాంచి): యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్, డోర్ నం.30-22-79, శ్రీ టవర్స్, 1వ అంతస్తు, ఏలూరు రోడ్డు, సీతారామపురం సర్కిల్, విజయవాడ-520002.

స్వాధీనతా ప్రకటన రూల్8(1) క్రింద (స్థిరాస్తి కొరకు)

ఏదైతే, **యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్** (గతంలో యుటిఐ బ్యాంక్ లిమిటెడ్‌గా పేరుగలది), దీని రిజిస్టర్డు ఆఫీసు: "ఐఆర్ఐఎస్‌హెచ్‌యుఎల్", సమర్తేశ్వరి టెంపుల్ ఎదురుగా, లా గార్డెన్ దగ్గర, ఎల్లిస్‌బ్రిడ్జి, అహ్మదాబాద్-380006, దీని ఇతర ప్రదేశాలలో బ్రాంచి ఆఫీసు: **రిటైల్ లెండింగ్& పేమెంట్ గ్రూప్ (లోకల్ ఆఫీసు/బ్రాంచి): యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్, డోర్ నం.30-22-79, శ్రీ టవర్స్, 1వ అంతస్తు, ఏలూరు రోడ్డు, సీతారామపురం సర్కిల్, విజయవాడ-520002** యొక్క అధీకృత అధికారిగా, ది సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటెరెస్ట్ యాక్ట్, 2002 క్రింద మరియు ది సెక్యూరిటీ ఇంటెరెస్ట్ (ఎన్ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 3తో చదువబడే సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగించుకొని, దిగువ రుణగ్రహీతలు/హామీదారులు/ తాకట్టుదారులను సార్ఫసీ యాక్ట్ యొక్క సెక్షన్ 13(2) క్రింద **డిమాండ్ నోటీసు** ను జారీచేశారు.

క్ర. సం.	దరఖాస్తుదారు/సహ-దరఖాస్తుదారు/హామీదారులు పేరు& చిరునామా	బకాయి రూ.లలో	ఆఫర్‌చేసిన ఈక్విటేబుల్ తాకట్టుపెట్టిన ఆస్తి మరియు స్వాధీనతా తేది
3.	1. శ్రీ గొంది విజయ రాణి, తండ్రి అట్లూరి లోకేశ్వర రావు, ఫ్లాట్ నం.402, శ్రీ వర్ధాని రెసిడెన్సీ, శ్రీరామ నగర్, 1వ లేన్, కానూరు, విజయవాడ, ఆం.ప్ర.-520007. **మరియు:** శ్రీ గొంది విజయ రాణి, తండ్రి అట్లూరి లోకేశ్వరరావు, డోర్ నం.2-112, దావాజి గూడెం, బుద్దవరం, గన్నవరం, కృష్ణా జిల్లా, ఆం.ప్ర.-521101 **మరియు:** శ్రీ గొంది విజయ రాణి (ప్రొప్రైటర్), కేరాఫ్ శ్రీ శ్రీనివాస ఏజెన్సీస్, డోర్ నం.8-67, ఫ్లాట్ నం.జి-1, పవన్ సాయి ఎంక్లేవ్, హనుమాన టెంపుల్ దగ్గర, ఎనికెపాడు, కృష్ణా జిల్లా, ఆం.ప్ర.-521108. 2. **శ్రీ ముప్పల ఫణీంద్ర కుమార్,** తండ్రి ముప్పల సత్యనారాయణ, ఫ్లాట్ నం.502, స్కైలైన్ ఫ్రైడ్ అపార్టుమెంట్స్, విద్యానగర్, గన్నవరం, అల్లాపురం, కృష్ణా జిల్లా, ఆం.ప్ర.-521101. **డిమాండ్ నోటీసు తేది:** 19.12.2023. **లోన్ ఖాతా నం. LPR006909059321**	రూ. 1,01,65,531/- (రూపాయలు ఒక కోటి ఒక లక్ష అరవై ఐదు వేల ఐదు వందల ముప్పై ఒకటి మాత్రమే)	కృష్ణా జిల్లా, కందిపాడు సబ్-రిజిస్ట్రార్ పరిధిలో, వైఎస్ఆర్ తడిగడప యొక్క మున్సిపాలిటీ పరిధిలో ఇప్పుడు లేని మరియు కృష్ణా జిల్లా, పెనమలూరు మండలం, పోరంకి గ్రామం యొక్క అసెస్మెంట్ నం.1192020556, రెవెన్యూ వార్డు నం.2, పన్ను రసీదు ప్రకారం డోర్ నం.8-0317 మరియు అసెస్మెంట్ నం.4093, డోర్ నం. 8-317, విజిఎంటి యుడిఎ ఆమోదిత ఎల్.పి.నం.61/1989 ప్రకారం ఆర్.ఎస్.నం.347/2, ఫ్లాట్ నం.86 లో గల గ్రౌండ్ ఫ్లోర్ (ఆమోదిత ప్లాన్& ప్రొసీడింగ్స్ ప్రకారం)తో ప్రస్తుత ఆర్‌సిసి రూఫ్ భవనము మరియు **సరిహద్దులు: తూర్పు:** లింగం విమళా దేవికు చెందిన ప్లాట్ నం.90-39.4అ.లు, **దక్షిణం:** జస్టి ఉమా మహేశ్వర వర ప్రసాద్ రావుకు చెందిన ప్లాట్ నం.90, 60.0అ.లు, **పడమర:** 33.0అ.లు వెడల్పురోడ్డు-39.0అ.లు. **ఉత్తరం:** ఇతరుల ల్యాండ్-60.0అ.లు. ఈ సరిహద్దుల్లో 262.36చ.గ.లు లేదా 218.36చ.మీ.ల విస్తీర్ణం. **స్వాధీనతా తేది: 30.03.2024**

తేది: 01.04.2024,
ప్రదేశం: ఆం.ప్ర
సం/- అధీకృత అధికారి,
యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్



అక్షరం

ప్రజాశక్తి
www.prajasakti.com
facebook/prajasakti, twitter/prajasakti

4 | విజయవాడ
సోమవారం 1 ఏప్రిల్ 2024



నియంతల మీదా, నిరుద్యోగమ్మీదా, లాకౌట్ల మీదా, యుద్ధాల మీదా గొంతెత్తేందుకు కళాకారులకు హక్కు లేదు.. అది రాజకీయులకే ఉందనడం మూర్ఖత్వం. అణగదొక్కాలనుకునేవారే ఇలాంటి తలతిక్కవాదం చేస్తారు.

- కొడవటిగంటి కుటుంబరావు

ఆసరా

ఇక్కడ నమ్మకం ఒక్కటే సరిపోదు
నమ్మకాన్ని నిజం చేయగల్గిన
'ఓటు' ఆసరాగా నిలవాలి
దేశాభ్యున్నతికై కొత్త దార్లు వెతికే
నాయకత్వం, పార్లమెంటు భవనంపై
మువ్వన్నెల జెండాయై ఎగరాలి
పేద బతుకుల్లో వెన్నెల నింపే
ఆలోచనలు అండగా నిలవాలి
నౌకరీ కోసం వలసలు పోయే
సంస్కృతిని ఆపి, దేశం నలుమూలలా
ఉద్యోగ వంగడాల్ని చల్లాలి
అప్పుడే కదా నవరాగంతో
వసంత కోకిలలు
ఆహ్వాన గీతాలవుతాయి
పల్లెపల్లెలో పచ్చదనం వికసించి
పండుగల ద్వారాలు తెరుచు కుంటాయి
నిన్నటి చీకటిని చీల్చుకొని
నేడుద్భవించిన భానుడు
భవితంతా కాంతి నింపుతాడు
ఎక్కడ, ఆలోచనల్లోంచి
స్వార్థం ఆవిరై, సంక్షేమం
పచ్చని చెట్టై విస్తరిస్తుందో
అక్కడ ప్రజాస్వామ్యం లోంచి
నీతిపుష్పాలు వికసిస్తాయి
జాతి యావత్తు ఆ పరిమళాలు ఆస్వాదిస్తాయి!

- ఎస్.ఆర్.పథ్వి
99892 23245

ఎవరికి, ఎందుకు ముద్దు?

పండి ఎండిన పచ్చనాకులు
చెట్టుకెందుకు ముద్దవుతాయి?
వయసు మళ్ళిన వద్ధ దేహాన్ని
ఏ గడప కడ దాకా మోస్తుంది?
బంధాలూ బంధుత్వాలూ
ఆస్తి సంధిలో పందిళ్ళే కదా!
రక్తాన్నెప్పుడో రూపాయి కొన్నాక
మనిషి ధర్మం మార్కెట్ బంధమేగా!

అవును ఇప్పుడు .. ఇప్పుడు
ఇన్సూరెన్సే అజెండా తప్ప
పన్నుకట్టే మనిషికి వైద్యం
అసాధ్యంగా ఎందుకైందో
ప్రశ్నించడం మరిచి పోయాం

గింజకు పురుడు పోసే పొలంలో
పనెందుకు దూరమైన ప్రశ్నయిందో
తల్లిలా చనుబాలు పట్టే పల్లెపుడు
పట్నం ఎండిన రొమ్ముగా మార్చిన
విటుడెవరో.. చర్చెందుకు లేవలేదు?

పల్లెందుకు వల్లకాడౌతుందో
పట్టణంలో ప్రయివేటు చదువు
విదేశీ గాలానికెలా తగులుకుందో
తల్లి రొమ్ము కోసిన రాక్షసి
సొంత అక్షరాన్ని హత్య చేసి
ఆంగ్ల అక్షరాన్నెలా ముద్దాడిందో
ఎవరైనా కొంచం యోచిస్తున్నారా?
ఎప్పుడైనా ఓసారి ప్రశ్నిస్తున్నారా?

- ఉన్నం వెంకటేశ్వర్లు

ఫోన్ నంబర్

గాయం కనబడదు
రక్తం అసలు చిందదు
నొప్పి అదాటున
నరనరాల్లోకి పాకి
హృదయాన్ని మెలి పెడుతుంది

నీ ఫోన్ సంభాషణ
తలను భూమిలోకి తొక్కేస్తుంది
లేకి మాట
గొంతెత్తి గుచ్చుతుంది
వేలెత్తి చూపుతుంది

అదాటున మీట నొక్కి
కారుచవకగా ఏదో దొరకబుచ్చుకుందామనే
ఆలోచన నీది
మాటల మంత్రదండం ఊపి
పలుకులకు పంచదార అద్ది
వలలో చేపపిల్లను
సునాయాసంగా పట్టాలనే ఆరాటం నీది

అక్కడొక అనుమానపు తాళి
చూపులతో గుచ్చి గుచ్చి చంపుతుంది
ముళ్ళ దండతో
ఉరేద్దామని కాపు కాస్తుంది
కాపురంలో మరొక భూకంపానికి
తెర లేస్తుంది


నీకు ఇదంతా ఆటపాటల మధ్య
మీసం మెలేస్తూ చేసే
సరదా సరదా చెలగాటం
ఇక్కడ కలం ఎత్తి
మనసులోని భావాలను మధించి ఒంపినందుకు
ప్రాణసంకటం

వాక్యం భుజం మృదువుగా తట్టే
ఆత్మీయ స్పర్శ కోసం
అక్షరాలను కళ్ళలో వేసుకునే
మురిపెం కోసం ఎదురు చూస్తూ
కవిత కింద ఫోన్ నంబర్
అమాయకంగా వేళ్ళాడుతుంది
కానీ, అది నీకు
ఆహ్వాన పత్రికో ఎర్ర తివాచీనో
కానే కాదని గుర్తుంచుకో
అయినా అడుగు ముందుకేసి
అదే దారిని అనుసరిస్తే
పాళీని కత్తిగా తర్జుమా చేసే శక్తి కూడా
ఇక్కడుందని గమనించుకో!

- పద్మావతి రాంభక్త
99663 07777

నిలదీయకపోతే మాట్లాడనిస్తారా?

'భూమిని మాట్లాడనివ్వండి' అంటున్నాడు కవి. 'మాట్లాడనివ్వండి అని ప్రాధేయపడుతున్నాడా? ప్రాధేయపడటం కవి చెయ్యాల్సిన పని కాదని స్పష్టంగా తెలిసిన కవి రాసిన కవిత్వమిది. భూమి తరుపున రాజ్యాన్ని నిలదీస్తున్నాడీ కవి. కొంచెం నిదానంగా ఆలోచిస్తే 'భూమిని' నేను, నన్ను 'మాట్లాడ నివ్వండి' అన్నట్టు లేదూ? ఎస్.. నాకూ అదే అనిపిస్తుంది. "పాలకులారా.. నా పెదాలు కుట్టీ నా గొంతు మీద ఉక్కుపాదం మోపి నన్నెంతకాలం ఇలా మాడ్లాడనివ్వకుండా చేస్తారు? నన్ను మాట్లాడ నివ్వండి" అని భూమి నిలదీస్తున్న దృశ్యం కనిపిస్తుంది పాఠకులకు. నిలదీస్తున్నది భూమి కావొచ్చు, లేదా కవి కావొచ్చు... చూడాల్సింది సందర్భం.



ఈ మాటలు రాస్తున్న సమయానికి ఢిల్లీ ముఖ్యమంత్రిని అరెస్టు చేసిన వార్త, ఎలక్టోరల్ బాండ్ల వ్యవహారం గురించిన వార్త వ్యాఖ్యలు నడుస్తున్న సందర్భం. ఒక ప్రధాన ప్రత్యర్థి రాజకీయ పార్టీ బ్యాంకు ఖాతాలను సీజ్ చేసి వారి ఎన్నికల ప్రచార కార్యకలాపాలు సజావుగా సాగకుండా చేసి తాము అధికార పీఠాన్ని కైవసం చేసుకునే కుట్రలు చేస్తూ భూమిని మాట్లాడనీయకుండా రాజ్యం కుట్రలు చేస్తున్న దుర్మార్గపు సందర్భం. ఈ దేశంలో ప్రజాస్వామ్యం ఉందా? అని ప్రజా సమూహాలు నిలదీస్తున్న అత్యంత కీలకమైన సందర్భం.

భూమి అంటే ప్రజలని కొత్తగా చెప్పాల్సిన పని లేదు. భూమిని మాట్లాడనివ్వాలని కవి నిలదీస్తున్నాడంటే ప్రజా సమూహాల గోడు వినమని. ఈ దేశాన్ని వెనకటి కాలంలోకి మళ్ళించడం కాదు ముందుకు తీసుకెళ్ళమని, ప్రశ్నించే గొంతుల్ని అణచివేయడం కాదు, భూమిని మాట్లాడనివ్వమని. ఈ పుస్తకంలోని ప్రతి పదమూ ఒక నిప్పురవ్వ. ప్రతి వాక్యమూ జ్వలించి నిలదీసే ప్రశ్న.

ఈ కవి వర్మ ముఖంలో ఎంత ప్రశాంతత గోచరిస్తుందో పుస్తకమూ అలాగే కనిపిస్తాది కానీ ...పేజీలు తిప్పితే కల్లోలభరితమైన ఆయన అంతరంగంలా లోపలి కవిత్వం గుండెను మండిస్తుంది. కుదురుగా ఉండనివ్వక ఆలోచనలో పడేలా చేస్తుంది. కవిత్వం చెయ్యాల్సిన పని ఇదే కదా!

లోపల్లోపల అంత మథనపడే ఆ మనిషి వదనంలో ఆ ప్రశాంతమైన చిరునవ్వు ఎలా సాధ్యం? నాకు మా నాగావళి గుర్తుకొచ్చింది. నది ఒడ్డున నిలబడి చూస్తే అసలు నీరు కదలనట్టు, ప్రశాంతంగా నిశ్చలంగా వెలుగు పడి తళతళా మెరుస్తూ కనిపించే 'తెమ్మ' జ్ఞాపకానికొచ్చింది. ఎదలో సుడిగుండాల్ని దాచుకోవడమెంత కష్టమో కదా.. అలా సుడిరేగిన అలలజడి ఈ పుస్తకంలోని కవితలని నాకు అవగత మయ్యింది. వర్మ లో మా నాగావళి నదిని చూసేను.

'ఒక జీవితకాలపు నెత్తురూ చెమటతో కట్టుకున్న కలల గూడును కూల్చే' కర్కశ పాదాలను ఖండించే కత్తులుగా వాక్యాలను నిర్మించగలగడం మిత్రుడు వర్మ ప్రత్యేకత. 'దేశాల మధ్య అయినా, ఇరు మనసుల మధ్య అయినా యుద్ధం దేనినీ మిగల్చదని' తెలిసిన వాడు కాబట్టే యుద్ధాన్ని వ్యతిరేకిస్తున్నాడు. నిజమే... ఈ కవి అంటున్నట్టు 'ఊరంతా పికాసో చిత్రంలా అర్థం కాని ఓ భయానక దృశ్యంగా మారి నిదరనెత్తుకెళ్ళిన రాత్రి' కదా యుద్ధమంటే ..!

'కాళ్ళకు సంకెళ్ళు వేయగలవేమో గానీ కలలకు కాదు' కదా,', 'నిరంతరమూ 'ఖైదులోనూ, జనం మధ్యా ఉండే వారి 'ఊహలు అనంతం' .. వారి 'స్వప్నం మరో ప్రపంచం.' 'దాహమంటూ గ్లాసుడు నీళ్ళు తాగితే కొట్టి కొట్టి చంపిన అపర బ్రహ్మలున్న చోట' కులమొక్కటే, మతమొక్కటే అనీ, 'ఏక్ భారత్, శ్రేష్టభారత్ అనే మర్మాల మరశబ్దాల నడుమ నీదీ నాదీ కాని దేశం కదా ఇది' అని అనుకోకుండా ఉండలేం కదా! 'న్యాయానికి గంతలు కట్టి, న్యాయమూర్తుల గుండెలపై ఉక్కుపాదం మోపి తీర్పులను తిరగరాయించే' మహానేతలను హెచ్చరిస్తూ 'చీకటిని తెరిచే ఉషోదయమొకటి వేచివుందని కబీరన్న మాట గుర్తుచేస్తున్నాడీ కవి. "ప్రశ్నలు జైళ్ళలో బంధించ బడ్డాయి, నదులజాడలు చెరిగిపోతున్నాయి, అడవి ఒంటరి ఆకాశమయింది" అంటూ ఇలాటప్పుడే 'మరల గోడలు మాటాడాల'ని, 'నెత్తురంటిన వాక్యం నినాదంగా రాయబడాల'ని ఎలుగెత్తి చాటుతున్న ఈ మిత్రుడ్ని ఎదకు హత్తుకోకుండా ఎలా వుండగలం?

"ఆ తల్లుల దేహ మాన ప్రాణాలను నగ్నంగా ఊరేగించి భయపెట్టజూస్తున్న వాడి" మీద, "నేల లేని వారి పాదాలు ఎటూ పారిపోలేవని, నిస్సంకోచంగా విరుచుకుపడుతున్న వాడి" మీద అక్షరాల్ని బాంబులు చేసి విసిరక తప్పదనే ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాడంటే కవి అత్యంత సున్నిత మనస్కుడు కావడం వల్లనే. అతడు గొంతెత్తి గానం చేస్తుంటే నేలతల్లి పులకించి పోయేది, అరణ్యం నెత్తుటి చిగురులేస్తది, సముద్రం అలలహోరెత్తేది", .తన చేతుల పొత్తిళ్ళలో అమరులంతా అరుణతారలైపోయేవారు, నెత్తుటి పుటలంచులనుండి జారి చివరాఖరికి మబ్బుల వెనక దాగి పోయినాడు.. పాట మాత్రం ఇంకా టేప్ రికార్డులో తిరుగుతూ పోరు హోరులో కలగలిసిపోయింది అని ప్రజాయుద్ధ నౌక గద్దర్ స్మృతిలో రాసిన కవిత చదువుతుంటే ఆ మాహా గాయకుడి గొంతు చెవుల్లో హోరెత్తుతున్నట్టే ఉంటుంది.

అక్షరాలు దిద్దించి బతుకుల్ని చక్కదిద్దాల్సిన టీచరమ్మ, కుల, మత, జాతి విద్వేషాలకు దూరంగా విద్యగరపాల్సిన ఒక టీచరమ్మ మతోన్మాదం తలకెక్కి, ఒకానొక ముస్లిమ్ విద్యార్థిని తోటి విద్యార్థులతో కొట్టించిన వార్తకు చలించిపోయిన కవి మృదయ స్పందన చూడండి,

"రోజూ హత్తుకుని ఆటలాడుకుంటూ ఒకరికొకరం భుజాలపై చేతులేసుకుని గంతులేసే మా మధ్య గోడలు కట్టే ఈ తృప్తి త్యాగి టీచరమ్మలు మొలుచుకొచ్చి మా దేహానికి మా మనసుల్లోకి రాని మత మృగాన్ని మేల్కొలిపి తరగతి గదిలో సరిహద్దు రేఖలు గీస్తూ హుకుం జారీచేస్తున్నారు" అని తీవ్రంగా చలించిపోతాడీ కవి. నాయకత్వానికి జేకొట్టి మెప్పు పొందే పనిలో బహుశా నిమగ్నమై ఉంటుందా టీచరమ్మ. టీచర్లే ఇలావుంటే దేశం తగలబడకుండా వుంటుందా? అనే కవి వేదన మనవేదన కూడా కదా.

ఇందులోని ప్రతి కవితా జరుగుతున్న అన్యాయాలపై, అక్రమాలపై ప్రకటిస్తున్న యుద్ధనినాదమే! ప్రతి వాక్యమూ ఒక రణన్నినాదమే! సమకాలీన సమాజంలో జరుగుతున్న ప్రతి సంఘటనకూ స్పందించి కవితగట్టే ఈ కవి హృదయావిష్కరణే ఈ "భూమిని మాట్లాడనివ్వు" ప్రతి కవితా ఉదహరించదగ్గదే! ఈ పుస్తకం కొని చదివి ఎవరికి వారు అనుభూతి చెందాల్సిందే!

నిజమే... 'భూమిని మాట్లాడనివ్వమని' డిమాండ్ చేస్తున్న ఈ కవిత్వం, లేదూ 'భూమి తనని వినమని' నిలదీస్తున్న ఈ కవిత్వం ఇప్పటి సామాజిక అవసరం. సరైన సమయంలో సరైన ప్రతిస్పందన. వర్మ కవిత్వంలో శ్రావణమాసపు నాగావళి ఉరవడి ఉంది. నాగావళి కెరటాలై ఎదురయ్యే ప్రశ్నలున్నాయి. ఒక్కో సందర్భంలో వరదై ముంచెత్తే ఆగ్రహ ప్రకటనలున్నాయి. ఈ సమయంలో సంయమనంతోనూ, నిగ్రహంతోనూ కూడిన ఇలాటి ఆగ్రహ కవిత్వ ప్రకటనల్లేకపోతే భూమిని మాట్లాడనిస్తారా భూ బకాసురులు?

ఇంత మంచి కవిత్వాన్ని కానుక చేసిన మిత్రుడు వర్మకు అభినందనలు. కవిమిత్రులు ప్రసాదమూర్తి, కుప్పిలి పద్మల ఆలోచింప చేసే ముందు మాటలతో వచ్చిన 107 పేజీల ఈ కవితాసంపుటికి అరుణాంక్ లత గారి కవర్ డిజైన్ అదనపు ఆకర్షణ. రు.120 ల వెలతో 'అనేక' (విజయవాడ), ఇతర అన్ని ప్రముఖ పుస్తకాల షాపుల్లోనూ లభిస్తుంది. లేదా కవి మొబైల్ నెంబరు 94934 36277లో సంప్రదించి, పొందొచ్చు.

- గంటేడ గౌరునాయుడు

మానవత్వపు కథా పరిమళం


'ప్రతి కథకు ఒక బాధ్యత ఉంటుంది. అది సామాజిక ప్రయోజననానికి దోహదకారి కావాలి. నలుగుర్ని ఉత్తేజపరచాలి. పది మందికి కర్తవ్య బోధ చేయాలి.' అని కొద్దిమంది రచయితలు మాత్రమే ఆలోచిస్తారు. ఆ కొద్దిమంది కోవకు చెందినవారే ఈతకోట సుబ్బారావు. తన గుండెను పిండేసే సంఘటనను చూసినప్పుడు దాన్ని నలుగురికీ తెలియజేయాలని ఆయన తపన పడ్డాడు. ఆ తపనలోంచి పుట్టుకొచ్చిన కథల సంపుటే ఆయన తాజాగా వెలువరించిన 'పోడుగాలి'. ఒక మాస్టర్ చెఫ్ వండితే, ఆ వంట ఎంత అద్భుతంగా వస్తుందో- అలానే ఒక సాహిత్యాభిమాని అయిన జర్నలిస్టు సృజించిన కథ కూడా అంతే బాగుంటుంది. దానికి చక్కని ఉదాహరణే ఈతకోట సుబ్బారావు. పోడుగాలి కథాసంపుటిలో మొత్తం 21 కథలున్నాయి. అన్నీ దిగువ మధ్యతరగతి జీవితాలకు అక్షర రూపాలే!

అంతిమయాత్రలో కూతురి అంచనాలను తారుమారు చేసిన ఓ తండ్రి కథే 'మాటల మనిషి'. అతనో గుమస్తా. ఊళ్ళో విషయాలన్నీ తన భుజాలపై వేసుకుంటాడుగానీ సొంత పనుల కోసం అంతగా తపించిపోడు. కూతుర్లిద్దరూ దేశం కాని దేశంలో హాయిగా కాపురాలు చేసుకుంటున్నారు. అతని భార్య కాలం చేసింది. ఊళ్ళో ఒక్కడే ఉంటున్నాడు. ఊళ్ళో నాన్న ఒక్కడే బిక్కుబిక్కుమంటూ ఉంటాడని, తండ్రిని ఎలాగైనా తన వద్దకు తీసుకొచ్చేయ్యాలని నిర్ణయించుకుంటుంది. అంతలోనే ఒకరోజు అర్ధరాత్రి ఆమెకు ఫోన్ వస్తోంది. తండ్రి చనిపోయాడని సమాచారం. ఎవరో దయగలవాళ్ళు ఓ పూలమాల వేసి దీపం పెట్టి ఉంటారు. అది గాలికి మిణుకుమిణుకుమంటూ రెపరెపలాడుతూ ఉంటుంది. ఇద్దరం సంతానం ఉండి కూడా తండ్రిని అనాథలా ఉంచేశాం అని బాధపడుతూ, విదేశం నుంచి వస్తుంది. ఆమె అంచనాలు, అనుమానాలు అన్నీ పటాపంచలైపోతాయి. ఒక సాధారణ గుమాస్తాకి ఇంతటి జనాదరణ, ప్రేమాభిమానాలు ఎక్కడివని ఆశ్చర్యపోతుంది.

'బంగారు తల్లీ! మాటే మనిషిని ఆవిష్కరిస్తుందిరా. మనం ఉన్నా లేకున్నా మనల్ని తలుచుకునేలా చేసేది మన మాట తీరే కదా! కష్టాలలో ఉన్నవారు సహాయం కన్నా ముందుగా ఆశించేది ఆప్యాయంగా పలికే రెండు మాటలు, ఓదార్పుగా చెప్పే నాలుగు పలుకులు, ధైర్యం చెప్పే ఓ మనిషి.. మనల్ని పరిపూర్ణ వ్యక్తిగా సమాజంలో నిలిపేది మన మాట తీరే..' అని తండ్రి పైనుంచి చెప్పినట్లు ఆమె భావిస్తుంది. ఈ ఒక్క సంభాషణలోనే తాను చెప్పదలుచుకున్న విషయాన్ని రచయిత సూటిగా చెప్పాడు. మనిషికి కావాల్సిన ఆభరణం ఏమిటో స్పష్టీకరించాడు. తెలిసిన విషయమే అయినా దాన్ని ఈరోజుల్లో పాటించని వారికి ఈ కథ ఓ కనువిప్పు.

సాటి మనిషి ఎదుగుతుంటే చూసి ఓర్వలేని కొంతమంది బలవంతులు ఆడుతున్న వింత నాటకంలో బలహీనులు ఎలా బలైపోతున్నారో చెప్పే కథే 'కొండ పరియ'. కొండల్లో ఏ దిక్కున వెళితే, ఏ పంట దొరుకుతుందో బాగా తెలిసిన వ్యక్తి పోరిగాడు. ఏ జంతువు ఎదురైనా తప్పించుకు వచ్చేవాడనే పేరుంది. అతని భార్య కూడా చేదోడు వాదోడుగా ఉంటుంది. వాళ్లకి ఒక కొడుకు. పట్నంలో హాస్టల్లో పెట్టి చదివిస్తున్నాడు. వారం వారం వెళ్లి చూసొస్తున్నారు కూడా. వాళ్లకి అంత సాయం చేసింది ఆ గూడెం దేవుడిగా భావించే సుబ్బారెడ్డి. అతడి వల్లే తన బిడ్డ చదువుకుంటున్నాడని అందరికీ చెప్పుకునే తిరిగేవాళ్ళు పోరిగాడు, అతడి భార్య. అలాంటివాళ్లు ఒక రోజు సెలవులకు ఇంటికొచ్చిన కొడుకుతో పులిపంజాకు బలైపోయారు. జనం వారి ఇంటి చుట్టూ చేరి, వాళ్ళ శరీరాల్ని చూస్తూ బాధ పడ్డారు. పోలీసులొచ్చి మూడు శవాలకు పోస్టుమార్టం కోసం తరలించారు. ఈ వార్త మీడియాలో పెద్ద దుమారాన్ని లేపింది. అధికారులు నివేదికలు తయారు చేయడంలో నిమగ్నమై ఉన్నారు. ఈ సంఘటనలో నిజానిజాలేమిటో తెలుసుకోవాలనుకుంటే కొండపరియ కథను చదవాల్సిందే! ప్రముఖ కథకులు ఎమ్వీ రామిరెడ్డి ఈ పుస్తకం బ్లర్బ్‌లో చెప్పినట్లు ఫ్యూడల్ వ్యవస్థలో మానవజాతి పులిపంజాకు ఎలా బలైపోతుందో కళ్ళకు కట్టిన కథ ఇది.

అనేకమంది అమ్మాయిలను తన వలలో వేసుకున్న వంచకుడి ప్రేమ చెరసాలలో చిక్కుకున్న ఒక యువతీ ఎలా బయటపడగలిగిందో చెప్పిన కథ 'చేతి కర్ర'. పెళ్ళయ్యాకైనా చదువుకోవాలని చూసే సరోజకు కూతురు రూపంలో ఎటువంటి అవకాశం దొరికిందో చెప్పే కథ 'మిణుగురు'. ఒక వేశ్యలో తల్లిని, గురువును చూసుకున్న శివరాం కథ 'మా..!'. మనలో ఉన్న భావోద్వేగాల్ని తడిమే కథ 'ఫోటో'. ... ఇలా చెప్పుకుంటూ పోతే ప్రతి కథలోనూ సామాజిక రుగ్మతనో, మానవత్వాన్నో, మూలాల్నో వెలికి తీసే ప్రయత్నాలే చేశారు రచయిత. ఇవన్నీ చదువుతుంటే



ఆయన ఎంతటి మానసిక క్షోభకు గురై, వీటిని కథలుగా మలిచారోననిపిస్తుంది.

ఈ కథాసంపుటిలోని ఒక్కొక్క కథను చదువుతుంటే మన మనసుపై ఎవరో కొరడాతో కొట్టినట్లు ఉంటుంది. చూసీ చూడనట్లుండే మన వైఖరిని ప్రశ్నించినట్లుంది. నీ వంతుగా నీవేం చేస్తున్నావో చెప్పమని అడిగినట్లుంటుంది. వీటిని కథల్లా చదివి ఊరుకుందామంటే మనల్ని ఓ పట్టాన కుదురుగా ఉండనివ్వవు.. మధ్య తరగతి జీవితాల ప్రదర్శనలివి.

ఈతకోట సుబ్బారావు కథకుడిగా, కవిగా, స్థానిక చరిత్ర అభిమానిగా (నెల్లూరు), పాత్రికేయునిగా, సంపాదకునిగా నాలుగు దశాబ్దాల పాటు సాహితీ రంగంలో తలమునకలై ఉన్నారు. ప్రస్తుతం విశాలాక్షి సాహిత్య మాసపత్రిక సంపాదకునిగా కొనసాగుతున్నారు. ఇప్పటివరకు ఆయన 16 పుస్తకాలను వెలువరించారు. అందులో ఏడు చరిత్రకు సంబంధించినవి, మరో ఏడు కవిత్వానికి సంబంధించినవి. పదకొండేళ్ళ క్రితం ఆయన 'కాశీబుగ్గ' అనే కథాసంపుటిని వెలువరించారు. అది ఎంతో ప్రాచుర్యం పొందింది. ఈ పోడుగాలి కూడా అంతే ఆదరణను పొందాలని ఆశిద్దాం. ఈ సంపుటికి ఎమ్వీ రామిరెడ్డి రాసిన అట్ట వెనుక మాట రచయిత అంతరంగాన్ని, ఈ సంపుటి ఉద్దేశ్యాన్ని తెలియజేస్తోంది. బంగారు బ్రహ్మం రూపొందించిన ముఖచిత్రం ఆకర్షణీయంగా ఉంది. ఈ కథాసంపుటి ప్రతులకు (వెల.రూ.200, పేజీలు : 180) రచయితని 94405 29785 నెంబర్లో సంప్రదించొచ్చు.

- దొండపాటి కృష్ణ
90523 26864

డా. వాసా ప్రభావతి స్మారక కవితల పోటీ

జాతీయ సమగ్రత, మతసామరస్యం, సమాజంలో ఉన్నతమైన విలువలను పాదుకొల్పడం లక్ష్యంతో సుప్రసిద్ధ సాహితీవేత్త డా. వాసా ప్రభావతి సంస్మరణార్థం కవితల పోటీ నిర్వహించాలని పాలపిట్ట-వాసా ఫౌండేషన్ సంకల్పించాయి. మనుషులంతా ఒక్కటేనని, తరతమ భేదం లేకుండా మసలుకొనే విధంగా మానవ సంబంధాలు మెరుగుపడాలన్న ఆకాంక్షను వాసా ప్రభావతి గారు తమ రచనల్లో ప్రబోధించారు. ఇదే స్ఫూర్తితో నిర్వహిస్తున్న ఈ కవితల పోటీకి తమ రచనల్ని పంపించవలసిందిగా అన్ని ప్రాంతాల కవులకు ఇదే మా ఆహ్వానం. మొదటి బహుమతి: రూ. 3000, రెండో బహుమతి: రూ. 2000, మూడో బహుమతి: రూ. 1000, ఎనిమిది కవితలకు ప్రత్యేక బహుమతులు (ఒక్కొక్క కవితకు రూ. 500) ఉంటాయి. పోటీకి పంపించే కవితలు ఎక్కడా ప్రచురితం, ప్రసారమై ఉండ కూడదు. కవితలు పంపించడానికి చివరి తేదీ: 30 ఏప్రిల్ 2024; ఫలితాలు ప్రకటించే తేదీ: 15 మే 2024. కవితలు పంపించాల్సిన చిరునామా : ఎడిటర్, పాలపిట్ట, ఫ్లాట్ నెం: 2, బ్లాక్, 6, ఎంఐజి 2, ఏపిహెచ్‌బి, బాగ్ లింగంపల్లి, హైదరాబాద్ - 500 044. ఫోను: 94900 99327. ఈమెయిల్: palapittamag@gmail.com

- గుడిపాటి

చరణ్ పరిమికి డాక్టర్ వి.చంద్రశేఖరరావు సాహిత్య పురస్కారం

మూడు దశాబ్దాలపాటు తన ప్రత్యేక శైలితో కథ, నవలా ప్రపంచాన్ని అబ్బురపరచిన విలక్షణ రచనాశీలి డాక్టర్ వి.చంద్రశేఖరరావు మరణించి ఏడు సంవత్సరాలు కావస్తోంది. ఏప్రిల్ 13 వారి జయంతి సందర్భంగా ప్రతి సంవత్సరం వర్ధమాన కథకునికి ఆయన పేరున సాహిత్య పురస్కారాన్ని చంద్రశేఖరరావు సాహితీ కుటుంబం ప్రదానం చేస్తోంది. 2024 సంవత్సరానికి గాను ఈ పురస్కారాన్ని యువ కథా రచయిత చరణ్ పరిమికి ప్రదానం చేయాలని చంద్రశేఖరరావు సాహితీ కుటుంబం నిర్ణయించింది. గతంలో ఈ పురస్కారాన్ని ఎండపల్లి భారతి, సుంకోజి దేవేంద్రాచారి, ఇండ్ల చంద్రశేఖర్, దుగ్గినపల్లి ఎజ్రాశాస్త్రి, వి.మల్లికార్జున్ లకు ప్రదానం చేశారు.

- డాక్టర్ వి.ప్రసూన

స్ఫూర్తి కందివనంకు కందికొండ పురస్కారం-2023

నెలపొడుపు సాహిత్య సాంస్కృతిక వేదిక నిర్వహించిన కందికొండ రామస్వామి స్మారక పురస్కారం 2023 హైదరాబాద్‌కు చెందిన కథా రచయిత్రి స్ఫూర్తి కందివనం రచించిన డిమ్కి కథల సంపుటిని ఎంపిక చేసినట్టు అధ్యక్ష ప్రధాన కార్యదర్శి వనపట్ల సుబ్బయ్య, పి.వహీద్ ఖాన్ తెలిపారు. 21.04.2024న నాగర్ కర్నూలు జిల్లా కేంద్రంలో జరిగే సభలో స్ఫూర్తిని పది వేల నగదు, శాలువా, మెమెంటోతో సత్కరించనున్నట్లు తెలిపారు.

అక్కినేనిపై రచనల పోటీ

సాంస్కృతిక బంధు సారిపల్లి కొండలరావు సౌజన్యంతో యువకళావాహిని- సాహితీకిరణం సంయుక్త ఆధ్వర్యంలో అక్కినేని శతజయంతి సందర్భంగా వ్యాసరచన, మినీ కవితల పోటీలు నిర్వహిస్తున్నాం. 1. అక్కినేని పౌరాణిక, భక్తి చిత్రాలు, 2. అక్కినేని జానపద, చారిత్రాత్మక చిత్రాలు, 3. అక్కినేని సాంఘిక చిత్రాలు, 4. అక్కినేని జీవిత వ్యక్తిత్వం గురించి వ్యాసాలు రాయొచ్చు. ఒక్కొక్క వ్యాసకర్త ఒక్క అంశాన్ని గురించే రాయాలి. వ్యాసం రాతలో 4 పేజీలూ, టిడిపిలో 2 పేజీలకు మించరాదు. ప్రతి అంశానికి ప్రథమ బహుమతి రూ.2500, ద్వితీయ బహుమతి రూ.1500 చొప్పున అందిస్తాం. అక్కినేని నటనపై 12 లైన్లు మించకుండా మినీ కవితలు పోటీకి కవితలు పంపొచ్చు. 4 మినీ కవితలకు ఎంపిక చేసి, ఒక్కొక్క కవితలకు రూ.1000 చొప్పున బహుమతి ఉంటుంది. బహుమతి ప్రదానం 2024 సెప్టెంబర్‌లో హైదరాబాద్‌లో అక్కినేని శతజయంతి వేడుకల్లో జరుగుతుంది. రచనలు చేరవలసిన ఆఖరు తేది : 30.04.2024. చిరునామా : సాహితీకిరణం, ఇం.నెం.11-13-154, అలకాపురి, రోడ్‌నెం.3, హైదరాబాద్-500102. సెల్: 94907 51681.

- పొత్తూరి సుబ్బారావు

గ్రీష్మ తాపాక్షరం

తూరుపునకు
బయలుదేరిన దేహపు
నుదురుపై వాలిన వెచ్చని గాలి
స్వేద బిందువులై రాలటంతో
ఎండా కాలపు స్పర్శలు
మొదలయ్యాయి!
నా కాయంపై ఆచ్ఛాదనలన్నీ
నాకు బరువై పోతున్నాయి
దిగంబరం కాలేక
కప్పుకున్న వస్త్రపు పోగుల్ని
వొలిచి పక్కన పెట్టాలనే ఆతృత
ఏ నూలుపోగూ లేని వొంటిని
స్వాగతిస్తోంది మనసు

చీకట్లను చీల్చుకుంటూ...
ఉదయ భానుడు
సప్తశ్వరథ మారుడై వేగంగా
వస్తున్నట్టు ఆకాశపు దార్లు
వెలుతురు బాకుల్ని
విసురుతున్నాయి
వేకువ కువకువ సంగీతం
వెచ్చగా పచ్చని పైర్లను
వాటేసుకుంటూ
సూర్యరశ్మి రూపాంతరమై
నిలువెల్లా నిటారుగా
పొడుస్తోంది!
ఇనుమును కరిగిస్తున్న
భగభగల కొలిమిలా
భగ్గున మండుతోంది ఎండ
ఎవరికీ ఎవరూ పట్టనట్టు
మనుషులంతా రోడ్లపై
అడుగుల వేగం పెంచారు
వాహనాలూ మెదళ్ళలాగే
వేడెక్కుతున్నాయి

ఋతువులన్నీ ఒకేలా వుండవు
అని చెప్పేందుకే
గ్రీష్మం కోపతాపాలతో
చిర్రుబుర్రు లాడుతున్నట్టుంది
తడి ఆరిపోయిన నాలుకలు
ఎడారి ఇసుక మేటలను
స్మరిస్తూ..
అడుగడుగునా
చలివేంద్రాలుంటే
బాగుండేదని ఘోషిస్తున్నట్టు
పొడిపొడి నిట్టూర్పులు!


లోపలి బయటి మంటల
గురించి
ఎంత చెప్పుకున్నా..
ఎండాకాలం వర్ణనాతీతం
అది శ్రమ జీవుల కలికాలపు
దు:ఖం

సుఖాల సంగతి ఏమో గానీ...
చెమట చుక్కలతో తడిసి
తీరని హక్కులతో వెరసి
ఒళ్లంతా ఉప్పు చారల్ని
కప్పుకున్న
అభాగ్యుల మీద
ఈ క్షణమే ఇప్పుడే వున్నపళంగా
కాసింత మంచు వర్షం కురిస్తే
ఆనంద తాండవం చేయాలని
వుంది
అంతే ఇది చాలు ఈ క్షణం..!

- డా. కటుకోర్ఘ్వుల రమేష్
99490 83327

సంగమం

ముద్ద మందారాన్ని
ముద్దు మందారం చేసి
శ్వేతపుష్పంపై హిమవర్షం వోలె
నువ్వు కురిపించిన ఆ
మకరందం మాటకందదు
స్నేహగీతమో రాగబంధమో
ఎరుక లేదు కానీ
నీ లోపల నన్ను నాలోపల
నిన్నూ ఎరుగుదును!



ఆ చోటంతా అమృతత్వం
ఆ తావులో బిందువు నేను
సింధువు నీవు..
ఎవరి వెంట ఎవరుంటేనేం
ఎవరిలో ఎవరైక్యమైతేనేం
ఇరువురన్న ధ్యాస
మరచినప్పుడు
మోగుతున్న హృదయవీణే సంగమం
ఆ.. హృది చేసే శృతి లయలే మది మమేకం!

- యామిని దేవి,
94928 06520

అవినీతి ప్రభుత్వాన్ని కూల్చాలి

● రామ్‌లీలాలో వక్తల పిలుపు


ఢిల్లీ రామ్‌లీలా మైదానంలో సభకు అధిక సంఖ్యలో హాజరైన ప్రజలు

న్యూఢిల్లీ : అత్యంత అవినీతికరమైన బిజెపి ప్రభుత్వాన్ని గద్దె దించి, ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని పరిరక్షించాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు.

అత్యంత అవినీతికర పార్టీగా బిజెపి : దీపాంకర్ ముఖర్జీ

సిపిఐ(ఎంఎల్) ప్రధాన కార్యదర్శి దీపాంకర్ ముఖర్జీ మాట్లాడుతూ.. ఎలక్టోరల్ బాండ్ల స్కామ్ దేశం ఇప్పటి వరకు చూడని అతిపెద్ద కుంభకోణమని అన్నారు. "ప్రభుత్వాలను పడగొట్టి, కార్పొరేట్ల నుంచి బాండ్ల ద్వారా సంపాదించిన రూ.కోట్లతో ఎంపిలు, ఎమ్మెల్యేలను కొనుగోలు చేశారు. ధరకు అమ్ముడుపోని వారిని సిబిఐ కేసుల్లో ఇరికించి జైలు పాలు చేస్తున్నారు. పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్నే నాశనం చేసే ప్రయత్నం జరుగుతోంది. ఎలక్టోరల్ బాండ్లతో బిజెపి దేశంలోనే అతిపెద్ద అవినీతి పార్టీగా అవతరించింది. మోడీ ప్రభుత్వం అవినీతి ప్రభుత్వంగా మారిందన్నారు. ఎన్నికల్లో అవినీతి ప్రభుత్వాన్ని కూల్చాలి" అని పిలుపునిచ్చారు.

ప్రధాని చేసింది సరైందేనా? : ప్రజలను ప్రశ్నించిన కేజ్రీవాల్ సతీమణి సునీత

'నా భర్తను మన ప్రధాని నరేంద్ర మోడీ జైలుకు పంపారు. ప్రధాని చేసినది సరైన పనేనా? కేజ్రీవాల్ నిజమైన దేశభక్తుడు, నిజాయతీ పరుడని మీరు విశ్వసిస్తున్నారా? ఈ బిజెపి వాళ్లు కేజ్రీవాల్ జైలులో ఉన్నారని, రాజీనామా చేయాలని అంటున్నారు. ఆయన రాజీనామా చేయాలా? మీ కేజ్రీవాల్ ఒక సింహం. వాళ్లు ఎంతోకాలం ఆయనను జైలులో ఉంచలేరు" అని సభికులను ఉద్దేశించి ఉద్వేగంగా సునీత ప్రసంగించారు.

ఝార్ఖండ్ తలవంచబోదు, ఇండియా ఫోరం కూడా తలవంచబోదు : హేమంత్ సోరెన్ సతీమణి కల్పనా సోరెన్

ఝార్ఖండ్ మాజీ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ సతీమణి కల్పనా సోరెన్ మాట్లాడుతూ "రెండు నెలల క్రితం, 'హేమంత్ సోరెన్‌ను జైలులో పెట్టారు. ఇప్పుడు, నియంతను తరిమికొట్టాల్సిన అవసరం ప్రజలపై ఉంది. ఝార్ఖండ్ తలవంచబోదు. ఇండియా ఫోరం కూడా తలవంచబోదు" అని ఆమె స్పష్టం చేశారు.

బిజెపిని చిత్తుగా ఓడించాలి : ఫరూక్ అబ్దుల్లా

రాజ్యాంగాన్ని పరిరక్షించడమే తమ లక్ష్యమని, తుదిశ్వాస విడిచే వరకు ఇండియాతోనే ఉంటుందని నేషనల్ కాన్ఫరెన్స్ నేత, జమ్ముకాశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి ఫరూక్ అబ్దుల్లా అన్నారు. "అన్ని మతాల వారు కలిసిమెలిసి ఉండే పరిస్థితి లేదు. ఈ విపత్కర పరిస్థితికి వ్యతిరేకంగా మనమంతా కలిసి గళం ఎత్తుదాం. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తికి కూడా ముప్పు పొంచి ఉంది. ఎన్నికల్లో బిజెపిని చిత్తుగా ఓడించాలి" అని అన్నారు.

సెంట్రల్ ఏజెన్సీలు బిజెపి సెల్స్ : తేజస్వీ యాదవ్

ఇడి, సిబిఐ, ఐటి వంటి కేంద్ర సంస్థలు బిజెపికి స్లీపర్ సెల్స్ లాంటివని ఆర్‌జెడి నేత తేజస్వీ యాదవ్ విమర్శించారు. "వారు తల్లిదండ్రులు, సోదరీమణులు, బంధువులను కూడా వేటాడారు. వారు సింహాలను బోనులో బంధిస్తారు. మనమంతా సింహాలమే. దేశం అప్రకటిత ఎమర్జెన్సీని ఎదుర్కొంటోంది. బిజెపి అహంకారపూరితంగా మారింది. అతిపెద్ద సమస్య ద్రవ్యోల్బణం, నిరుద్యోగం. ప్రియాంక చోప్రా, బిల్ గేట్స్‌లను కలవడానికి సమయం దొరికిన మోడీ.. రైతులను కలవడానికి వెళ్లడం లేదు" అని విమర్శించారు.

అధికారం శాశ్వతం కాదు: ప్రియాంక

అధికారం శాశ్వతం కాదు, వచ్చి పోతుందని మోడీకి శ్రీరాముడు ఇచ్చిన సందేశాన్ని ప్రియాంక గాంధీ గుర్తుచేశారు.

ఒకే పార్టీ, ఒకే వ్యక్తి ప్రభుత్వం దేశానికి ప్రమాదం: ఉద్ధవ్ థాకరే

ఒకే వ్యక్తి, ఒకే పార్టీ ప్రభుత్వం దేశానికి ప్రమాదమని, దేశాన్ని నియంతృత్వం దిశగా తీసుకెళ్తోందని శివసేన అధ్యక్షుడు ఉద్ధవ్ థాకరే విమర్శించారు. ఒక పార్టీ, ఒక వ్యక్తి సారథ్యంలో నడిచే ప్రభుత్వం అధికారం కోల్పోవాల్సిన సమయం ఆసన్నమైందని అన్నారు. అవినీతిపరులతో నిండిపోయిన బిజెపి ప్రభుత్వాన్ని ఎలా నడుపుతుందని ప్రశ్నించారు.

ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని కాపాడుకోవడం మన బాధ్యత : శరద్ పవార్

ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని కాపాడుకోవడం మన బాధ్యతని ఎన్‌సిపి చీఫ్ శరద్ పవార్ అన్నారు. 'ఇద్దరు సిఎంలను, పలు రాష్ట్రాల నాయకులను జైలులో పెట్టడం ప్రజాస్వామ్యంపైనా, రాజ్యాంగంపైనా దాడి. దాన్ని కాపాడుకోవడం మన బాధ్యత" అని అన్నారు.

మోడీ ప్రభుత్వం అత్యంత అవినీతిమయం: మెహబూబా ముఫ్తీ

పిడిపి అధ్యక్షురాలు మెహబూబా ముఫ్తీ మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం అత్యంత అవినీతి ప్రభుత్వమని విమర్శించారు. సరైన విచారణ లేకుండానే వ్యక్తులను నిర్బంధిస్తున్నారని, ఇది 'కలియుగ్ కా అమృత్ కాల్'ను పోలి ఉంటుందని వ్యాఖ్యానించారు.

ప్రజాస్వామ్యం, సంస్థల రక్షణ విషయంలో మోడీ ప్రభుత్వం జీరో వారెంటీ: డెరెక్ ఓబ్రెయిన్

టిఎంసి నేత డెరెక్ ఓబ్రెయిన్ మాట్లాడుతూ టిఎంసి ఇండియా ఫోరంలో భాగంగానే ఉందని, ఎప్పటికీ ఉంటుందని అన్నారు. ప్రజాస్వామ్యం, సంస్థల రక్షణ విషయంలో మోడీ ప్రభుత్వం జీరో వారెంటీ ఇస్తుందని విమర్శించారు.

దేశమంతటా నిరసనలు వెల్లువెత్తాయి: అని గోపాల్ రాయ్

కేజ్రీవాల్‌ను అరెస్టు చేసిన మార్చి 21 తరువాత దేశవ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తాయని ఢిల్లీ మంత్రి, ఆప్ నేత గోపాల్ రాయ్ అన్నారు. నిజం గెలుస్తుందని మరో మంత్రి కైలాష్ గహ్లోట్ అన్నారు. జైలులో ఉన్న ఢిల్లీ మాజీ ఆరోగ్య మంత్రి సత్యేంద్ర జైన్ భార్య పూనమ్ జైన్ కూడా ర్యాలీకి హాజరయ్యారు.


కోల్‌కతాలో ప్రచారం నిర్వహిస్తున్న సిపిఎం అభ్యర్థి సైరా షా హలీమ్

ఎన్నికల బాండ్లు, సందేశ్‌ఖాలిపై వామపక్ష అభ్యర్థుల ప్రచారం

కోల్‌కతా : పశ్చిమ బెంగాల్ నుండి పోటీచేస్తున్న వామపక్షాల అభ్యర్థులు ప్రధానంగా ఎన్నికల బాండ్లు, అవినీతి, మతోన్మాదం వంటి అంశాలతోపాటు స్థానికంగా సంచలనం కలిగించిన సందేశ్‌ఖాలి అంశాలపై ఉధృతంగా ప్రచారం సాగిస్తున్నారు. సిపిఎం నేత సుజన్ చక్రవర్తి డమ్‌డమ్ నుండి పోటీ చేస్తున్నారు. ఈ ప్రాంత కార్మికుల దుస్థితి గురించి బాగా అర్థం చేసుకున్న చక్రవర్తి ఈసారి తన గెలుపునకు అవకాశాలు బాగుంటాయని ఆశిస్తున్నారు.

జాదవ్‌పూర్ నుండి వామపక్ష అభ్యర్థిగా బరిలోకి దిగిన సృజన్ భట్టాచార్య, ముర్షిదాబాద్ నుండి మహ్మద్ సలీంలు కూడా స్థానిక సమస్యలతోపాటు సందేశ్‌ఖాలిపై ప్రధానంగా ప్రచారం చేస్తున్నారు. రాష్ట్ర రాజధాని కోల్‌కతాలోనూ సిపిఎం అభ్యర్థులు విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నారు.

మోడీ సర్కార్‌ను గద్దె దించాల్సిందే

(మొదటిపేజీ తరువాయి)

'భారత్ ఏకమై గెలుస్తుంది' అన్నది ఇండియా ఫోరం నినాదంగా మారిందన్నారు. 49 ఏళ్ల క్రితం రాంలీలా మైదానంలో లోక్‌నాయక్ జయప్రకాశ్ నారాయణ్ నిర్వహించిన మహత్తర ర్యాలీకి ప్రస్తుత ఇండియా ఫోరం ర్యాలీకి ఎంతో పోలిక ఉందని చెప్పారు. ప్రజలు మోడీ ప్రభుత్వాన్ని అధికారం నుంచి తరిమికొడతారని చెప్పారు. ఈస్టర్ పునరుత్థాన దినమని, దేశ పునరుత్థానం రాంలీలాతో ప్రారంభమవుతుందని అన్నారు. '1975 ర్యాలీలో జెపి స్వేచ్ఛ, బానిసత్వం నిర్మూలన అనే నినాదాన్ని ప్రకటించారు. ఈ రోజు మళ్లీ అదే నినాదం ఎలుగెత్తాల్సిన సమయం వచ్చింది.' అని చెప్పారు. రాజ్యాంగబద్ధమైన సంస్థలన్నింటినీ ప్రభుత్వం తన ఆధీనంలోకి తీసుకుందని, అవినీతి రాజ్యమేలుతోందని, నిరుద్యోగం, ద్రవ్యోల్బణం, ఆకలి పెరుగుతున్నాయని చెప్పారు. ఎన్నికల్లో బిజెపి ప్రభుత్వాన్ని ఓడించడం ద్వారానే ఈ కష్టాల నుంచి విముక్తి లభిస్తుందన్నారు. 'క్షీరసాగర మథనంలో అమృత కలశం మొదట దుష్టశక్తుల చేతికి చేరింది. అది ప్రస్తుత పరిస్థితి. దుష్ట శక్తుల నుండి అమృత కలశాన్ని స్వాధీనం చేసుకోవాలి. అప్పుడే నిజమైన అమృతకాలం సాధ్యమవుతుంది. మతతత్వ శక్తులను ఓడించడం ద్వారానే భారతదేశాన్ని రక్షించగలం' అని చెప్పారు.

కేజ్రీవాల్ ఆరు హామీలు

ఎన్నికలలో ఇండియా ఫోరమ్‌లో గెలిస్తే అమలు చేసే ఆరు హామీలను కేజ్రీవాల్ తరపున ఆయన భార్య సునీత ఈ సభలో ప్రకటించారు. పేదలకు నిరాటంకంగా ఉచిత విద్యుత్, ప్రతి గ్రామంలోనూ అత్యున్నత స్థాయి ప్రభుత్వ పాఠశాలలు, నైబర్‌హుడ్ క్లీనిక్‌లు, మల్టీ స్పెషాల్టీ ఆసుపత్రులు, స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల మేరకు రైతులకు కనీస మద్దతు ధర, ఢిల్లీకి పూర్తి రాష్ట్ర ప్రతిపత్తి కల్పిస్తామని కేజ్రీవాల్ హామీ ఇచ్చారు. తాను ఇడి కస్టడీలో ఉన్నందున ఫోరమ్‌లోని మిగిలిన పార్టీల నేతలతో సంప్రదించడానికి వీలు లేకుండా పోయిందన్నారు.

రెండు ఖాళీ కుర్చీలు

వేదికమీద మెదటివరుసలో ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్, జార్ఖాండ్ మాజీ ముఖ్యమంత్రి హేమంత్‌సోరెన్‌ల కోసం రెండు కుర్చీలను ఖాళీగా వదిలారు. కేజ్రీవాల్ సతీమణి సునీత, హేమంత్ సోరెన్ సతీమణి కల్పన ఈ సమావేశంలో పాల్గొన్నారు. శనివారం కేజ్రీవాల్‌ను కలిసిన సునీత ఆయన సందేశాన్ని వినిపిస్తున్నప్పుడు సభలో ఉద్వేగ భరితవాతావరణం నెలకొంది. హేమంత్ సోరెన్ భార్య కల్పన కూడా బిజెపిపై విరుచుకుపడుతూ మాట్లాడారు. బిజెపికి వ్యతిరేకంగా తమ పోరాటం ఆగదని చెప్పారు.

రాజ్యాంగాన్ని హైజాక్ చేశారు: రాహుల్

క్రికెట్ లో ఫిక్సింగ్ తరహాలో ప్రధాని నరేంద్ర మోడీ లోక్‌సభ ఎన్నికలను మ్యాచ్ ఫిక్సింగ్ చేస్తున్నారని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ విమర్శించారు. ప్రధానమంత్రి, ముగ్గురు, నలుగురు క్రోనీ క్యాపిటలిస్టులు కుమ్మక్కయి రాజ్యాంగాన్ని హైజాక్ చేశారని దుయ్యబట్టారు. ప్రజలు పూర్తి స్థాయిలో ఓటు వేయకుంటే వారి కుమ్మక్కు ఫలిస్తుందని, అదే జరిగితే రాజ్యాంగం కూలిపోతుందని పేర్కొన్నారు. ఇవిఎంల రిగ్గింగ్, సోషల్ మీడియా అవకతవలకు, మీడియాపై ఒత్తిడిని అడ్డుకుంటే బిజెపికి 180 సీట్లు దాటవని అన్నారు.

దేశాన్ని రక్షించడమే ప్రస్తుత కర్తవ్యం : డి రాజా

సిపిఐ ప్రధాన కార్యదర్శి డి రాజా మాట్లాడుతూ, బిజెపిని తరిమికొట్టి దేశాన్ని రక్షించడం భారతీయ సమాజ కర్తవ్యమని అన్నారు. "ఇడి, ఇతర కేంద్ర సంస్థలు ప్రతిపక్షాలను వేటాడుతున్నాయి. కేజ్రీవాల్, సోరెన్‌ల అరెస్టులే అందుకు నిదర్శనం. రాజకీయ నాయకులు రాజ్యాంగ నైతికతను పాటించాలని అంబేద్కర్ చెప్పారు. మోడీకి ఆ నైతికత ఉందా? అని అడుగుతున్నాం. దేశం తీవ్ర సంక్షోభంలో ఉంది. రాజ్యాంగాన్ని మార్చి, దేశాన్ని మత రాజ్యంగా మార్చే ప్రయత్నం జరుగుతోంది. ఎన్నికల్లో బిజెపిని ఓడించి లౌకికవాదాన్ని కాపాడాలి" అని పిలుపునిచ్చారు.

ఓట్లతోనే దేశాన్ని కాపాడుకోగలం: అఖిలేష్

ఎస్పీ అధ్యక్షుడు అఖిలేష్ యాదవ్ మాట్లాడుతూ ప్రపంచంలోనే అతిపెద్ద అబద్ధాలకోరు పార్టీ బిజెపి అని మండిపడ్డారు. 400 సీట్లు దాటాలని నినాదాలు చేస్తున్న వారు ఎందుకు ఆందోళన చెందుతున్నారని ప్రశ్నించారు. అరవింద్ కేజ్రీవాల్, హేమంత్ సోరెన్‌లను ఎందుకు అరెస్టు చేసి జైలుకు పంపారని ప్రశ్నించారు. " మీ ఓటు మాత్రమే మన రాజ్యాంగాన్ని, రిజర్వేషన్లను, 90 శాతం జనాభాను కాపాడుతుంది" అని ప్రజల నుద్దేశించి అఖిలేష్ యాదవ్ అన్నారు.

ప్రజాస్వామ్యాన్ని కాపాడండి : చంపయి సోరెన్

ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు ఓటు వేయాలని జార్ఖండ్ ముఖ్యమంత్రి చంపయి సోరెన్ పిలుపు ఇచ్చారు. బిజెపి నియంతృత్వం, భావజాలం ఎదగనివ్వబోమన్నారు. దళితులు, గిరిజనులు, వెనుకబడిన ప్రజల కోసం పనిచేస్తున్నందుకు హేమంత్ సోరెన్‌ను అరెస్టు చేశారని చెప్పారు.

కాంగ్రెస్‌కు మళ్లీ ఐటి నోటీసులు

● తాజాగా రూ.1745 కోట్ల పన్నులు చెల్లించాలని ఆదేశం

న్యూఢిల్లీ : ప్రధాన ప్రతిపక్షమైన కాంగ్రెస్‌కు ఆదాయపన్ను శాఖ మళ్లీ నోటీసులు పంపించింది. తాజాగా మరో రూ.1745కోట్లు ఆదాయపన్ను చెల్లించాలని ఐటి విభాగం నోటీసులు జారీ చేసింది. 2014-15 నుండి 2016-17 సంవత్సరాలకు మొత్తంగా రూ.1745 కోట్లు చెల్లించాలని పేర్కొంది. దీంతో కాంగ్రెస్ ఐటి పన్నుల రూపంలో చెల్లించాల్సిన మొత్తం రూ.3567కోట్లుకు చేరింది. తాజా మొత్తంలో 2014-15 సంవత్సరానికి (రూ.663కోట్లు), 2015-16 సంవత్సరానికి (దాదాపు రూ. 664కోట్లు), 2016-17 సంవత్సరానికి (దాదాపు రూ.417కోట్లు) చెల్లించాలని ఐటి అధికారులు పేర్కొన్నారు. రాజకీయ పార్టీలకు ఇప్పటివరకు అందుబాటులో వున్న పన్ను మినహాయింపును అధికారులు నిలిపివేశారు. దాంతో మొత్తంగా పన్నును వసూలు చేయడానికి కాంగ్రెస్ పార్టీకి నోటీసులు జారీ చేసినట్లు అధికారులు తెలిపారు. దాడుల సందర్భంగా దర్యాప్తు సంస్థలు కొందరు నేతల దగ్గర నుండి స్వాధీనం చేసుకున్న డైరీల్లో పేర్కొన్న థర్డ్ పార్టీ ఎంట్రీలకు కూడా కాంగ్రెస్‌పై పన్ను విధించినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. 2018-19 రిటర్న్‌పై కాంగ్రెస్ బ్యాంక్ ఖాతాలను ఐటి విభాగం స్తంభింపచేసింది. పన్నులు చెల్లించాలంటూ ఐటి అధికారులు ఇప్పటికే రూ.135 కోట్లను పార్టీ ఖాతాల నుండి విత్‌డ్రా చేశారు. దానిపై కాంగ్రెస్ కోర్టును ఆశ్రయించింది. దానిపై సోమవారం సుప్రీంలో విచారణ జరిగే అవకాశం వుంది. బిజెపి ఒత్తిడితోనే ఐటి శాఖ ఇండియా వేదికలోని పార్టీలపై దాడులకు పాల్పడుతోందని ప్రతిపక్షాలు విమర్శిస్తున్నాయి.

బిజెపి అభ్యర్థి ర్యాలీలో కార్లపై రాళ్లు

ముజఫర్‌నగర్ (యుపి) : బిజెపి అభ్యర్థికి మద్దతుగా నిర్వహించిన ఎన్నికల ర్యాలీలో కొంతమంది వ్యక్తులు రాళ్లు విసిరి, పలు కార్లను ధ్వంసం చేశారు. ముజఫర్‌నగర్ జిల్లా ఖతౌలి ఏరియాలో బిజెపి లోక్‌సభ అభ్యర్థి, కేంద్ర మంత్రి సంజీవ్ బాల్యన్‌కి మద్దతుగా ర్యాలీ జరిగింది. సభలో బాల్యన్ ప్రసంగిస్తుండగా, ఆ సమీపంలో పార్క్ చేసిన కార్లు ధ్వంసమయ్యాయి. దీనిపై నగర అదనపు ఎస్‌పి సత్యనారాయణ ప్రజాపత్ మాట్లాడుతూ, శనివారం రాత్రి సభలో బాల్యన్ మాట్లాడుతుండగా, కొందరు వాహనాలపై రాళ్లు విసిరారని, కార్ల కిటికీలు పగలగొట్టారని చెప్పారు. దాడికి పాల్పడినవారు నినాదాలు కూడా చేశారని తెలిపారు. నిందితులను పట్టుకోవడానికి గాలింపు చర్యలు చేపట్టినట్లు తెలిపారు.

రాష్ట్రపతి ముర్మకు మళ్లీ అవమానం

(మొదటిపేజీ తరువాయి)

పదేపదే పునరావృతమైన ఈ అవమానకర ఘటనలు తేల్చిచెబుతున్నాయి' అని కాంగ్రెస్ సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేసింది.

కనీస గౌరవం తెలియదా? : తేజస్వీయాదవ్

నిత్యం సంప్రదాయాలు, సుద్దులు గురించి బిజెపి నేతలకు కనీస గౌరవ మర్యాదలు కూడా తెలియడం లేదని ఆర్‌జెడి నేత తేజస్వీ యాదవ్ ఎద్దేవా చేశారు. 'రాష్ట్రపతి నిల్చొనివుంటే కనీసం లేచి నిలబడి గౌరవం ఇవ్వాలన్న సంగతి కూడా ప్రధాని మోడీకి తెలియదా?' అని ఆయన ప్రశ్నించారు.

మీ విధులు మీకు చెప్పాల్సి రావడం... అవమానకరంగా ఉంది

● గవర్నర్ల తీరుపై సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నాగరత్న

● పెద్ద నోట్ల రద్దు బ్లాక్‌మనీ ఉన్న వారికే లాభించింది



హైదరాబాద్ : కొన్ని రాష్ట్రాల్లో గవర్నర్లు వ్యవహరిస్తున్న తీరుపై సుప్రీంకోర్టు సీనియర్ న్యాయమూర్తి జస్టిస్ బివి నాగరత్న అసంతృప్తి వ్యక్తం చేశారు. వారు రాష్ట్ర ప్రభుత్వం పంపిన బిల్లుల్ని ఆమోదించకుండా తమ వద్దే అట్టే పెట్టుకోవడాన్ని ఆమె ప్రశ్నించారు. మీ విధులు మీరు నిర్వర్తించండంటూ గవర్నర్లకు చెప్పాల్సి రావడం న్యాయస్థానాలకు అవమానకరంగా ఉన్నదని వ్యాఖ్యానించారు. 'సమీక్షలో కోర్టులు, రాజ్యాంగం' అనే అంశంపై నల్సార్ విశ్వవిద్యాలయంలో ఆదివారం జరిగిన సదస్సును ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా జస్టిస్ నాగరత్న మాట్లాడుతూ పెద్ద నోట్ల రద్దును తప్పు పట్టారు. ఈ చర్య బ్లాక్‌మనీ ఉన్న వారికి ఉపయోగపడిందని, సామాన్య ప్రజలు ఇబ్బందులు పడ్డారని చెప్పారు.

'ఇవాళ దేశంలో గవర్నర్లు కొత్త ధోరణులు ప్రదర్శించడాన్ని చూస్తున్నాం. రాజ్యాంగం నిర్దేశించిన విధంగా మీ విధులు మీరు నిర్వర్తించండని, బిల్లులకు ఆమోదం తెలపడంలో జాప్యం చేయవద్దని వారికి చెప్పాల్సి రావడం అవమానకరంగా ఉంది. గవర్నర్లను కోర్టుకు లాగడం రాజ్యాంగపరంగా ఆరోగ్యకరమైన పరిణామం కాదు. వారు నిర్వర్తిస్తున్నవి రాజ్యాంగ బద్ధమైన పదవులు. వారు బాధ్యతాయుతంగా తమ విధులు నిర్వర్తించాల్సిన అవసరం ఉంది' అని జస్టిస్ నాగరత్న చెప్పారు. పెద్ద నోట్ల రద్దును సమర్థిస్తూ తీర్పు ఇచ్చిన ఐదుగురు సభ్యుల సుప్రీంకోర్టు ధర్మాసనంలో జస్టిస్ నాగరత్న కూడా ఒకరు. కేంద్ర ప్రభుత్వం తొందరపాటుతో నిర్ణయం తీసుకొని అమలు చేసిందంటూ ఆమె తన అసమ్మతి నోట్‌లో తెలిపారు. ధర్మాసనంలో ఆమె ఒక్కరే ప్రభుత్వ నిర్ణయంపై తన అసమ్మతిని వ్యక్తం చేశారు.

మహారాష్ట్ర, పంజాబ్ రాష్ట్రాల గవర్నర్లు తీసుకున్న నిర్ణయాలను జస్టిస్ నాగరత్న తన ప్రసంగంలో ప్రస్తావించారు. పరిస్థితిని చక్కదిద్దడానికి సుప్రీంకోర్టు జోక్యం చేసుకోవాల్సి వచ్చిందని ఆమె తెలిపారు. 'మహారాష్ట్రకు సంబంధించి (2023 మేలో ఉద్ధవ్ ఠాక్రే ప్రభుత్వం పతనమైన తర్వాత శాసనసభలో జరిగిన బలపరీక్ష) శాసనసభలో బలాన్ని నిరూపించుకోవాలని కోరడానికి గవర్నర్ వద్ద సమాచారం ఏమైనా ఉన్నదా అనేది ప్రశ్న. థాకరే ప్రభుత్వం శాసనసభ్యుల విశ్వాసం కోల్పోయిందని భావించడానికి ఆయన వద్ద ఆధారాలేవీ లేవు' అని అన్నారు.

దేశంలో ప్రజాస్వామ్య సంస్థల సమగ్రతను కాపాడడానికి, వాటి వారసత్వాన్ని పరిరక్షించడానికి గత సంవత్సరం సుప్రీంకోర్టు అనేక తీర్పులు ఇచ్చిందని జస్టిస్ నాగరత్న గుర్తు చేశారు. పంజాబ్ గవర్నర్ నాలుగు బిల్లుల్ని ఆమోదించకుండా తన వద్ద అట్టే పెట్టుకున్నారని అంటూ బిల్లులను నిరవధికంగా ఆమోదించకుండా మీ వద్దే ఉంచుకోకూడదని సుప్రీంకోర్టు ఆయనకు గుర్తు చేసిందని చెప్పారు. 'బిల్లులపై హఠం వేసుకొని కూర్చోవడం ద్వారా ఆయన వ్యాజ్యాలకు కారణమయ్యారు' అని వ్యాఖ్యానించారు.

పెద్ద నోట్ల రద్దు లక్ష్యం నల్లధనాన్ని రూపుమాపడమే అయినప్పటికీ దానిని హడావిడిగా అమలు చేసిన తీరు చట్ట ఉల్లంఘనులకు ప్రయోజనం చేకూర్చిందని, వారు తమ వద్ద ఉన్న నల్లధనాన్ని తెలుపుగా మార్చుకున్నారని జస్టిస్ నాగరత్న చెప్పారు. ప్రభుత్వ చర్య సామాన్యులకు ఇబ్బంది కలిగించిందని, వారు తమ వద్ద ఉన్న పాత నోట్లను కొత్త నోట్లుగా మార్చుకోవడానికి అనేక కష్టాలు పడ్డారని తెలిపారు. పెద్ద నోట్ల రద్దుపై ఏ స్థాయిలోనూ సంప్రదింపులు జరగలేదని ఆమె ఎత్తిచూపారు. విధాన నిర్ణయ ప్రక్రియ కూడా కన్పించలేదని అన్నారు. ఓ సాయంత్రం వేళ ప్రభుత్వ విధానాన్ని సంబంధిత శాఖలకు తెలియజేశారని, అది ఆ మరునాటి సాయంత్రమే అమలులోకి వచ్చిందని జస్టిస్ నాగరత్న చెప్పారు.


టెల్ అవీవ్ నగరంలో భారీ ప్రదర్శన నిర్వహిస్తున్న ఇజ్రాయిలీలు

నెతన్యాహు గద్దెదిగాలి

● ఇజ్రాయిల్‌లో భారీ ప్రదర్శనలు

టెల్ అవీవ్ : నెతన్యాహు ప్రభుత్వం గద్దెదిగాలని డిమాండ్ చేస్తూ ఇజ్రాయిల్‌లోని పలు నగరాల్లో ఇజ్రాయిలీలు భారీ ఎత్తున ఆందోళనలు నిర్వహించారు. టెల్ అవీవ్, జెరూసలేం, హైఫా, బీఎర్‌శేవ, కాశరియా తదితర నగరాల్లో శనివారం వేలాదిమంది కదం తొక్కారు. పాలస్తీనా పట్ల అనుసరిస్తున్న దుర్మార్గ వైఖరిని ఖండిస్తూ ,తక్షణమే బందీలను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ పెద్దపెట్టున నినాదాలు చేశారు.

పాక్‌లో భారీ వర్షాలు

● 24 గంటల్లో 8మంది పిల్లలు మృతి

పాకిస్థాన్ : పాకిస్థాన్‌లోని పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. రెండు రోజులుగా ఖైబర్ పఖ్తున్‌ఖ్వా ప్రావిన్స్‌లోని వివిధ జిల్లాల్లో కురుస్తున్న తీవ్ర వర్షాల వల్ల జనజీవనం స్తంభించింది. అనేక ఇళ్లు కూలిపోవడంతోపాటు పలు చోట్ల తీవ్ర నష్టం వాటిల్లినట్టు విపత్తు నిర్వహణ అధికార ప్రతినిధి అన్వర్ షాజాద్ తెలిపారు. పలు ఘటనల్లో గత 24 గంట్లోనే 8 మంది పిల్లలు మరణించగా, మరో 12 మంది తీవ్రంగా గాయపడినట్టు వెల్లడించారు. మృతుల్లో మూడు నుంచి ఏడేళ్ల వయసున్న ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు చిన్నారులు ఉన్నారని చెప్పారు. ఈ నెల ప్రారంభంలోనూ ఇదే ప్రాంతంలో కురిసిన భారీ వర్షాల వల్ల సుమారు 30 మందికి పైగా మరణించిన సంగతి విదితమే.

ఇప్పటివరకు ట్రయలరే

● మీరట్ ర్యాలీలో మోడీ


మీరట్ సభలో అభివాదం చేస్తున్న ప్రధాని మోడీ

మీరట్ : గత పదేళ్లలో అభివృద్ధికి సంబంధించి ట్రయలర్‌ను మాత్రమే ప్రజలు చూశారని, రాబోయే ఐదేళ్లలో దేశాన్ని ఇంకా ముందుకు తీసుకెళ్లబోతున్నామని ప్రధాని నరేంద్ర మోడీ అన్నారు. అందుకోసం రోడ్‌మ్యాప్‌ను తమ ప్రభుత్వం సిద్ధం చేస్తోందన్నారు. ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటించిన తర్వాత ఉత్తర ప్రదేశ్‌లోని మీరట్‌లో ఆదివారం నిర్వహించిన మొదటి ర్యాలీలో మోడీ ప్రసంగించారు. పదేళ్ల పాలనను ప్రధాని ట్రైలర్‌గా పేర్కొనడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దాదాపుగా ప్రపంచ సూచీలన్నింటిలో దేశం వెనుకబడి ఉండగా, వచ్చే ఐదేళ్లలో అభివృద్ధి చేసేస్తామన్న మాటలను ఎలా నమ్మాలని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికే మత అంశాలను తీసుకుని, సిఎఎ తదితర చట్టాలను అమలు చేస్తూ, మైనారిటీలపై విరుచుకుపడుతున్న ప్రభుత్వం వచ్చే ఐదేళ్లలో మరింతగా బరితెగిస్తుందా? అన్న ఆందోళన ఇప్పటికే సర్వత్రా నెలకొంది.

మూడో దఫా పదవీకాలాన్ని చేపట్టడానికి తమ ప్రభుత్వం ఇప్పటికే సన్నాహాలు మొదలుపెట్టిందని ప్రధాని చెప్పారు. మొదటి వంద రోజుల్లో తీసుకోవాల్సిన ప్రధాన నిర్ణయాలు ఏమిటనే అంశంపై తీవ్రంగా కసరత్తు చేస్తున్నామన్నారు. తాను దారిద్ర్యంలోనే పెరిగానని, అందుకే తనకు ప్రతి నిరుపేద కష్టం తెలుసునని చెప్పారు. అందువల్లే వారి ప్రతి ఒక్క సమస్యను పరిష్కరించేలానే తాను పథకాలు రూపొందిస్తున్నానన్నారు. పేదలకు సాధికారత కల్పించడమే కాకుండా వారికి ఆత్మగౌరవం కూడా కల్పిస్తామని చెప్పారు. ఇటీవల ఎన్‌డిఎలో చేరిన ఆర్‌ఎల్‌డి అధ్యక్షుడు జయంత్ చౌదరి కూడా మోడీతో వేదికను పంచుకున్నారు. యుపి సిఎం యోగి ఆదిత్యనాథ్, హర్యానా సిఎం నయాబ్ సింగ్ సైనీ తదితరులు ర్యాలీలో పాల్గొన్నారు.

यूनियन बैंक ऑफ इंडिया भारत सरकार का उपक्रम
యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా భారత ప్రభుత్వ రంగ సంస్థ

వలివర్తిపాడు బ్రాంచి : డి.నెం. 10-219/ఎ/ఇ, ఏలూరు - భీమవరం బైపాస్ రోడ్డు, గుడివాడ, కృష్ణా జిల్లా, ఎపి - 521301

ఇ-వేలం అమ్మకం ప్రకటన

సెక్యూరిటైజేషన్ మరియు రీ కన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 ప్రకారం **యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, వలివర్తిపాడు బ్రాంచి** అధీకృత అధికారిగా దిగువ సంతకందారు సదరు చట్టం నందలి రూలు 8(6) ప్రకారం సంక్రమించిన అధికారాలను వినియోగిస్తూ సాధారణ ప్రజానీకమునకు ముఖ్యంగా ఋణగ్రహీతలకు నోటీసు ఇచ్చి తెలియజేయునదిఏమనగా బ్యాంకు వారు దిగువ పేర్కొన్న బకాయిలను, తదుపరి వడ్డీ, ఛార్జీలు మొ॥నవి తిరిగి రాబట్టుకొనుటకు వారికి హామీగా ఉంచి, లాంఛనాత్మక స్వాధీనత చేసుకోబడిన స్థిరాస్తులను క్రిందసూచించిన విధముగా ఇ-వేలం ద్వారా బ్యాంకు వారిచే అమ్ముటకు నిర్ణయించడమైనది. దిగువ స్థిరాస్తి **అమ్మకం "ఎక్కడ ఏది ఉన్నదో, అది, ఎలా ఉన్నదో అలా మరియు అక్కడ ఏది ఉంటే అది"** ప్రాతిపదిన దిగువ పేర్కొనబడిన ఋణగ్రహీతల నుండి రావలసిన బకాయి మొత్తము **రూ. 5,60,426/-** (అక్షరాలా ఐదు లక్షల అరవై వేల నాలుగు వందల ఇరవై ఆరు రూపాయలు మాత్రమే) డిమాండ్ నోటీసు తేది : 16-09-2021 ప్రకారం వడ్డీ మరియు ఇతర ఖర్చులు రాబట్టుకొనేందుకు **యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, వలివర్తిపాడు బ్రాంచి వారిచే** ఇ-వేలం అమ్మకం ద్వారా **ది. 16-04-2024** న ఆస్తులను విక్రయించేందుకు నిర్ణయించడమైనది. బిడ్లు సమర్పించుటకు ఆఖరు తేది : ఈ-వేలం ప్రారంభానికి ముందు వరకు

ఋణగ్రహీతల వివరములు : 1) శ్రీ తోట వెంకటేశ్వరరావు, తండ్రి : రంగారావు, డి.నెం. 10/277-ఎ, రాజేంద్రనగర్, గుడివాడ, కృష్ణా జిల్లా, ఎపి-521301. **2) శ్రీ తోట వెంకటేశ్వరరావు,** తండ్రి : రంగారావు, ఫ్లాట్ నెం. 412, గణేష్ మిడోస్, గుడివాడ, కృష్ణా జిల్లా, ఎపి-521301. **3) శ్రీమతి తోట సావిత్రి,** భర్త : తోట వెంకటేశ్వరరావు, డి.నెం. 10/277-ఎ, రాజేంద్రనగర్, గుడివాడ, కృష్ణా జిల్లా, ఎపి-521301. **4) శ్రీమతి తోట సావిత్రి,** భర్త : తోట వెంకటేశ్వరరావు, ఫ్లాట్ నెం. 412, గణేష్ మిడోస్, గుడివాడ, కృష్ణా జిల్లా, ఎపి-521301.

ఆస్తి వివరములు :

శ్రీమతి తోట సావిత్రి, భర్త : తోట వెంకటేశ్వరరావు గారి పేరిట కృష్ణా జిల్లా, గుడివాడ సబ్ రిజిస్ట్రార్, పెదపారుపూడి మండలం, పెదపారుపూడి గ్రామం, ఆర్.ఎస్.నెం. 143/3, 146/1, ఫ్లాట్ నెం. 15 వద్ద 193 చ॥గ॥ల విస్తీర్ణంలోని ఖాళీ స్థలము. **హద్దులు : తూర్పు** : ఫ్లాట్ నెం. 14కి చెందిన ఆస్తి - 52.6 అ॥, **దక్షిణం :** ఇతరులకు చెందిన వ్యవసాయ భూమి - 33.00 అ॥, **పడమర :** ఫ్లాట్ నెం. 16కి చెందిన స్థలము - 52.6 అ॥, **ఉత్తరం** : 33 అ॥ వెడల్పు గల బజారు - 33.00 అ॥.

రిజర్వుధర (రూ.) : 5,67,000/-   ధరావత్తు ధర (రూ.) : రూ. 57,000/-   బిడ్ పెంపుదల మొత్తం : రూ. 10,000/-

వేలం అమ్మకం యొక్క వివరణాత్మక నిబంధనలు మరియు షరతుల కోసం **https://www.ibapi.in** మరియు **యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా** వెబ్ సైట్ : **www.unionbankofindia.co.in** నందు చూడగలరు. అధీకృత అధికారికి తెలిసిన సమాచారము ప్రకారం స్థిరాస్తిపై ఎటువంటి ఎన్‌కంబ్రెన్స్ లేదు, ఆసక్తిగల బిడ్డర్లు ఆస్తి పరిశీలన కోసం పైన పేర్కొన్న తేది నందు బ్రాంచి హెడ్ **మొబైల్ నెం. 91605 03232.,** బ్రాంచి **Mail ID : ubin0819131@unionbankofindia.bank**లలో సంప్రదించవచ్చు.

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 లోని రూలు 8(6)/ రూలు 9(1) అనుసరించి చట్టబద్ధమైన 15 రోజుల అమ్మకం నోటీసు

చెల్లించవలసిన బకాయిలను పూర్తిగా చెల్లించని సందర్భంలో పైన తెలిపిన తేదీన ఈ-వేలం అమ్మకం నిర్వహణ గురించి సదరు ఋణం తీసుకున్న ఋణగ్రహీత / సహబాధ్యతగల వారికి సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002లోని చట్టం 8(6)/రూలు 9(1) క్రింద దీనిని నోటీసుగా పరిగణించవలెను.

తేది : 27-03-2024
ప్రదేశం : గుడివాడ

సం/- అథరైజ్డ్ ఆఫీసర్,
యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా




మీ కోసం

వాత సమస్యలతో బాధపడేవారు దాల్చిన చెక్కను ఎండబెట్టి పొడి చేసుకుని వేడి పాలల్లో ఒక చెంచా వేసుకుని రోజూ తాగాలి.

జీవన సౌరభం

మంచి వ్యక్తిగా ఉండండి. అయితే దానిని నిరూపించుకునేందుకు సమయాన్ని వృథా చేయకండి.

విద్యే జీవితానికి సోపానం



పల్లవ దేశం పొలిమేరలోని పార్వతీపురంలో గురుకులం ఉంది. దానిని రామశర్మ నడిపిస్తున్నాడు. ఆ గురుకులానికి ఎంతో మంచి పేరు ఉంది. చుట్టుపక్కల ప్రాంతాల నుండే కాకుండా ఇతర దేశాల నుంచి కూడా విద్యార్థులు చదువుకోసం అక్కడికి వచ్చేవారు. ఆ విద్యా సంవత్సరం కొత్తగా పాతిక మంది వచ్చారు.

మొదటి రోజు అందరి పరిచయాలు అయ్యాయి. రెండవ రోజు రామశర్మ విద్యార్థులను అటు పక్కగా ఉన్న కొండ ప్రాంతానికి తీసుకెళ్లి 'ఆ కొండపైకి చేరుకోవాలంటే మెట్లు ఎక్కాలి. ప్రయాస పడకుండా నిదానంగా ప్రకృతిని గమనిస్తూ మెట్లు ఎక్కండి. మీకు పాఠం ఇప్పటి నుంచే మొదలవుతుంది' అన్నాడు రామశర్మ.'మనం చదువుకోవడానికి వచ్చామా, మెట్లు ఎక్కడానికి వచ్చామా?' అన్నాడు ఒక విద్యార్థి మెల్లగా. ఆ మాటలకు తలలాడించారు మరికొందరు. ఈలోపు రామశర్మ గబగబా మెట్లు ఎక్కి పిల్లల కోసం ఎదురుచూడసాగారు. పిల్లలందరూ కొండ మీదకు చేరుకున్నాక 'ఇప్పుడు కిందకు చూడండి' అన్నాడు రామశర్మ. 'అబ్బో చాలా మెట్లు ఎక్కాము!' అన్నాడు ఒక విద్యార్థి. 'మీరు ఎన్ని మెట్లు ఎక్కారో చెప్పగలరా?' అన్నాడు రామశర్మ. అందరూ గుసగుసలాడుకోసాగారు. 'గురువు గారూ! వంద మెట్లు ఎక్కాము' అన్నాడు రామయ్య అనే విద్యార్థి. 'మెట్లు ఎక్కుతూ మీరు ఏమి గమనించారు?' అన్నాడు రామశర్మ. 'ఒక చోట జామ చెట్టు ఉంది, మల్లె, మందారం పూల మొక్కలతో పాటు అక్కడక్కడా మూడు గుడిసెలు కూడా ఉన్నాయి' అన్నాడు రామయ్య. 'రామయ్యా! సరిగ్గా చెప్పావు. పిల్లలూ మీకు ముందే చెప్పాను. మెట్లు ఎక్కుతూ ప్రకృతిని గమనించాలి అని. ఎక్కిన ప్రతి మెట్టూ మీ విద్యకు సోపానం లాంటిది. విద్య అనంతమైనది. చివరి మెట్టు చేరుకున్నా మొదటి మెట్టును గుర్తుపెట్టుకోవాలి' అన్నాడు రామశర్మ. గురువు గారి మాటల్లో దాగున్న విద్యే జీవిత సోపానం అంశం విద్యార్థులకు బాగా అర్థమైంది. మరుసటి రోజు నుంచి ప్రతి విద్యార్థి ప్రతి అంశం మీద దృష్టి పెట్టి చదవసాగారు.

- యు.విజయశేఖర రెడ్డి,
99597 36475



తేడాలు గుర్తించండి

పిల్లలూ, ఇక్కడ ఒకేలా కనిపిస్తున్న ఈ రెండు బొమ్మల్లో పది తేడాలు ఉన్నాయి. గుర్తించండి చూద్దాం.



నేను గీసిన బొమ్మ



కె. ఈశ్వర్ చేతన్, 2వ తరగతి, నారాయణ టెక్నో, ఒంగోలు.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

చక్కని ఆరోగ్యానికి చల్లని పానీయాలు

ఓ వైపు ఎండలు.. మరో పక్క ఉమ్మదీత. ఇంకోవైపు వేసవి తాపానికి గొంతెండిపోతుండటం సహజం. ఈకాలంలో డీహైడ్రేషన్‌ను తగ్గించటానికి సహజ పానీయాలు ఎంతగానో ఉపయోగపడతాయి. అయితే ఈ పానీయాలను మనం ఇంట్లోనే తయారు చేసుకుంటే మంచిది. దీనివల్ల వేసవి తాపానికి ఉపశమనం కలగడంతోపాటుగా ఎలాంటి రుగ్మతలు దగ్గరకు రావు. అలాంటి ప్రకృతి పానీయాల గురించి తెలుసుకుని తాగితే వేసవిలో మన ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు. అలాంటి కొన్ని ప్రకృతి సిద్ధమైన పానీయాల గురించి తెలుసుకుందాం.

నిమ్మ-పుదీనా జ్యూస్ : సోడాలంటే చాలామందికి ఇష్టం. కానీ బయట దొరికే సోడాలన్నీ ఆరోగ్యానికి మంచివి కావు. అవి ఇష్టపడేవారు నిమ్మ- పుదీనా జ్యూస్‌ను ఇంట్లోనే తయారు చేసుకుని తీసుకుంటే మంచిది. ఒక గ్లాస్ నిమ్మ-పుదీనా జ్యూస్ తీసుకుంటే 76 కేలరీల శక్తి శరీరానికి అందుతుంది. వాటిలోని 40 గ్రా.సోడియం, 20.1 గ్రా. కార్బోహైడ్రేట్స్ శరీరానికి మేలు చేస్తాయి.

ఆరెంజ్ స్పోర్ట్స్ డ్రింక్ : ఎలక్ట్రోలైట్ అధికంగా ఉండే 100 శాతం సహజసిద్ధమైన జ్యూసులు డీ హైడ్రేషన్ నుంచి ఉపశమనాన్ని కల్గిస్తాయి. వాటిలో ముఖ్యమైనది ఆరెంజ్ స్పోర్ట్స్ డ్రింక్ ఒకటి. ఎండలో బాగా కష్టపడే వారికి, ఎక్కువగా అలసటకు గురయ్యే వారికి ఇది మంచి ఔషధంలా పనిచేస్తుంది. ఒక గ్లాసు ఆరెంజ్ స్పోర్ట్స్ డ్రింక్ తాగితే 61 కేలరీల శక్తి అందుతుంది. 162 మిల్లీ గ్రాముల సోడియం, 15.3 కార్బోహైడ్రేట్స్ మీ శరీరానికి అందుతాయి. ఇది జీరో కొలెస్ట్రాల్ డ్రింక్.

దానిమ్మ రసం : ఇంట్లో రెండే రెండు నిముషాల్లో తయారుచేసుకోగల ఈ దానిమ్మ రసం ఆరోగ్యానికి ఎంతో మంచిది. ఒక గ్లాసు దానిమ్మ జ్యూస్‌తో 75 కేలరీల శక్తి శరీరానికి అందుతుంది. ఈ రసంలో 18.5 గ్రాముల కార్బోహైడ్రేట్స్, జీరో కొలెస్ట్రాలు ఉంటాయి.

వాటర్ మెలన్ చిల్లర్ : వేసవిలో ఎక్కువ



మంది ఇష్టంగా తినేది పుచ్చకాయ. దీంతో, జ్యూస్‌ను చాలా సులభంగా ఇంట్లోనే తయారుచేసుకోవచ్చు. పుచ్చకాయ, దానిమ్మ, నిమ్మ కాంబినేషన్‌లో తయారుచేసిన 'వాటర్ మిలన్ చిల్లర్' జ్యూస్ నోటికి రుచిగా ఉంటుంది. శరీరానికి 87 కేలరీల శక్తిని అందజేస్తుంది. కొలెస్ట్రాలు ఉండవు. గ్లాసు వాటర్‌మిలన్ చిల్లర్‌తో 22.1 గ్రాముల కార్బోహైడ్రేడ్స్, 1.1 గ్రాముల ప్రొటీన్ శరీరానికి అందుతుంది.

పుల్లటి వాటర్ : వేసవి ఈ పానీయం శరీరానికి ఎంతో చల్లదనాన్ని ఇస్తుంది. ఒక గ్లాసు నీటిలో దోసకాయ ముక్క, కొన్ని పుదీనా ఆకులు, నారింజ ముక్కలను ఉంచితో ఈ నీటిని పుల్లటి రుచి వస్తుంది. విటమిన్ సి కూడా అందులో సమృద్ధిగా ఉంటుంది. ఈ ఆరోగ్యకరమైన పానీయంలో యాంటీ ఆక్సిడెంట్ లక్షణాలుంటాయి. వేడి దద్దుర్ల నుంచి రక్షిస్తుంది.

నిమ్మకాయ, పుదీనా పానీయం : ఒక గ్లాసు నీటిలో కొన్ని పుదీనా ఆకులు, నిమ్మముక్కలు ఉంచి 15 నిముషాలు మరిగించాలి. అది చల్లారిన తర్వాత తేనె కలపాలి. ఇది వేసవి వేడి, నిర్జలీకరణం నుంచి మనల్ని రక్షించడానికి దోహదపడుతుంది.

ఆరెంజ్ జ్యూస్ : ఆరెంజ్ నుంచి జ్యూస్ తీసి దానికి చిటికెడు ఉప్పు కలపాలి. ఈ పానీయంలో విటమిన్ సి, ఎలక్ట్రోలైట్స్ సమృద్ధిగా ఉంటాయి. నిర్జలీకరణ నుంచి రక్షిస్తుంది. ఇది కూడా ఉత్తమమైన ఆరోగ్యకరమైన వేసవి పానీయాల్లో ఒకటిగా చెప్పొచ్చు.

వెన్నతీసిన పాలు : ఈ పానీయంలో ప్రొటీన్లు సమృద్ధిగా కేలరీలు తక్కువగా ఉంటాయి. వేడిని తగ్గించటానికి ఇవి దోహదపడతాయి. దాహార్తిని తీరుస్తుంది. ఆకలి పెరుగుతుంది.

పెరుగు పానీయం : ఒక కప్పు పెరుగులో



కొంత నీరు, జీలకర్ర, అల్లం ముక్కలు, చిటికెడు ఉప్పు వేయాలి. ఈ పానీయం తయారుకావటానికి బాగా కలపాలి. దీనిలో మంచి బ్యాక్టీరియా (ప్రోబయోటిక్స్). ఆక్సీకరణ, ఎలక్ట్రోలైట్స్ సమృద్ధిగా ఉంటాయి. ఇది నిర్జలీకరణం నుంచి కాపాడుతుంది.

రోజ్ వాటర్ : నీటిలో కొంచెం కుంకుమ పువ్వు, తాజా గులాబీ రేకులు వేసి కొంచెంసేపు మరగించాలి. రాత్రిపూట అలా ఉంచి మరుసటి రోజు ఉదయం తేనె కలపాలి. ఈ సీజన్‌లో ఉత్తమ వేసవి పానీయాల్లో ఇది కూడా ఒకటి.

ఐస్‌తో బటర్‌మిల్క్ : కొంత పెరుగును తీసుకుని దానికి ఉప్పు, కొద్దిగా తేనె, స్ట్రాబెర్రీ గుజ్జు, కొన్ని ఎండిన పుదీనా ఆకులు కలపాలి. చల్లగా కావాలనుకుంటే కొన్ని ఐస్ క్యూబ్స్ కూడా వేసుకోవచ్చు. ఈ పానీయాన్ని తీసుకుంటే మనల్ని తాజాగా ఉంచుతుంది.

కర్బూజా, పుచ్చకాయ పానీయం : కర్బూజా, పుచ్చకాయ ముక్కలను జ్యూసర్‌లో వేసి జ్యూస్ తీయాలి. దీనికి అర స్పూన్ తేనె, చిటికెడు ఉప్పు కలపాలి. కొంచెం జీలకర్ర, తాజా పుదీనా ఆకులను కలపాలి. ఆ తర్వాత సేవిస్తే అధిక చెమటలను తగ్గిస్తుంది. శరీరం చల్లగా ఉంటుంది.

మహిళలూ ... ఈ విటమిన్లు అందేలా చూసుకోండి!

ఆరోగ్య పరిరక్షణలో సమతుల్య ఆహారం కీలక పాత్ర పోషిస్తుంది. మహిళలు తమ డైట్‌లో కచ్చితంగా పోషకాలు ఉండే ఆహారాన్ని తీసుకోవాలి. మహిళలు వయస్సు పెరిగే కొద్దీ అనేక ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటారు. రుతుస్రావం నుంచి ప్రెగ్నెన్సీ, డెలివరీ, మెనోపాజ్ వరకూ ఇలా శరీరంలో అనేక మార్పులు చోటుచేసుకుంటాయి. రక్తహీనత, నీరసం, అలసట, తలనొప్పి, రోగ నిరోధకశక్తి తగ్గటం, ప్రెగ్నెన్సీ సంబంధిత రుగ్మతలు, రొమ్ము క్యాన్సర్, ఆర్థరైటిస్, ఓవేరియన్, పాలీసిస్టోసిస్ వంటి సమస్యలతో ఎక్కువగా ఇబ్బందులు పడుతుంటారు. వయస్సు రీత్యా మహిళలకు శరీరంలో వచ్చే మార్పుల కారణంగా వారికి పలు రకాల విటమిన్లు అవసరమవుతాయి. మగవారితో పోలిస్తే మహిళలకు ప్రత్యేకంగా కొన్ని విటమిన్లు అవసరమవుతాయి. వాటి గురించి ఇప్పుడు తెలుసుకుందాం.

విటమిన్-ఎ : మహిళల ఆరోగ్యానికి విటమిన్-ఎ కీలకమైంది. ఇందులో యాంటీ ఆక్సిడెంట్లు ఉంటాయి. ఎముకలు, దంతాలు ఆరోగ్యంగా ఉండటానికి 'ఎ' విటమిన్ తీసుకోవటం అత్యంత అవసరం. దీనికోసం టమోటా, క్యారెట్, బొప్పాయి, గుమ్మడికాయ, పాలకూర, చేపలు, పాలు, గుడ్లు, పుచ్చకాయ వంటివి ప్రతిరోజూ తీసుకుంటుండాలి.

విటమిన్-సి : రోగ నిరోధక శక్తికి పెంపొందించుకోవటానికి తప్పకుండా రోజువారీ డైట్‌లో తీసుకోవాలి. ఇది రొమ్ము క్యాన్సర్ వంటి వ్యాధులను నిరోధిస్తుంది. గర్భిణులు, పాలిచ్చే తల్లుల ఆరోగ్యానికి ఇది ఎంతో అవసరం. ఇది సిట్రస్ ఫ్రూట్స్, బంగాళా దుంపలు, స్ట్రాబెర్రీస్, టమాటో, జామ, ఉసిరి వంటి వాటిలో లభిస్తుంది.

విటమిన్-డి : శరీరంలో కాల్షియం పెరుగుదలకు అవసరమైన 'డి' విటమిన్ మహిళల ఆరోగ్యానికి అత్యంత అవసరం. వయస్సుపైబడే కొద్దీ కీళ్ల అరుగుదల, కీళ్ల నొప్పులు వంటివి రాకుండా ఉండేందుకు విటమిన్-డి తీసుకోవటం అవసరం. ఇంటిపట్టునే ఉండే గృహిణుల్లో ఈ విటమిన్ ఎక్కువగా లోపిస్తుంది. అలాంటివాళ్ల రోజుకు కాసేపు ఎండలో ఉండటం అవసరం.

విటమిన్-బి3 : కణాల పనితీరు, పోషకాలను గ్రహించటంలో, నాడీ వ్యవస్థ పనితీరులో 'బి3' విటమిన్ కీలకం. ఇది ట్యూనా చేపలు, వేరుశెనగలు, పుట్టగొడుగులు, గోధుమలు, పాలు, గుడ్లు, బీన్స్ వంటి వాటిలో ఉంటుంది.



విటమిన్-బి6 : హార్మోన్ల ఉత్పత్తికి, మెదడు ఆరోగ్యానికి, రక్తహీనత వంటి సమస్యలను నివారించటానికి విటమిన్-బి6 అవసరం. దీనికోసం డ్రైఫ్రూట్స్, నట్స్, ఎగ్స్, ముడి ధాన్యాలు, బీన్స్, అరటిపండ్లు, మాంసం, ఓట్లు వంటివి తీసుకోవాలి.

చంద్రబాబు కోరుకునే రాష్ట్ర ప్రయోజనాల్లో

స్టీల్‌ప్లాంట్ స్థానం ఎక్కడ?

- ఉక్కు ఫ్యాక్టరీ వైపు కన్నెత్తి చూడలేదెందుకు!
- నామమాత్రంగానే రాష్ట్ర ప్రభుత్వ స్పందన
- విశాఖ కార్మికులు, ప్రజల్లో నడుస్తోన్న చర్చ



ప్రజాశక్తి- గ్రేటర్ విశాఖ బ్యూరో

రాష్ట్ర విస్తృత ప్రయోజనాలు, ప్రజల భవిష్యత్తు కోసమే బిజెపితో తెలుగుదేశం పార్టీ పొత్తు పెట్టుకుందని ప్రకటించిన చంద్రబాబుకు మూడేళ్లుగా స్టీల్‌ప్లాంట్ గుర్తుకు రాకపోవడం చర్చనీయాంశంగా మారింది. రాష్ట్ర విభజన తర్వాత రాష్ట్రానికి ప్రత్యేక హోదా, పోలవరం ప్రాజెక్టు తర్వాత వెంటనే వినపడేది వైజాగ్ స్టీల్‌ప్లాంట్ రక్షణ అన్నది ఆ పార్టీ నాయకులు సైతం చటుక్కున చెబుతారు. కేంద్రంలోని మోడీ సర్కారు మూడేళ్ల క్రితం విశాఖ స్టీల్‌ప్లాంట్ వంద శాతం వ్యూహాత్మక అమ్మకం చేస్తున్నట్లు తీసుకున్న నిర్ణయాన్ని రాష్ట్రంలోని ప్రధాన ప్రతిపక్ష అధినేత, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు వ్యతిరేకించలేదు. ఇటీవల కేంద్రంలోని బిజెపితో పొత్తు పెట్టుకున్నప్పుడు సైతం టిడిపి, జనసేన అధినేతలు స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణను ఆపుతామని చెప్పకపోవడం ఏ ప్రయోజనాల కోసం వీరు బిజెపితో కలిశారు? అన్న ప్రశ్న రాష్ట్రంలోని కార్మికులే కాదు అన్ని తరగతుల నుంచీ వినిపిస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం, అధికార వైసిపి నామ్‌కేవాస్తేగా ఒక తీర్మానం చేసిందే తప్ప, ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా కేంద్రాన్ని నిలేసింది లేదు.

వారి తీరు అలా ఉంటే, వీరి తీరు ఇలా ఉంది.

కనీసం ఆ సభలోనైనా ప్రకటన వస్తుందని...

చిలకలూరిపేటలో ఇటీవల జరిగిన బిజెపి, టిడిపి, జనసేన (కూటమి) సభకు దేశ ప్రధానమంత్రి మోడీ ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఆయన ద్వారా చంద్రబాబు, పవన్ కల్యాణ్ 'స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ జరగదు' అన్న ప్రకటన చేయిస్తారన్న ఆశతో కార్మికులు చూశారు. కానీ, సభ అంతా పూర్తయినా స్టీల్‌ప్లాంట్ ఊసే లేకపోవడం ప్రజలను తీవ్ర మనస్తాపానికి గురిచేసింది. మోడీ ప్రభుత్వం విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు కుట్రలు కొనసాగిస్తుండడంతో పాటు సొంత గనులు ఇవ్వకుండా ప్లాంట్‌ను ఎండగట్టేసింది. బ్లాస్ట్ ఫర్నేస్-3లోకి జిందాల్‌ను తీసుకొచ్చేసింది. పలు విభాగాలను ముక్కలు ముక్కలు చేసి ప్రయివేట్ వారికి ఇచ్చేయాలన్న కుట్రలు బిజెపి చేస్తూనే ఉంది.

ఎందుకు పర్యటించడం లేదు?

వైజాగ్ స్టీల్‌ను రక్షించుకోవడానికి 1144 రోజులు పోరాటం కొనసాగుతున్నా ఏనాడూ ప్లాంట్ పర్యటనకు చంద్రబాబు రాలేదు. కార్మికులను కలవడంగానీ, వారి పోరాటానికి మద్దతు ప్రకటించడంగానీ చేయలేదు. ఇది స్టీల్‌ప్లాంట్ కార్మికుల్లో తీవ్ర అసంతృప్తిని కలిగించింది. కేంద్రం స్టీల్ ప్లాంట్‌ను ప్రయివేటీకరించాలని నిర్ణయిస్తే ఆ పార్టీతో మీరెలా పొత్తుపెట్టుకున్నారంటూ ఉక్కులో టిఎన్‌టియుసి నేతలను మిగతా కార్మికులు ప్రశ్నిస్తుండడంతో వారి నోట సమాధానం రావడం లేదు. విశాఖ స్టీల్‌ప్లాంట్ వద్ద లేదా రాష్ట్రంలో ఎక్కడ సభ నిర్వహించినా వైసిపి కబంధ హస్తాల్లో రాష్ట్రం చిక్కుకుందంటూ చంద్రబాబు, పవన్ కల్యాణ్ అన్నారే తప్ప, స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ సరైంది కాదని ప్రకటించలేదు. టిడిపి నాయకుడు పల్లా శ్రీనివాసరావు (గాజువాక టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి) దీక్ష చేసినప్పుడు సైతం ఆయనను పరామర్శించడానికి రాలేదంటే బిజెపి నిర్ణయాన్ని వ్యతిరేకించే ఉద్దేశం చంద్రబాబుకు లేదని స్పష్టమవుతోంది.

నాగర్‌నార్ ఉక్కు ఫ్యాక్టరీ ప్రతిపక్షాల ఆందోళనతో నిలవలేదా?

కేంద్ర ప్రభుత్వ నిరంకుశ విధానాలపై ప్రజలు, కార్మికులు చేస్తోన్న పోరాటాలు ఆయా రాష్ట్రాల్లోని అధికార పక్షం లేదా ప్రతిపక్షం కలిసి వస్తే విజయం అవుతాయి. దీనికి ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని నాగర్‌నార్ ఉక్కు ఫ్యాక్టరీ పరిరక్షణ పోరాటం తాజా ఉదాహరణ. ఈ ఫ్యాక్టరీని బిజెపి ప్రయివేటీకరణకు పెట్టిన సందర్భంగా అక్కడి ప్రతిపక్షాలు పోరాడి నిలుపుదల చేశాయి. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రయివేటీకరణ విషయంలో మన రాష్ట్రంలో అధికార, ప్రతిపక్షాలు రెండూ బిజెపి నిర్ణయాన్ని గట్టిగా వ్యతిరేకించడం లేదు. 2024 ఎన్నికల్లో అధికారం కోసం ఆశిస్తోన్న టిడిపి, ఈ రాష్ట్ర జనహితం, భవిష్యత్తు కోసం దేనికైనా సిద్ధం అని చెప్పుకుంటున్న జనసేన కూడా బిజెపికి వంతపాడుతూ వస్తున్నాయి. బిజెపితో పొత్తు జనహితమేనని జనసేన అధినేత పవన్ కల్యాణ్ చెబుతున్నప్పుడు వైజాగ్ స్టీల్‌ప్లాంట్ జనహితం కాదా? అనేది చెప్పాలి.

బిటెక్ విద్యార్థిని ఆత్మహత్య

ప్రజాశక్తి- ధర్మవరం టౌన్ (శ్రీ సత్యసాయి జిల్లా)



రాజేశ్వరి (ఫైల్)

శ్రీ సత్యసాయి జిల్లా ధర్మవరం పట్టణానికి చెందిన బిటెక్ విద్యార్థిని ఆదివారం ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటనకు సంబంధించిన టూ టౌన్ పోలీసులకు అందిన ఫిర్యాదు మేరకు... కేతిరెడ్డి కాలనీకి చెందిన చింతా చిదంబరం, శారద దంపతుల కుమార్తె చింతా రాజేశ్వరి (21) పుట్టపర్తిలోని సంస్కృత కళాశాలలో బిటెక్ ప్రథమ సంవత్సరం చదువుతోంది. ఆమె తరచూ కడుపు నొప్పితో బాధపడుతుండేది. పలు ప్రయివేటు ఆస్పత్రుల్లో చికిత్స చేయించినా నయం కాలేదు. ఈ క్రమంలో ఆదివారం తెల్లవారుజామున తన ఇంట్లోని గదిలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఎంతసేపటికీ బయటకు రాకపోవడంతో అనుమానం వచ్చిన కుటుంబసభ్యులు కిటికిలోనుంచి చూడగా రాజేశ్వరి ఉరివేసుకుని విగతజీవిగా కన్పించింది. దీనిపై టూ టౌన్ పోలీసులకు వారు సమాచారం ఇచ్చారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చర్చల సమయంలో కుదిరిన

ఒప్పందాలు అమలు చేయాలి

- ఆశా వర్కర్ల యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధనలక్ష్మి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

రాష్ట్ర వ్యాప్తంగా ఆశా వర్కర్ల నిరసన దీక్షల నేపథ్యంలో ప్రభుత్వం తరుపున వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖ కమిషనర్ హామీ ఇచ్చిన అంశాలపై జిఒలను వెంటనే విడుదల చేయాలని ఎపి ఆశా వర్కర్ల యూనియన్ (సిఐటియు) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె ధనలక్ష్మి డిమాండ్ చేశారు. లేని పక్షంలో మారోమారు ఉద్యమం తప్పదని హెచ్చరించారు. శ్రీకాకుళం జిల్లా పర్యటనలో భాగంగా యుటిఎఫ్ కార్యాలయంలో ఆదివారం ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా విస్తృతస్థాయి సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత నెల 7, 9 తేదీల్లో నాయకత్వంతో ఆశా వర్కర్ల సమస్యలపై జరిగిన చర్చల మినిట్స్ కాపీ అదే నెల 20న ఇచ్చారని అన్నారు. చర్చల సందర్భంగా అంగీకారం కుదిరిన అంశాల్లో కొన్నింటికి మినిట్స్ కాపీల్లో ప్రస్తావించలేదని తెలిపారు. ప్రభుత్వ, మెడికల్ సెలవులు అమలు చేయాలని, ఆశా కార్యకర్తలు మృతి చెందితే దహన సంస్కారాలకు ప్రభుత్వం తక్షణ ఆర్థికసాయం కింద రూ.20 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆశా వర్కర్ల న్యాయమైన కోర్కెలను ఆమోదిస్తూ మినిట్స్ కాపీని సవరించి తక్షణమే జారీ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

గుజరాత్ ఆల్‌రౌండ్ షో

- ఓడిన సన్‌రైజర్స్

ఐపిఎల్ 2024లో గుజరాత్ టైటాన్స్‌తో ఆదివారం జరిగిన మ్యాచ్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ చిత్తుగా ఓడింది. బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్ అన్ని విభాగాల్లో అదరగొట్టిన అతిథ్య జట్టు గుజరాత్ టైటాన్స్ ఆల్ రౌండ్ షోతో సన్‌రైజర్స్‌పై 7 వికెట్ల తేడాతో ఘనవిజయం సాధించింది.



అహ్మదాబాద్ : ఐపిఎల్ 2024లో భాగంగా గుజరాత్ టైటాన్స్‌తో జరిగిన మ్యాచ్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ పరాజయంపాలైంది. బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్ అన్ని విభాగాల్లో అదరగొట్టిన అతిథ్య జట్టు గుజరాత్ టైటాన్స్ ఆల్ రౌండ్ షోతో సన్‌రైజర్స్‌పై 7 వికెట్ల తేడాతో ఘనవిజయం సాధించింది. హైదరాబాద్ విసిరిన 163 పరుగుల లక్ష్యాన్ని గుజరాత్ సునాయసంగా ఛేధించింది. ఆ జట్టు బ్యాటర్లు సాయి సుదర్శన్ (44), డేవిడ్ మిల్లర్ (44), శుభ్‌మన్ గిల్ (36) చెలరేగారు. ముంబై ఇండియన్స్‌తో జరిగిన చివరి మ్యాచ్‌లో బ్యాటింగ్‌లో 277 పరుగుల భారీ స్కోర్ సాధించిన హైదరాబాద్ బ్యాటర్లు ఈసారి మాత్రం తేలిపోయారు. గుజరాత్ బౌలర్లు కట్టడి చేయడంతో సన్‌రైజర్స్ 162/8 పరుగులు మాత్రమే చేసింది. బౌలర్ మోహిత్ శర్మ (3/25) హైదరాబాద్‌ను కట్టడి చేశాడు. ఈ సీజన్లో గుజరాత్‌కు ఇది రెండో విజయం.

163 పరుగుల మోస్తారు లక్ష్యంతో బరిలోకి దిగిన గుజరాత్ టైటాన్స్ స్పిన్నర్ షాబాజ్ అహ్మద్ వేసిన ఐదో ఓవర్లో వృద్ధిమాన్ సాహా వికెట్ కోల్పోయింది. ధాటిగా ఆడిన సాహా ఒక ఫోర్, 2 సిక్సులతో 13 బంతుల్లో 25 పరుగులు చేశాడు. అనంతరం సాయి సుదర్శన్‌తో కలిసి మరో ఓపెనర్ గిల్ రెండో వికెట్‌కు 38 పరుగులు జోడించాడు. అయితే 2 ఫోర్లు, ఒక సిక్సుతో 28 బంతుల్లో 36 పరుగులు చేసిన గిల్‌ను మరో స్పిన్నర్ మయాంక్ మార్కండే 10వ ఓవర్‌లో పెవిలియన్ చేర్చాడు. దీంతో 74 పరుగులకు గుజరాత్ 2 వికెట్లు కోల్పోయింది. అనంతరం సాయి సుదర్శన్, మిల్లర్ కలిసి మూడో వికెట్‌కు 64 పరుగుల హాఫ్ సెంచరీ భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. అయితే హాఫ్ సెంచరీకి చేరువ అవుతున్న సాయి సుదర్శన్‌ను 17వ ఓవర్లో పాట్ కమిన్స్ పెవిలియన్ చేర్చాడు. 36 బంతులు ఎదుర్కొన్న సాయి సుదర్శన్ 4 ఫోర్లు, ఒక సిక్సుతో 45 పరుగులు చేశాడు. దీంతో 138 పరుగుల వద్ద గుజరాత్ మూడో వికెట్ కోల్పోయింది. అనంతరం మిల్లర్ ధాటిగా బ్యాటింగ్ చేశాడు. విజయ్ శంకర్‌తో కలిసి మిల్లర్ లాంఛనాన్ని పూర్తి చేశాడు. చివరి ఓవర్ మొదటి బంతిని సిక్సు కొట్టి మిల్లర్ జట్టును గెలిపించాడు. దీంతో సన్‌రైజర్స్‌పై 7 వికెట్ల తేడాతో గుజరాత్ ఘనవిజయం సాధించింది. 4 ఫోర్లు, 2 సిక్సులతో 27 బంతుల్లో 44 పరుగులు చేసిన మిల్లర్.. 11 బంతుల్లో 14 పరుగులు చేసిన విజయ్ శంకర్ నాటౌట్‌గా నిలిచారు. హైదరాబాద్ బౌలర్లలో పాట్ కమిన్స్, షాబాజ్ అహ్మద్, మయాంక్ మార్కండే తలో వికెట్ తీశారు.

సన్‌రైజర్స్‌ను దెబ్బ తీసిన అఫ్ఘాన్ బౌలర్లు

అంతకుముందు టాస్ గెలిచి బ్యాటింగ్ ప్రారంభించిన సన్‌రైజర్స్ హైదరాబాద్ అజ్మతుల్లా ఒమర్జాయ్ వేసిన ఐదో ఓవర్‌లో ఓపెనర్ మయాంక్ అగర్వాల్(16) వికెట్ కోల్పోయింది. కాసేపటి తర్వాత మరో ఓపెనర్ ట్రావిస్ హెడ్(19)ను స్పిన్నర్ నూర్ అహ్మద్ క్లీన్ బౌల్డ్ చేశాడు. దీంతో 58 పరుగులకు హైదరాబాద్ జట్టు ఓపెనర్ల వికెట్లు కోల్పోయింది. అనంతరం మార్‌క్రమ్‌తో కలిసి అభిషేక్ శర్మ ఇన్నింగ్స్‌ను ముందుకు తీసుకెళ్లాడు. అయితే అభిషేక్ శర్మను 10వ ఓవర్‌లో సీనియర్ మోహిత్ శర్మ ఔట్ చేశాడు. 2 ఫోర్లు, 2 సిక్సులతో 20 బంతుల్లో అభిషేక్ శర్మ 29 పరుగులు చేశాడు. అనంతరం క్రీజులోకి వచ్చిన క్లాసెన్ తన ఇన్నింగ్స్‌ను ధాటిగా ప్రారంభించాడు. ఈ క్రమంలో మార్‌క్రమ్‌తో కలిసి జట్టు స్కోర్‌ను 100 పరుగులు దాటించాడు. అయితే ధాటిగా ఆడుతున్న క్లాసెన్‌ను 14వ ఓవర్‌లో స్పిన్నర్ రషీద్ ఖాన్ క్లీన్ బౌల్డ్ చేశాడు. ఒక ఫోర్, 2 సిక్సులతో క్లాసెన్ 13 బంతుల్లో 24 పరుగులు చేశాడు. సన్‌రైజర్స్ కీలక బ్యాటర్లైనా మయాంక్ అగర్వాల్, ట్రావిస్ హెడ్, క్లాసెన్‌ను అఫ్ఘానిస్థాన్ బౌలర్లు అజ్మతుల్లా ఒమర్జాయ్, నూర్ అహ్మద్, రషీద్ ఖాన్ తీయడం గమనార్హం.

ఆదుకున్న సమద్, షాబాజ్

ఆ తర్వాతి ఓవర్‌లోనే మార్‌క్రమ్(17)ను ఉమేష్ యాదవ్ ఔట్ చేశాడు. రషీద్ ఖాన్ సూపర్ క్యాచ్‌తో మార్‌క్రమ్ ఔట్ అయ్యాడు. దీంతో 114 పరుగులకే సన్‌రైజర్స్ సగం వికెట్లు కోల్పోయింది. ఇలాంటి సమయంలో సన్‌రైజర్స్‌ను షాబాజ్ అహ్మద్, అబ్దుల్ సమద్ ఆదుకున్నారు. వీరిద్దరు ఆరో వికెట్‌కు 28 బంతుల్లో 45 పరుగులు జోడించార్నె. దీంతో సన్‌రైజర్స్ స్కోర్ 150 పరుగులు దాటింది. ధాటిగా ఆడిన సమద్ స్కోర్ బోర్డును పరుగులు పెట్టించాడు. అయితే ఇన్నింగ్స్ చివరి ఓవర్లో షాబాజ్ అహ్మద్(22), వాషింగ్టన్ సుందర్‌ను మోహిత్ శర్మ వరుస బంతుల్లో ఔట్ చేశాడు. సుందర్ డకౌట్ అయ్యాడు. 3 ఫోర్లు, ఒక సిక్సులతో 15 బంతుల్లో 30 పరుగులు చేసిన అబ్దుల్ సమద్ ఇన్నింగ్స్ చివరి బంతికి రనౌట్ అయ్యాడు. దీంతో చివరి ఓవర్లో 3 పరుగులు మాత్రమే రాగా 3 వికెట్లు పడ్డాయి. గుజరాత్ బౌలర్లలో మోహిత్ శర్మ 3 వికెట్లతో చెలరేగాడు.

ఢిల్లీ మురిసింది

- చెన్నైపై క్యాపిటల్స్ ఘన విజయం
- అర్థ సెంచరీతో మెరిసిన పంత్
- ఢిల్లీ 191/5, చెన్నై 171/6

విశాఖపట్నం : ఎట్టకేలకు ఢిల్లీ క్యాపిటల్స్ ఓ విజయం సాధించింది. ఐపీఎల్17లో వరుసగా తొలి రెండు మ్యాచుల్లో తేలిపోయిన ఢిల్లీ క్యాపిటల్స్ ఆదివారం విశాఖపట్నంలో అగ్రజట్టు చెన్నై సూపర్‌కింగ్స్‌పై 20 ఘన విజయం సాధించింది. వైజాగ్‌లో తొలి రెండు ఆతిథ్య మ్యాచులు ఆడుతున్న ఢిల్లీ క్యాపిటల్స్.. ఇక్కడ తొలి మ్యాచ్‌లోనే బోణీ కొట్టింది. 192 పరుగుల భారీ ఛేదనలో చెన్నై సూపర్‌కింగ్స్ చతికిల పడింది. లోతైన బ్యాటింగ్ లైనప్ కలిగిన సూపర్‌కింగ్స్‌ను క్యాపిటల్స్ చిత్తు చేసింది. రుతురాజ్ గైక్వాడ్ (1), రచిన్ రవీంద్ర (2), శివం దూబె (18), సమీర్ రిజ్వీ (0) నిరాశపరిచారు. డార్లీ మిచెల్ (34, 26 బంతుల్లో 1 ఫోర్, 2 సిక్సులు) అంచనాలను అందుకోలేదు. అజింక్య రహానె (45, 30 బంతుల్లో 5 ఫోర్లు, 2 సిక్సులు), డార్లీ మిచెల్ (34, 26 బంతుల్లో 1 ఫోర్, 2 సిక్సులు), ఎం.ఎస్ ధోని (37 నాటౌట్, 16 బంతుల్లో 4 ఫోర్లు, 3 సిక్సులు), రవీంద్ర జడేజా (21 నాటౌట్, 17 బంతుల్లో 2 ఫోర్లు) మెరిసినా చెన్నై సూపర్‌కింగ్స్ 20 ఓవర్లలో 6 వికెట్లకు 171 పరుగులే చేసింది. 20 పరుగుల తేడాతో ఢిల్లీ క్యాపిటల్స్ సీజన్లో తొలి విజయం నమోదు చేసింది. తొలుత బ్యాటింగ్ చేసిన ఢిల్లీ క్యాపిటల్స్ 20 ఓవర్లలో 5 వికెట్లకు 191 పరుగులు చేసింది. కెప్టెన్ రిషబ్ పంత్ (51, 32 బంతుల్లో 4 ఫోర్లు, 3 సిక్సులు), ఓపెనర్ డెవిడ్ వార్నర్ (52, 35 బంతుల్లో 5 ఫోర్లు, 3 సిక్సులు) అర్థ సెంచరీలతో రాణించారు. చెన్నై సూపర్‌కింగ్స్‌కు సీజన్లో ఇదే తొలి పరాజయం.

మెరిసిన పంత్ : సొంత మైదానం విశాఖలో తొలుత బ్యాటింగ్ చేసిన ఢిల్లీ క్యాపిటల్స్ భారీ స్కోరు సాధించింది. ఓపెనర్లు డెవిడ్ వార్నర్ (52), పృథ్వీ షా (43, 27 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్సులు) తొలి వికెట్‌కు 93 పరుగుల భారీ భాగస్వామ్యం నమోదు చేశారు. ఓపెనర్లు భారీ స్కోరుకు గట్టి పునాది వేయగా కెప్టెన్ రిషబ్ పంత్ (51) దంచికొట్టాడు. మిచెల్ మార్ష్ (18), అక్షర్ పటేల్ (7 నాటౌట్) ఆఖర్లో ఫర్వాలేదనిపించారు.

ఐపిఎల్‌లో నేడు : ముంబయి X రాజస్థాన్

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68